UNIVERSAL LIBRARY
OU_204758
UNIVERSAL LIBRARY

# PADUKA PATTABISHEKAM

A DRAMA

BY


Late Kollachellam Sreenivasa Rao Garu,

PLEADER, BELLARY



PUBLISHED BY

K. SATHRUGHNA RAO,

FIRST EDITION.

PRINTED AT L. R. PRESS, MADRAS.

1926



*Registered Copyright.*

శ్రీ

# పాదుకాపట్టాభిషేకనాటకము.

ఇది

బళ్లారిజిల్లా బళ్లారి మునసఫ్‌కోర్టు వకీలుగానుండిన

కీ. శే. కోలాచలం శ్రీనివాసరావుచే

రచియింపఁబడినది.

కె. శత్రుఘ్నరావుచే

ప్రకటింపఁబడియె.

మొదటి కూర్పు.

చెన్నపురి

కలారత్నాకర ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1920.

*Registered Copy-Right.*

వెల 1—4—0. తపాల ఖర్చు 0—1—0.

శ్రీ

# పీఠిక.

బళ్లారీ పట్టణంబున "సుమనోరమ" యనునాటక సంఘ మొకటి యుండెను. ఆసంఘము వారు నాచే రచింపఁబడిన నాటకములనేకములు ప్రదర్శించుచుండిరి. ఆనాటకములలో "రామాయణనాటకమాల" యనునవి కొన్ని యుండెను. శ్రీరామజననము నుండి లంకా దహనము వఱకును, ఉత్తర రామాయణములోని లవకుశ నాటకమును రచించి పాదుకాపట్టాభిషేక నాటకము నీపట్టణవాసులుగ నుండి కీర్తిశేషులైన ధర్మవరము కృష్ణమాచార్యులవారు రచించియుండిన కతంబున నే వ్రాయక వదలితిని. ఆ కారణము మాసభ వారికిఁ దృప్తికరముగ లేక, తమకు ప్రత్యేకముగ నొకనాటక మవశ్యమని నన్ను బాధింప నే నాటకమును రెండంకములు వ్రాయునంతలో దేహారోగ్యము తప్పినందున దానిని ముగింపక నిలిపియుంటిని.

2. మాసభలోఁ జేరిన పాత్రధారులు కొందఱు చేరి యిటీవల నూతనసభ నేర్పఱిచికొని నానాటకము లాడుచున్నారు. వారును "పాదుకాపట్టాభిషేక" మాడవలెనను కుతూహలమున నీనాటకమును బూర్ణీకరించియిండి, యని నన్ను వేఁడ వారి యిష్టానుసారంబుగ నే వ్రాసితిని. ఒక పట్టణములోనే వేర్వేఱు కవులు రచించిన రెండునాటకము లుండుట చెడుగు. కవులకు స్పర్థలు లేకయున్నను నాయాసంఘము వారికి నభిమాన సాంబంధిక మనస్తాపములు కలుగుచుండును. దుర్వాదములును ప్రబలును.

3. పురాణనాటకములు రచించుటయందుఁ గవులకుఁ బద సంఘటన కష్టముతప్ప నితివృత్త చమత్కార కల్పనాకష్ట మేమియును లేదు. మహనీయు లగు వాల్మీకివ్యాసాదు లా విషయమున రాజ మార్గ మేర్పఱిచినారు. కవు లామార్గమును బట్టికొని యిష్టానుసారము సంచరింపవచ్చును. పురాణనాటకములు పూర్వాచార పరాయణులగు మనవారికి రుచించినటుల చరిత్రనాటకములంతగ రుచింపవు. అయినను నాచే నిప్పటికి రచింపఁబడిన ముప్పదినాటకములలో నెనిమిదినాటక ములు చరిత్రనాటకము లున్నవి.

4. ఈ నాటకమునవచ్చు మంథర కైకలు సహజదుర్వినీతలో కారో యని తెలుపుటకు నచట నచటఁ గొన్ని సందర్భముల‌ను వదలక వ్రాసినాఁడను. గుహునిరంగమును భరద్వాజాశ్రమరంగమును కథా సందర్భ శుద్ధికినై లిఖించితిని. శ్రీరాముల పావననామము స్మరించిన వారికెల్ల సౌమ్యగుణము, సహజముగఁ గలుగునన్న, సదారామదర్శన శీలయగు మంథరకు ననేకానర్థములు గలిగించు చెడుబుద్ధి యేలకలిగె ననుటకు దేవకార్యార్థసాధకోపయోగ మని ప్రారంభముననే చూపి నాను. జాబాలి నాస్తికవాదమును రాముల నాస్తివాదఖండనమును వ్రాయవలె నను నభిలాష యుండినదికాని, ప్రదర్శనకాలభీతి నన్నా టంకపఱిచెను. ఈనాటక మిప్పుడుండురీతిగఁ బ్రదర్శింపఁ నైదు ఘంటల కాలము పట్టును. ఇప్పటివారికి వెన్నుబలము సన్నగిలి యున్నందున మిన్నక యంతకాలము గూర్చుండలేరు ఇది పాశ్చాత్యనాగరకత ఫలము.

5. ఈనాటకమున రాముల గుణప్రాశస్త్యవర్ణనమున నచట నచటఁ గొన్ని శ్రావ్యవహాస్యములు వ్రాయఁబడినవి భాగ వతము చక్కఁగఁ జదివినవాని కిది సహజము ఇట్టివానికి భాగవతమే జననస్థానము.

6. భరతుని దుఃఖోపశమనమునకునై రాములు వేదాంత బోధన మొనర్చినట్టు రామాయణములోనున్నది కథా సందర్భమునుబట్టి యీవేదాంత వచనములు వసిష్ఠుఁడు రాముల దుఃఖోపశాంతికినై పలికినటుల నే మార్చితిని శ్రీరాముల పాదుకాపట్టాభిషేకమును, భరతుఁడు నందిగ్రామమునందు సలిపెను. ఘోరాటవియందు సలిపెనని వ్రాయుట సమంజసము కాదు. అట్లు వ్రాయుట కాలసంగ్రహాము నకుఁ గాఁబోలు.

7. ఈనాటకములోని లోపములను పండితులు మన్నింతురని ప్రార్థించు,

సుజన విధేయుఁడు

కోకాచలం - శ్రీనివాసరావు,

బళ్లారి.

## శ్రీనివాససుకవి జీవితచరిత్ర.

ఎవ్వాని వదనరాజీవగంగస్థలంబున నలువరాణి నిచ్చలును నట్టువలు సలుపుచుండునో! ఎవ్వాఁడు కువ్యాఖ్యా విషమూర్ఛితయగు కాళిదాస కవితాసుకన్యకను దనదు సంజీవినిచేఁ దెప్పిఱిల్లఁజేసి, ఒజ్జల మిన్న యని వన్నెకెక్కెనో! ఏమహామహు దివ్యనామామృతమును వీనులారఁ గ్రోలని యక్షరాస్యుఁ డొకఁడైన నీభువిని గానంబడఁడో! ఏమహితచారిత్రుని యశఃకుసుమంబుల ధరియించి దివాకర నిశాకరులు పుష్పవంతులను సార్థకనామమును బడసిరో!

ఏవిద్వదవతంసుఁడు అనన్యజన సామాన్యమగు మహామహోపాధ్యాయ బిరుదమునకు మార్గదర్శి యయ్యెనో! అట్టి చుళుకీకృత సకల శాస్త్రజలధియగు కోలాచల శ్రీమల్లినాథసూరి వంశమున మన శ్రీనివాస కవిముక్తామణి విరూపాక్షక్షేత్రమునకు సమీపముననుండు కామాలాపుర మను గ్రామమునఁ గ్రీస్తుశకము 1854-3-13 తేదీలకు సరియగు ప్రమాదీచ సంవత్సర ఫాల్గుణాసిత చతుర్దశినాఁ డుదయించె. ఇతఁడు బాల్యముననే సంస్కృతభాషను జక్కఁగ నభ్యసించి, పిదప నాంగ్లేయ భాషయం దసమాన వైదుష్యమును గడించి, కొంత కాలము రాజకీయోద్యోగిగనుండి, తర్వాత న్యాయవాదిపరీక్షలయం దుత్తీర్ణుఁడై, బళ్లారిపురవరమున న్యాయవాదిగ వఱలుచుండె. ఇతనికి నొక కూఁతురును, నలుగురు కుమారులును గలరు మఱియు నితఁడు 1917 సం॥ ఏప్రిల్ 7 తేది దేహళీపురమున జరిగిన విద్వత్సభ యని ప్రసిద్ధిఁ గాంచిన యాంధ్రసాహిత్య పరిషత్సభ కగ్రాసనాధిపుఁడుగ నియమింపఁబడియుండె. ఇట్లుండ నేతత్కవిచంద్రుఁడు రాజయక్ష్మాపీడితుఁడై యాంధ్రకువలయంబు వసివాడఁగ కవిచక్రంబు లుల్లసిల్ల 1919 సం॥ జూన్ 23 తేది యస్తమించె.

ఇట్లు విన్నవించు,

సుధీజన విధేయుఁడు,

రావాడి - వెంకటరామశాస్త్రి,

తెలుఁగు పండితుఁడు, మునిసిపల్ హైస్కూలు, బళ్లారి.

## పురుష పాత్రధారులు.

1. దశరథుఁడు.
2. రాముఁడు.
3. లక్ష్మణుఁడు.
4. భరతుఁడు.
5. శత్రుఘ్నుఁడు.
6. వసిష్ఠులు.
7. భరద్వాజులు.
8. సుమంత్రుఁడు.
9. గుహుఁడు.
10. చాటువాఁడు.
11. నావికులు. (5)
12. పురజనులు. (5)

## స్త్రీపాత్రలు.

1. కౌసల్య.
2. సుమిత్ర.
3. కైక.
4. సీత.
5. మంథర.
6. ధాత్రి.

శ్రీ

చం. దశరథరామ, శ్రీశ నతదాత దురత్యయ, దుఃఖనాశనా
కుశలవివేక! యీశ, యజ, కుంజరసఖ్య, మహాదికారణా
పశుపతిచింతనా, శమితపాతక, నిర్జరనాథ, యియ్యుమా
యశము, ననామయంబును, జిరాయువు సంపద లెల్లవారికిన్.

గీ. మహిత కోలాచలాన్వయ మల్లినాథ
సూరి వంశోద్భవుండయి భూరికీర్తి
పరుండఁగానుండు శ్రీ శ్రీనివాససుకవి
చేసె నీనాటకంబును వాసిమీఱ.

సీ. ధీరులై వేదవిచారులై మంగళా
కారులై మను పాపదూరులార
మాన్యులై సౌజన్య ధన్యులై సకలమూ
ర్ధన్యులై వెలయు రాజన్యులార
నిష్ఠులై శీలగరిష్ఠులై సుగుణభూ
యిష్ఠులై రాజిల్లు శ్రేష్ఠులార
భద్రులై దానకల్పద్రులై సుగుణ స
ముద్రులై రంజిల్లు శూద్రులార.

గీ. రామనాటక రత్నహారమ్మునందు
వెలుఁగు నాయకమణియిది, శ్రీకరమ్ము
రమణమీఱఁగ వినయ గౌరవముఁబట్టి
వినుఁడి దీనిని నెమ్మదిఁగనుఁడి శుభము.



కోలాచలం శ్రీనివాసరావు.

# పాదుకా పట్టాభిషేకము.

## ప్రథమాంకము, ప్రథమ రంగము.

దశరథుని యాస్థానము.

దశరథుఁడు, రాముఁడు, వసిష్ఠుఁడు, సుమంత్రుఁడు.

దశరథుఁడు:—రామా! సర్వము, నేను, జక్కఁగ నాలోచించినాను దీర్ఘాలోచనాయతమతిని, నీరీతి నిర్ధరించినాను? నేఁడు నక్షత్రము పునర్వసు. రేపు పుష్యయోగమనంబడు దినము. రాజ్యాభిషేకమునకు శుభమని జ్యోతిష్కులు వక్కాణించినారు. మన కులగురువులగు వసిష్ఠులవారు దానికి సమ్మతించిరి. పురిజనులం దఱీ విషయ మభినందించుచున్నారు. కావున నీవు నామాట నామోదించి రాజ్యాభిషేకమునకు సర్వసిద్ధుఁడవు గమ్ము.

రాముఁడు:—నాయనా! తమయానతినిఁదలమానికంబుగ ధరించి, నడచుకొందును. అయినను నేబాలుఁడను, రాజ్యమేలు క్రమంబిఁకను గొన్నిదినంబులు తమకు శిష్యుఁడనై నేర్చికొని తమ యనుగ్రహమునకుఁ బాత్రుఁడఁగావలయునని నా సంపూర్ణాపేక్ష.

దశరథుఁడు:— రామా! అఱువదివేల వత్సరంబులు భూభారంబొక విధంబునమోసి వేసరిలితి. ఇపుడు విశ్రాంతిఁగోరుచున్నవాఁడను.

సీ. ఏలితి నఱువదివేలవత్సరములు
రాజ్యంబుఁ, జాలయ్యె రామచంద్ర

భూభారమును మోయ భుజశక్తి చాలదు
కావున నేలుమా, నీవు రామ
పుత్రగర్దనయాగ పుణ్యఫలంబున
నిన్నుఁ గాంచితినయ్య చిన్నితనయ
కన్నులుండగ నాదు కిన్నుపండువుగాఁగఁ
బట్టంబు నీకును గట్టువాఁడ

గీ. సఖిల జనులును నీదు పట్టాభిషేక
విభవమును జూడనున్నారు విమలమతిని,
రామ, రఘురామ సౌజన్యధామ, నాదు
మాటలాలింపుమా మదిమమతఁ గనును ?

రామా! ఈ విషయమునకు నీవు సమ్మతింపవలెను.

రామ:—నాయనా! తమమాట జవదాఁటువాఁడనుగాను. ఇన్ని దినము లుగ లేనియవసరము నేఁడేల గలిగెను?

దశరథుఁడు:—రామా! దానికినిఁ గారణంబున్నది.

గీ. రామ; రాహుసూర్య భౌమాదిగ్రహములు
చేరెనాదు జన్మతారయందుఁ
గాననాకు చావొ, కాదేని యంతకు
ముప్పొ, వచ్చు, దానిఁ దప్పనేల ?

రామా! జ్యోతిష్కులెల్ల నేకవాక్యత బైగీతిఁ బలికిరి కావున నాలస్యమునకుఁ గాలంబు లేదు.

రామ:—నాయనా! అట్టి దుష్టగ్రహకూటమునుండి కలుగు నపాయ ములఁ బోకార్పన చేకములగు శాంతులున్నవి. వానినిఁ జేయింప నగును కదా.

(1. అనుబంధము )

దశరథుఁడు:—కుమారా; నేఁబలికిన యదియుగాక రెండుదినము లుగనాకు దుస్వప్నము లెడతెగక కలుగుచున్నవి. దారు ణ్యాపాయముల భీతి నామానసమును జిక్కించుకొని పెక్కు విధములగు బాధలలోఁగెడపినది.నిన్నటిరేయినిఁజటులమహో ల్కాతతులు నాపైఁబడి కాల్చుచుండెను. అపుడు కుంభద్రోణ ములుగ రక్తవర్షములు గుఱిసి యామంటనార్చెను. నే భీతిల్లి పాన్పు వదలి లేచినిలిచిన తోడనే నేనిలిచినస్థలమున భూకం పంబుఁగలిఁగి నేఁబడుచుంటిని. అవసానకాలముననే యిట్టియు త్పాతములు కలుగుచుండును. నాయనా! నాయానతి నెర వేర్పుము.

రాము:—మనగురువులగు వసిష్ఠులు దుస్స్వప్న దోషశాంతికినై భూరి హోమంబు లొనర్చి దుష్టఫలంబులు దొలగింతురు? దాని భీతి మానసమంటనీయకుఁడు.

దశరథుఁడు:—రామా! వయోవృద్ధులకు దండధరుని శాంతియొక టియే, ముఖ్యశాంతి. మఱియే శాంతియును లేదు.

రాము:—నాయనా! మాటకు మాటబదులిడుచున్నవాఁడనని యాగ్ర హింపకుము. నామానసముఁ గలంచు విషయమొకటియున్నది, దానిని విన్నవించెద వినుము.

ఉ. నాయన విన్నవించెదను, నామనమంబుఁగలంచు వార్తయుం
నా యనుజన్ములిర్వురును, నాకతిదూరమునందు నుండఁగా
న్యాయమె వారినిం బిలువ నంపకయుత్సవకార్య మిత్తఱిం
జేయఁగ? వారిరాకఁగనిచేయుమ సర్వము నీకుమ్రొక్కెదం.

నాయనా ఇదియ నాతలంపు, నాయనుంగుఁదమ్ములగు భరత శత్రుఘ్నులు నాసరసలేని సమయమునఁనాకు నొనర్చుపట్టాభిషేకోత్సవము నాకొకనికినేల పలువురకు సమర్థణముగ నుండదు. కావున వానిని రప్పించి యీయుత్సవంబు నెలపుట సర్వజనసమ్మతంబుగ నుండునని నేవిన్నవించుకొనియెద.

దశరథుఁడు:—రామా, నేనుసర్వమునాలోచించినాను. నాకుదారుణాశుభములభీతి, బలముగనూనసమునాటినది. పట్టాభిషేకంబునిలుపఁగాలంబులేదు. నీమామయగు జనకునిఁగాని, భరతుని మేనమామయగు యుధాజిత్తునుఁగాని పిలిపించుటకు సైతము కాలంబుఁజాలదు. సింహాసనంబు నీవధిష్ఠించినవార్త వారువిని సంతసింతురు. ఇఁకభరతుఁడన్ననో, వాఁడు ధర్మశీలుఁడు, దయాహృదయుఁడు, జితేంద్రియుఁడు, సాధుపథముఁదప్పనివాఁడు. అగ్రజసేవకుఁడు. కావున నీవురాజగుటవాఁడువిని ముదబ్ధి నోలలాడునుగాని చింతింపఁడు.

(2. అనుబంధము.)

రాము:—కావుననే వడిగలవేగరులను బంపి, భరతుని రప్పించినవాఁడును నుత్సవంబును గనులారఁ జూచి సంతసించును.

దశర:—రామా! శుభస్య శీఘ్ర మని పెద్దలు పలికినారు. "శ్రేయాంసి బహువిఘ్నాని" యని యున్నది కావునఁ దలపెట్టిన శుభకార్యముఁ దలఁచినపుడే కొనసాగించుట కార్యజ్ఞులకర్తవ్యంబు.

రామ:—నాయనా; తిమకు బదులిడునంతటిశక్తి నాకు జాలదు కావున మీయానతి ననుసరించి వర్తించెద.

దశరథు:—అదికదా బుద్ధికుశలుఁడగువానిపని ? (వసిష్ఠులఁజూచి) స్వామీ! పట్టాభిషేకమునకు మున్నొనరింపఁదగిన యుపవాసాది వ్రతదీక్ష సాంగోపాంగముగ నొనర్ప రాములకును, నాముద్దు కోడలగు జానకికిని నుపదేశింపుడి (సుమంత్రునిఁజూచి) సుమంత్రా! రాములపట్టాభిషేకమహోత్సవమని జనులెల్లరు వినులాగునఁ బట్టణమంతయును జాటింప నాజ్ఞయిమ్ము.

సుమం:—చిత్తము.

దశర:—(వసిష్ఠుల జూచి) స్వామీ, చేయఁదగినకార్యంబు లనేకంబులున్నవి కావున నిపుడుపోవుదము

(నిష్క్రమము.)

ద్వితీయరంగము.

వీధి. జను లుత్సవంబు లొనర్చుచు సంచరించుచుందురు. కైకగృహద్వారము ; ప్రవేశము. మంథర. ధాత్రి. చాటించువారలు. కైక.

మంథర:—(జనులయుత్సవమునుఁ జూచి ఆశ్చర్యపడి నిలిచి.)

(8. అనుబంధము.)

(స్వగతము):—ఏమి యచ్చెరువిది ? నేఁడీపురం బతిశయనూతన కాంతిచేవిరాజిలుచున్నయది. దారులెల్లను దావులచే నిండినకుసుమోత్కరంబుల వలన నింపఁబడినవి. ఏమందిరంబును జూచినను ధ్వజపతాకాభి శోభితముగ నున్నది. మిన్నొన్నతప్రదేశములు సమపఱచిన బాట లెల్లెడ నీటుగులుకుచున్నవి. ఎవరినిఁజూచినను మంగళస్నానాలంకృతశరీరులయి మేఘవిముక్తసూర్యప్రభనుబోలె భాసిల్లుచున్నవారు. ప్రతియొకనిహస్తమును మాల్యమోదకరూప

మంగళద్రవ్యప్రశస్తంబైనది. ఏదిక్కున వినినను ధరణీదేవతాభినాదితంబు నిండారినది. ఎవనిమోముఁ జూచినను వెన్నునియన్నన్న చెలువగు వెన్నెలను గోలియున్నది. వరకరితురంగాకీర్ణంబై నదులు నడవ దారిలేక యున్నది. ఏకారణంబున నీ పురవరంబు నేఁ డీరీతిని రాజిల్లుచున్నదియో తెలియకయున్నది. కారణంబుఁ దెలిసికొనవలెను. అది యేమికర్మమో యేమానవుఁడును నాతో మాటలాడఁడు. నేనయి పైఁబడి పలుకరించినను భూతమునుఁజూచి భీతిల్లినవాని బలెఁ బఱుగిడిపోవుచుండును, నేనెవరికిని నేయపకారంబును జేసియెఱుంగను. సకలురు నాకే యన్నివిధంబుల నపకారం బొనర్చుచుందురు. నన్నెల్లరు దూషించుచుందురు. కారణమేమో తెలియదు. వారినుండి నాకుఁగావలసినది యేమియున్నది? నా రాణియగు కైకయనుగ్రహ మొకటి యుండినఁ జాలును. కైకకు దశరథునియనుగ్రహ ముండినఁజాలును. ఇవి రెండును శాశ్వతంబుగ నుండిన జగత్తునే జలదరింపఁజేయుదును. అదిగో కైకసవతియగు కౌసల్యయొక్క ధాత్రి దూరంబున నూతనవస్త్రాభరణాలంకృతయై నిక్కుచు నీల్గుచు విఱ్ఱవీగుచు వచ్చుచున్నయది. దానినిఁ బలుకరించి యుత్సవకారణం బెఱింగెద (ధాత్రిసమీపించి వచ్చును.) ఏమమ్మా ధాత్రీ! వస్త్రాభరణాలంకృతవయి పోవుచున్నావు. ఎచ్చటికి?

**ధాత్రి:**—ఛీ. యపశకునఘటమా! ముఖ్యమగు కార్యముపైఁ బోవు నన్నెచ్చటికిఁ బోయెదవని యడిగెదవు. బుద్ధిలేనిదానవు నీవు.

**మంధర:**—ఏమే నాలుక పొడుగుఁ జేసితివి. నీకేమి కొమ్మదెవులా క్రొవ్వి మాటలాడెదవు? అట్లు మాటలాడకు. హెచ్చరిక సుమీ. మర్యాదగ మాటలాడుము.

ధాత్రి:—ఛీ. దాసితో మర్యాదమాటలేమ? నీవు నాకుదాసివి. నీరాణి నారాణికి దాసి. నీతో సరికట్టుకొని నిలిచిమాటలాడ నేల? కార్యమున్నది పోయెద.

(నిష్క్రమించును.)

మంధర:—హా! హా! ఏమి దీనిక్రొవ్వు? నేను తనకు దాసినఁట! నారాణి తనరాణికి దాసియఁట! ఔరా, దీనిప్రల్లదము! దీనినాలుకకు నగ్నిశుద్ధి చేయింపవలెను. అదిగో చాటువాఁడేమేమో యనుచు వచ్చుచున్నవాఁడు. వాఁడేమిచాటించునో వినియెద.

(ప్రవేశము చాటించువాఁడు)

చాటించువాఁడు:—"జనులారా! కనలేదనేరు. వినలేదనేరు. రేపటిదినంబునఁ బగలేడున్నరగడియలకు మనరాజగు దశరథమహారాజు తాను రాజ్యపరిపాలనంబు చాలించుకొని, తనపట్టపుదేవియగు కౌసల్యావరగర్భసంజాతుఁడగు శ్రీరామచంద్రునకుఁ రాజ్యపట్టాభిషేకం బొనరించుచున్నవాఁడు. సామంతరాజులును, పౌరజానపదాదిజనులు నీయుత్సవంబుఁ గనులారఁ గాంచి మనసారసంతసింతురని యెన్నెను కావున మీరెల్లరును దారపుత్రబంధుహితమిత్రులంగూడి యాస్థానమునకు వేంచేయవలయును. ఇట్టి మహోత్సవమునుఁ గనులారఁజూడనివారు నిర్భాగ్యులనుటకు సంశయము లేదు" (

(నిష్క్రమించును)

మంధర:—హా! హా! అంతయును గరతలామలకం బాయెను. ఇంతటి యుత్సవంబునకుఁ గారణం బిదియేనా? ఆధాత్రిమిడిసిపాటునకు

హేతువు స్పష్టమయ్యెను. (అనుచు తీవ్రవడి యించుక నిలిచిభూతావేశమయినదానింబలె నటునిటు పాదవిన్యాసంబొనర్చి తలయూంచుచు నావులించుచు నెట్టకేలకు స్మారకమువచ్చి) ఏమీ! ఇపుడే నాచెవులో మాటలాడిన మహనీయుం డెవండు? ఎందుడాంగెను? (నలుదిక్కులంజూచును) ఎవండు లేండే ఆమహానుభావుండు నావీనుల దేవవచనంబులంజొనిపెను ? (ఆలోచించి) ''రాముండు రాక్షసవధార్థము జన్మించినాడంట! నిగ్రిశలరాక్షసులు ప్రబలించినారంట! రాముండిచట రాజ్యమేలుచుండిన రాక్షసవధకు మార్గములేదంట! కావున నే నొముతైనంబట్టి భంగం బొనర్చి రామునకు రాజ్యవియోగంబుం గల్పింపవలెనంట! దీనినుండి నా కేపాపమును రాదట'' ఈమాటలుగదా నావీనుల దూరినవి. (తలయూంచి) ఇది దేవతాకార్యమని దోంచుచున్నది. అట్టి దివ్యకార్యంబునకు నాసాహాయ్యంబు గోరంబడినది. హా హా! దేవతలు సైతము దమకార్యమును సాధించుకొనుటకు మనుష్యులసాహాయ్యంబు నపేక్షింతు రందురుగదా? కాని అంతటి దేవతలే వేండికొనుచుండ నేనేల సాహాయ్యపడంగూడదు ? రామరాజ్యవియోగమునకు నాయొనరింపందగిన సాహసమంతయును వెచ్చించెద. అదిగో జ్యేష్ఠాదేవియుంబోలె వేకువయిన రాముపలకు నిద్రించి యిపుడేలేచి, నన్నుగానక వెదకుచున్నది యా కైక, నాయుపాయములన్నియు నిప్పుడు వినియోగింపవలెను. అంటబొమ్మగం గైకను ముందుంచుక సూత్రధారిణిగ నే వెనుకనుండి సూత్రము లాడింపవలెను. ఇదియ నాచేయందగిన కార్యము(ఆలోచనచేయువిధంబునం గపోలన్యస్తహస్తయై యశ్రుపూరితనేత్రయై కూర్చుండును.)

(ప్రవేశము: కైక.)

కైక:—ఉ. కారణ మేమె మంథర నికార్యము వెల్వడి చిన్నవోవుచున్
ధారుణి సొమ్మసిల్లిపడి తద్దయుఁ జింతను జిక్కితీవు ?
నిన్నేరు నిరాకరించి వచియించిరొ గర్వవికల్పచిత్తులై
వారినిఁ దెల్పుమా యిపుడె నారసి శిక్ష విధించి పంపెదన్.

(మంథరనుఁజూచి) మంథరా ఏమి యిచటవ్యాకులాధీన మానసవై యాలోచనానిమగ్నవై యున్నావు! కారణ మేమి? నిన్నెవ రేమయిన ననిరా?

మంథర:—సీ. కారణంబేమని కైకేయి యడుగఁగనేల
కాయము బాయని కతముగాదె
ఎవ రేమియనఁ నేల యవనినా గ్రహచార
కాలము తాఁ గాని కలఁతఁ బెట్టె
మరణంబునకు మంచితఱి యెద్దియని వార
నరయుచున్నాను తరుణి యిపుడు
దాసికి దాసనై దాస్యము సల్పి
నిల్వడి లేదు నా యింట నెపుడు
గీ. అడిగితివిగాన చెప్పితి నతివ నీకు
తెలుపుమా నాకుగతి నాదుదేశమునకు?
బొమ్మనుచుఁ బల్కెదో లేక బొందితోడ
గాలుమనిపల్కెదో వేగఁ గరుణఁ జెపుమా.

మంథర:—కైకా నన్నెవ రేమియని యెదరు? నా గ్రహచారమును నేనే దూఱుచు, మరణమునకు మంచిదారి యెద్దియని యాలోచించుచున్నాను.

కైక:—మంథరా అంతటి తెగువకుఁ గారణమేమి?

మంథ:—గ్రహచారము.

కైక:—ఇన్ని దినములు లేని గ్రహచారము నేఁడేమి కలిగెను?

మంథర:—గ్రహచార మెప్పుడో యొకదినమున వచ్చి చచ్చువఱకుఁ బీడించునుగాని దినదినము వచ్చునా?

కైక:—అంతటి గ్రహచార మిపు డేమివచ్చెన?

మంథర:—అమ్మా! నన్నేల యీరీతి గ్రుచ్చిగ్రుచ్చి ప్రశ్నించెదవు? నేను మాటలాడఁజాల. నీవు లేచునంతలో నేదో యొక యరణ్యముపాలయి పోఁదలంచియుంటిని అంతలో నీవగపడితివి.

కైక:—మంథరా! అంతటిదుష్ప్రాప్తి నీకేమిఘటిల్లెను?

మంథర:—కైకా! మావంశములో యాఁడువారు రాజుభార్యలకు దాసీలయి భాసిల్లుచుండిరిగాని దాసీలక్రింద దాసీలయి యెప్పుడును హీనదశలోఁ జిక్కినవియు లేదు.

కైక:—ఇపుడు నీకేమి యంతటిహీనదశవచ్చెను?

మంథర:—కైకా! మఱల నేల నన్ను ప్రశ్నించెదవు? దాసికిదాసి నగుట హైన్యముకాదా?

కైక:—మంథరా! నీకేమి పిచ్చిపట్టెనా? ఏదాసికి నీవుదాసివి?

మంథర:—నీకు, నీకొకదానికేగాదు, కౌసల్యదాసికి సైతము నే దాసి నట?

కైక:—ఎవరుపలికిరి?

మంథర:—కౌసల్యధాత్రి.

కైక:—అంతటిప్రల్లదములు పలుకునంతటి గుండె, దాసికిఁగలిగెనా?

మంథర:—శుక్రమహాదశవచ్చినపు డెవరికిఁ గలుగదు?

కైక:—నేను కౌసల్యదాసి నెటుల ?

మంథర:—నీమగనికిఁ గౌసల్యపై నుండు ప్రేమాతిరేకంబున.

కైక:—నామగఁడు ముగ్గురుభార్యలపైనను సమాన ప్రీతిగలవాఁడుగ నున్నవాఁడు. ఇంచుక నాపైననే హెచ్చుకూరిమి.

మంథర:—అయ్యో పిచ్చిదానా! భ్రాంతేశ్వరురాలు నివు. నీపై నీ మగనికిఁ బ్రేమ యంతఁగనుండినచో నీకీవల రాజ్యపరిపాలన విషయమున జరుగుచుండు కుట్రలేమయినవి నీకుఁ దెలియునా ?

కైక:—నాకుఁ దెలియదు. కుట్రలేమి ?

మంథర:—నీమగఁడు రాజ్యమువదలి ముదసలిగ మూలఁగూర్చుని మూల్గుచుండుట.

కైక:—నామగఁడు రాజ్య మేలవదలును ?

మంథర:—చేతఁగాక.

కైక:—అంతటిబలహీనుఁడు నాభర్త కాఁడుగదా ?

మంథర:—అటులయినఁ గౌసల్యదుర్బోధన యుండును.

కైక:—కౌసల్య యేల యిట్టివిషయము బోధించును ?

మంథర:—తనసుతునకు రాజ్యము వచ్చుటకు.

కైక:—హా! హా! అంతటికాలమువచ్చినపుడు రాజ్యము తనకొడుకునకుఁగాక నాకొడుకునకు నగునా ? భర్త నాపై నెంతటిప్రేమ గనుండినను కౌసల్య పెద్దభార్యకావున దానిసుతునకే రాజ్య ప్రాప్తియగుట ధర్మశాస్త్రసమ్మతము గదా !

మంథర:—అంతకుమున్నే నీమగఁడు మఱియెవరికిని రాజ్యంబుంకువుగ నిడకయుండినచోఁ గౌసల్యాతనయునకు రాజ్యమువచ్చుట శాస్త్రసమ్మతమేను.

కైక:—నామగఁడటు లెవరికని రాజ్యముంచువయుంపఁడే ?

మంథర:—కైకా! నీకు రాజసము హెచ్చయినకారణంబున బుద్ధిజాడ్యము బలమైనది.

కైక:—ఏమీ యటుల వ్యర్థచిత్తురాలుగ మాటలాడెదవు.

మంథర:—నిజము. నిన్ననుసరించి నాకును బిచ్చిపట్టినది. సాంగత్యదోషఫల మిది. మంచిది. కైకా! నీ వివాహకాలంబున నప్పటికే ముగ్గురుభార్యలుగలిగి ముదసలిగనున్న నీమగనికి నిన్నిచ్చి పరిణయంబొనర్ప నీతండ్రి, కేకయురా జనుమానింపఁడా ?

కైక:—నిజము! సందియించెను! సవతులపై బిడ్డనియ్యనే తండ్రి యనుమానింపఁడు ?

మంథర.—అపుడు నమ్మకముగ నీమగఁడు తనరాజ్యముంకుపుగ నుంతునని నీతండ్రికి మాటయివ్వఁడా ?

కైక:—నిజము! నన్నువలచి నాపైఁ దనకుంగల ప్రేమాతిరేకంబును, వెల్లడింప నాభర్త యటులొనరించెను. ఆరీతిగ మోహాంధుఁడై మునసిచ్చిన మాటలు నిజమగునా ?

మంథర:—అటులయిన నీమగనికి నున్మాదావస్థయం దొకబుద్ధియు నది లేనిసమయమున నొకబుద్ధియు రెండుబుద్ధులున్నవనుట నిస్సందేహము గదా ?

కైక:—ఏమో ముసలివాఁడు కావున నపుడపు డొకనియెఱుకను తప్పును.

మంథర:—నిజము. ముసలివారి గతియంతయు నింతేను. కావుననే నీమగఁడు తనకు మతిమాంద్యము కలిగినదని రాజ్యపరిపాలనము వదలుచున్నాఁడు.

కైక:—ఎన్నఁడు.

మంథర:—రేపు.

కైక:—రేపు!

మంథర:—రేపు. అవును రేపు.

కైక:—అది నీ కెటులఁ దెలియును? అటులుండిన నామగఁడు నాతో నొకమాటయైనను దెలుపక యుండునా?

మంథర:—కైకా! నీవు బుద్ధిలేనిదానవైతివి. నీపై నీమగనికి నెంతో ప్రేమ కలదనుభ్రాంతి యింకను నీవు మానకయున్నావు. రేపటి దినముననే రామునిపట్టాభిషేకము.

కైక:—మంథరా! రామునిపట్టాభిషేకవార్త నాకు నెంతటిసంతోష దాయకముగనుండినను బట్టాభిషేకోత్సవము రేపే జరుగు ననుట నేనమ్మను. నాభర్త యీవిషయమున నాతో మాటాడక, నన్నువిచారింపక, యంతటియుత్సవము రహస్యముగ జరుపునని నేఁ ద్రికరణశుద్ధిగ నమ్మను.

మంథర:—అట్లు జరిగించునేని.

కైక:—నామగనికి నాయందుఁ బ్రీతిలేదని నిర్ధరించుకొనియెద.

మంథర:—నిజమేనా?

కైక:—ముమ్మాటికి నిజము.

చాటువాడు:—(సమీపించి ప్రారంభమురీతిగఁ జాటించును)

కైక:—(ముక్కుపై వ్రేలుంచుకొని యచ్చపడినిలుచును.)

మంథర:—కైకా! అటు లేలనిలిచితివి? ఇప్పుడైన నీమగనికి నీపైఁ గలప్రీతి యెంతటిదనునది తెలిసెనుగదా.

కైక:—మంథరా! తెలిసెను. చక్కఁగఁ దెలిసెను.

మంథర:—రాజులు నూతనప్రియులు.

కైక:—నిజమమ్మా! నిజము.

మంథర:—రాజులతోఁ జెలుములు మీసాలపైఁ దేనియలు.

కైక:—యథార్థము.

మంథర:—రాజులకు సత్యమిదియను విషయమే తెలియదు. అసత్యమే వారికి సాధనము. కావుననే "రాజ్యాంతే నరకం ధ్రువం" యని పెద్దలు పలికిరి.

కైక:—సత్యమమ్మా సత్యము. మగవారింతటి మోసగాండ్రని నాకు నిపుడు తెలిసెను?

మంథర:—మగవారి చర్యలు సర్వము నీవిపుడే తెలియఁజాలవు. నీకుఁ బడిబత్తెము పెట్టినపుడు తెలియును? కౌసల్య యింటిదాసిగ నీరుమోయునపుడు తెలియును. దాని పడకటిల్లు కసవూడ్చు బారక చేతికెక్కినపుడు తెలుసును. నీకొడుకు భరతుఁడు నీ సవతికొడుకు కాళ్లకు ముచ్చెలు దొడుగునపుడు తెలుసును? ని కోడలు, కౌసల్యకోడలి బట్టలుతుకునపుడు తెలుసును? నీ దాసి కౌసల్యాదాసికి దాసియై హీనదశలోఁ జిక్కినవియుచు, గనుఁగవను నీరు నించుచు నీమోము దిక్కునఁజూచి పొక్కుచు నేడ్చినపుడైన తెలుసును?

కైక:—మంథరా! అంతటి చెడుకాలము మనకు వచ్చునేమే?

మంథర:—(ఏడ్చుచు) వచ్చునేమే యని యడిగెదవు? వచ్చినది.

కైక:—ఎటు వచ్చినది.

మంథర:—కాసుచేయని కౌసల్యదాసి, నియంతటి గొప్పరాణిని కౌసల్యాదాసియని నిందించెను, నన్నుఁ దనదాసియని పిలిచెను.

ఇంతటికన్న యమానుషంబు వేఱేమియున్నది. ఇంక ముందు నీవును నీకొడుకు కోడండ్రును, నీదాసియు, మనినపీనుంగుల బలెనవని లోంబడియుండవలసిన దేను. నీసవతి యొనర్చు నమానుషంబులెల్ల సైంచి యుండవలసినదేను.

కైక:—అంతటి యమానుషకార్యంబులు కౌసల్య మనకు నొనర్చ నచో నామగండు వానినిం గని యోర్చునా? విని సైంచునా?

మంధర:—కైకా. నీమాటలలో నాభాసములు, వ్యతిక్రమములు చాలుగ నున్నవి? అవి యెవ్వియనిన.

(1) ఆఁడువారుచేయు చెడుకర్మములు మగవారు చూచుట సాధ్యము కాదు.

(2) మగవానియనురాగము హెచ్చుగ నుండువారివిషయమున వ్యతిరిక్తముగ మన మేమివినిచినను వినుటకష్టము. విని నమ్ముట కష్టతరము, నమ్మి శిక్షించుట కష్టతమము.

(3) నీమగండేమి తపంబొనర్చియో యఱువదివేలేండ్లు మనినాఁడు. ఇదేరీతిగం గలకాలము మనుననునాశ లేదు. మార్కండేయునిబలెం జిరంజీవిగనుండుమని విధాతనీనాథుని ఫాలతలంబున వ్రాయండుగదా? నీమగండపుడే మూండుకాళ్ళ ముదుసలి. ప్రాణంబులు పిడికిటనుంచి కొని యున్నవాఁడు. నేండో రేపో, యని కాలంబు నెదురుచూచు చున్నవాఁడు నీరీతి యమునియింటి యతిథిగ స్వల్పకాలములోనే యుండంబోవు నీమగనికూర్మి నమ్ముట గుండ్రాయినిం గట్టుకొనినీటిలో దుముకుటయగాదా?

(4) రాముండు రాజయిన పిదపనీమగనిది యేమిసాగును? తన తల్లిమాటలపై సవతితల్లిమాట గౌరవించునా?

(5) రామునియనంతరము మన భరతుఁడేగదా రాజ్యార్హుఁడు, అనతికాలములోఁ దనతనయునకు రాజ్యమార్జింప వలెనని కైకయును కైకకుఁ జేరినవారును రామునకు విషమును బ్రయోగింతు రేమోయని యనుమానించి, రామునిమందిరములో మమ్ముఁగాలిడనీయరు. రాజులింటవిష ప్రయోగంబులు సామాన్యముగ జరుగుచుండును.ఎవరాపాప కర్మంబొనర్చినను ననుమానము మాపైనుండు కారణంబున మమ్మే శిక్షింతురు,

(6) భవిష్యద్రాజు భరతుఁడుగనుండు కారణంబున వానినుండి తనకెపుడే యపాయంబు సంభవిల్లునోయని భీతిల్లుచు రాముఁడునుసదా కాలము తనక్రూరవీక్షణాంచలములఁ మనభరతునిఁజూచుచు సమయము దొరకినపుడు సమయింపఁ బ్రయత్నించును.

ఇంకనునిట్టి యనర్థములనేకములు మన దురదృష్టమునకనుగుణ్యముగ ఘటిల్లుచుండును. మనకుఁ జెడ్డకాలమిది.

కైక:—మంథరా: నీపలుకుల హితంబులుగను, కారణసహితములుగనుండినను, నామగఁడేమి,నానవతికౌసల్యయేమి, మారామఁడేమినాకుసంతోషయవమానకార్యంబు సేయ దురని నేనమ్మను బాల్యంబునరామునకు నీకుఁగలిగిన చరణతాడన భంగమునకు వైరశుద్ధి నీవరయుచున్నావని నాకుఁదోఁచెడు.

మంథర:— (వ్యసనకోపము నభినయించుచు)? అవునమ్మా: నీక్షేమమునుగోరి నీకుహితముగ రెండుమాటలున్నవియుండినటు లాడినందులకు నాపై దోషారోపణ మొనర్చితివి. గట్టిదానవు. నినుఁబోలు కృతఘ్నులకు దాసిగనుంట కంటెను నీసవతిధాత్రికి దాసిగనుంట మేలనినాకుఁదోఁచెడు. నేనుపరాయిదాననైతిని. రాముఁడునీకడుపునఁబుట్టిన కొడుకాయెను, కౌసల్య నీగారాబుచెల్లె

లాయెను. వినాశకాలే విపరీతబుద్ధి యనినటుల నీకుఁ జెడుకాలము ప్రాప్తించినది. రోగికి నౌషధంబుగాలెఁ జెడువారికి హితోపదేశంబు రుచింపదు. నీయిష్టానుసారంబుగ నీవుండుము. ద్రవ్యము వెచ్చించి బావిత్రవ్వించి దానిలోఁ బడిచావుము. నీసేవలోనిచట నేనిఁకనుండను. గిరివ్రజపురంబునకుఁబోయి దేవుఁడిచ్చిన యాకొట్టముక్కకొఱకై గంజిద్రావి బ్రదికెదను. ఇట్టి యవమానాగ్నిలోఁబడి కాలజాలను. పోయెదను. (అనుచు ముందరికిఁ గాలిడును.)

కైక:—(మంథరను బట్టును.)

(4. అనుబంధము.)

మంథర:—వదలమ్మా! నీపుణ్యము నన్ను వదలుము. నీగొంతుకుఁ దవ్వులు నుత్రిత్రాఁడు నాగొంతునకును దవిలింపఁజూచెదవో? నా జన్మభూమినిఁ జేరి యెచ్చటనయినను బిచ్చమెత్తుచు మర్యాదగ బ్రదికెదను. వదలుము, నేఁ బోయెదను. నీవలపుల మోహానాంగునితోను, నీనెయ్యపురాలగుసవతితోను, నీయుం పెడతెగని మాతృభక్తిసలుపు నీసవతిసుతుసితోను క్షీరనీరన్యాయముగఁ గూడికొని క్షేమముగనుండుము. నేనేమి దాసిని. ఎచ్చటనైన నను బ్రదుకఁగలను. నీవు క్షేమముగనుండినఁ జాలును. రామునకుఁ బట్టాభిషేకమైన నాకువచ్చునదేమి? భరతునకైన నాకు వచ్చునదేమి? భరతుఁ డేమి నాకుఁగనికాభిషేకంబుఁ జేయించునా? ఏమియు లేదు. వృథాయాసంబు నాకేల? ఏమో పిన్ననాటనుండి నీ యొద్దనుండిన కారణంబునను, నిక్షేమం బరయుచుండు మని నీ తల్లి నాకుబోధించి నీవెంటఁబంపిన కారణంబునను నీకుఁ జెడుగు

మూడకయుండునటుల నేనేమో యుంచుక హితము పలికితిని. అది నీకుసమ్మతము కాదయ్యె.

కైక:—మంథరా! నీమాటలు నాకు నెల్లకాలమందును సమ్మతము లేను. సవతిబుద్ధి కుశలినియనియును నాక్షేపము మేమఱక యరయుదానవనియును గాదే నా తల్లి నిన్ను నావెంటఁ బంపెను? నీమాటలకు నే నాక్షేపించినందులకుఁ గారణం బీవిషయమునఁ గల సాధకబాధకములు చక్కఁగఁ దెలిసికొనుటకుఁ గాని నిన్ను దూషించుటకుఁగాదు. ఈవిషయమున నీతో నొనర్పఁ దగిన యాలోచన లనేకములున్నవి. రమ్ము లోపలబోవుదము. ముంగట ముచ్చటలేల ?

మంథర:—కైకా లోపల వలదు. అచట గోడలున్నవి. గోడలకుఁ జెవులున్నవి. మనగ్రహచారము విపరీత మయ్యెనేని నవి చైతన్యమున మూర్తీభవించి మాటలాడును. మాటలు సాక్ష్యములగును.

కైక:—నిజము, నిజము, ఇటులనే నిలిచి నలుదిక్కులఁ జూచుచు మాటలాడుదము. మంథరా, నిన్నరాత్రి నామగఁడు నాయింటికి రాఁదగి యుండెనుగదా ? ఏల రాకయుండును?

మంథర:—నీ సవతియగు కౌసల్యతో సరసము లాడుచుండె నేమో?

కైక:—ఉండుముండుము, మంథరా, ఇన్నిదినంబులులేక భరతుఁడు లేనపు డీ మహోత్సవమును నెఱపఁదలచి రేల ?

మంథర:—భరతునుండి కలుగు నంతరాయంబునకు భీతిల్లి.

కైక:—భరతునిపై నామగనికిఁ బ్రేమ హెచ్చుగ నుండునే?

మంథర:—నీవు పిచ్చిదానవు. కార్యసాధనకునై యనురాగము చూపుచుండెను. ఉత్సవసమయ మాసన్నమయినతోడనె, మనభర

తుఁడు వలదనినను బలాత్కరించి దూరప్రయాణ మొనర్పఁ జేసెను.

కైక:—అటులయిన శత్రుఘ్ను నేలపంపెను?

మంథర:—భరతునిఁ బిలిపింపలేదను నీ నిందను దప్పించుకొనుటకు.

కైక:—రాముని మామయగు జనకునిసైత మీ యుత్సవమును వీక్షింపఁ బిలిపింపలేదుగదా?

మంథర:—ఏల పిలిపించును? అటులతనిఁ బిలిపించినచో భరతునేల రప్పింపలేదని నీవాక్షేపింపవా?

కైక:—నిజము, అటులయిన నీయెత్తుగడ బహుకాలముగఁ బన్నినది కాఁబోలు.

మంథర:—దానికి సందేహమేమి? ఇవు డాఱునెలలుగ దినదినమును నీమగఁడును రాముఁడును, వసిష్ఠుఁడు, సుమంత్రియు గుస గుసలుగ మాటలాడుచుండిరి. ఎపుడయినను నేఁబోంచి విను చుంటిని గాని మాటలు వినఁబడుచుండలేదు, కావున నీకుఁ దెలుపనైతిని.

కైక:—(ఆలోచన నభినయించి) మంథరా! నామనమునను:డునది నిజముగఁ దెలిపెదను వినుము, రాముని పట్టాభిషేకంబునకు విఘ్నంబుఁ గలిగింప నాకు నిష్టములేక యున్నను నామగని యొక్కయు నాసవతియొక్కయు, కుట్రలను జూచి నాకుఁ బట్ట రాని యాక్రోశము కలిగినది. ఎటులయినను నీ యుత్సవంబునకు భంగంబుఁ గలుగఁజేసి వారినూతికి మసిబూయవలెను. ముం దేమయినను గానిమ్ము.

మంథర:—(స్వగ॥ నేఁదలఁచిన దిదియేను). అమ్మా కైకా! దీనికి నుపాయ మేమొనర్చెదవు?

కైక:—అదియే తోఁచకయున్నది.

మంథర:—(ఆలోచన నభినయించి) నాకుఁ గొన్ని యుపాయములు తోఁచినవి. వాని ననుసరింతువేని నీ కార్యసాఫల్యమగుటకు సందియ ముండదు.

కైక:—అమ్మా! మంథరా! అవియేవి. ఆయుపాయము లెవ్వి?

మంథర:—తెలిపెద. హెచ్చరికఁ గలిగి వినుము.

(1) నీవు కోపము నటించుచుఁ గోపగృహమున విగతాభరణవై మలిన వస్త్రములు ధరించి పరుండుము. ఇది మొదటిది.

(2) నీ మగఁడు వచ్చి నీ పాదములుబట్టి వేఁడుకొనుచు నీవడిగినది యిచ్చెద ననును. బాసఁ జేయింపుము. మఱవకు. అవసరసమయమున వలపుల యున్మాదముఁ దలకెక్కి మగవా రెంతటి బాసలయిననుఁ జేయుదురు. ఇది రెండవది.

(3) ఇది యింకొక కష్టమైనపని. నీవు ధైర్యము వహించి జాతిగుండియకల దానివయి మర్యాదపై దృష్టియుంపక చేయవలెను.

కైక:—అదియేమి? త్వరగాఁ దెలుపుము. నాకు నిపుడుగల యాక్రోశముచే నెంతటి పనినైనను జేయ ధైర్యము కలిగినది.

మంథర:—అంత గాక. ఆఁడుది సాహసించిన నెక్కార్యంబుఁ జేయఁ జాలదు? మగవా రీరీతి స్త్రీల మోసఁగింపనటుల వారికి బుద్ధిఁ జెప్పవలెను.

కైక:—వృథాలాపంబు లేల? మూడవకార్య మెద్ది?

మంథర:—నీమగఁ డట్టిబాసఁ జేసిన పిదప రాముపట్టి, భంగంబొనర్పు మన్ని వేఁడుము. ఆమాటలు వినినతోడనే నీమగఁ డాగ్రహ

పడి నిన్ను నిందించుచుఁ దిట్టును నీవు దిట్టవై మాటకు మాటి యెదురాడుము.

(4) అంతతో వదలిన నుపయోగంబు లేదు. రాముఁడు పదునాలుగేండ్లు నారచీరలు గట్టికొని యరణ్యావాసం బుండులాగున నొనర్పుము.

కైక:—అమ్మా మంథరా ఇది కష్టతమ మైనపని.

మంథర:—కష్టనిష్ఠురములకు నీవు వెఱవకు. కాదేని కార్యభంగమగును సుమా! పిదప భరతుని పట్టాభిషేకంబుఁ గోరుము.

కైక:—మంథరా! నీ యూహాలు చక్కఁగ నున్నవి. అన్నియు నడుగుదును గాని రాముని వనవాసంబు గోరుట కష్టతమంబుగ నున్నది.

మంథర:—దానికి జంకితివేని నీయొనర్చుసాహసంబెల్ల బూడిదలో హోమమగును.

కైక:—అది యేల ?

మంథర:—కైకా! నీసాహసమున భరతుఁడు రాజగును. రామునకు రాజ్యవియోగమగును. ఇది సిద్ధాంతమనికొందము. రాముఁడు జనానురాగముగలవాఁడు. వాని ముఖలక్షణ మట్టిది. నీకొడుకు భరతుఁడు వానికి శత్రువగును. జనబాహుళ్య సాహాయ్యంబున నీసుతునిరాజ్యము స్థిరముగ నిలువదు. జనులకు రామునిపైఁ గల యనురాగము కలకాలముంట సందియము. కావున పదునాలుగేండ్లు నిర్జనప్రదేశమగు నరణ్యంబుననుండినచో జనులకు వానిపైఁ బ్రేమదప్పును. రామునకు శాంతగుణమువచ్చి ముని వృత్తి యలవాటయి విరక్తిఁ బుట్టును.

కైక:—మంథరా! నీయుక్తులు శ్లాఘనీయములుగనున్నవి. అటులనే యొనరించెద.

మంథర:—ఇంతగ సాహసకార్యము లొనర్చుటకు నీకు సాధనము లెవ్వి యని యాలోచించినావా?

కైక:—నాకోప ముపశమింప నామగఁడు నే నడిగినది యిచ్చెదనని బాసచేయు నంటివియే?

మంథర:—అయ్యో పిచ్చిదానా! అది యొకటి చాలదు. అది చెల్ల దేని నీ వివాహకాలపు ప్రతిన హెచ్చరింపుము. అదియుఁ జాల దేని పూర్వమున శంబరాసురునితో నీమగఁడు రణమొనర్చు తఱి నీవు ధవళాంగముని మంత్రసాహాయ్యమున నొనర్చిన సాహ సమునకు నిచ్చిన వరద్వయశరము లుపయోగింపుము. ఈ నాల్గుసాధనములు సిద్ధముగ నుంచుకొని సమయానుసారముగ నుపయోగించి కార్యము సాధింపుము. ఎవ రేమి చెప్పినను విన కుము. నాహితములు మఱవకుము. కేకయరాజసుత కౌసల్య దాసి యనియెడు కళంకం బార్జింపకుము.

కైక:—మంథరా! నే నట్టినిందకు లోఁబడుదాననా? దశరథుని భార్య లలోఁ గైక హెచ్చని కీర్తినంది గర్వించు నేను సవతికి దాసి యను నిందఁ దెచ్చికొని మనఁగలనా?

(5 అనుబంధము.)

మంథరా! లోనికి వెళ్లెద. కర్తవ్యంబు చాలుగ నున్నది.

(నిష్క్రమించును).

మంథర:—(స్వగతము) హా. హా. స్త్రీసాహసమంతయును జూపితిని. అబలల బుద్ధి బలిమికి నెద్ది తులతూగును? స్త్రీ లబలలని

పురుషు లాడుట స్వాతిశయంబు నిరూపించుకొనుటకె గాదా? మూలం గూర్చుండి మూడులోకంబు లోకమూలకు నిగ్గం గలవా రబలలా? ఈ రాత్రి యేమేమి జరుగునో కనియెద.

(నిష్క్రమము)

## తృతీయరంగము.

కోపగృహము:—కైక. దశరథుఁడు. రాముఁడు. సుమంత్రుఁడు. మంథర.

(కైక మలినాంబరములు ధరించి యాభరణములు వదలి నేల పైఁబడియుండును.)

దశరథుఁడు:—(కైకనుఁజూచి స్వగతము) ఏమి యచ్చెరువిది. కైక యీరీతిఁ బడియుండుటకుఁ గారణమేమి? నామన మేమొకో భీతికి నాలవాల మయినది. (ఆలోచించి) నిన్నటిరేయి తనవంతుగ నుండినను నేను రాకనిలచి నందులకుఁ గోపము వచ్చియుండునా? ఉండును. పురుషులకుఁగల కార్యబాహుళ్యము స్త్రీలకుఁ దెలియుటెట్టుల? స్వల్పకార్యములు సైతము గొప్పఁజేసి పురుషులపైఁ గోపమూనుట స్త్రీలసహజ గుణము. (ఆలోచన నభినయించి) రాముని పట్టాభిషేక వార్తఁ దనకుఁ దెలుపలేదని కోపఁబడి యుండునా? ఉండనగును? ఈయూహ లేల? సాంత్వన వచనంబుల నూఱడించి కారణంబుఁ దెలిసికొనియెద? (కైకను సమీపించి మెల్లగ ముసుఁగుఁదీయును! కైక దశరథునిఁ ద్రోసివైచి మఱల ముసుఁగు వైచికొనును. దశరథుఁడు ముసుఁగుఁ బట్టికొని తీసి) కైకా! ఏమి యీ విపరీతచర్యలు, కోపమునకుఁ గారణం బేమి?

కైక:—(దట్టముగ ముసుఁగుఁ గప్పికొనుచు.)

దశరథ:—కైకా! నీకై కాదెనే వచ్చి దాసానుదాసుఁడుగ నిలచి నాను?

సీ. మెత్తనిపాన్పును మెచ్చకనీవిటు,
నేలనువలచితివేల? కైక!
ఆటలుపాటలు మాటలొల్లకయిటు,
మూగవైతివియేల నాగయాన?
హారముల్వదలి విహారముల్విడనాడ,
తాతెఱుకత మేమొ తన్వి నేఁడు?
కోపమా; యిదినాదుపాపమా; యింతటి,
తాప మేలాకొనీకుఁ దరుణి చెపుమ

గీ. బాలసౌజన్యశీల, గుణాలవాల,
బాలచంద్రాభసురుచిర భవ్యఫాల,
నీలమేఘనిభాలకజాల, యిటుల,
నేల యలుకలుసెల్పుమా, జాలమేల?

బాలా! ఇందిందిరాలక జాలా, సురుచిరముకుర కపోలా, బాలేందుఫాలా, నీసుమకోమల గాత్రంబీ నేలపైఁబడఁ ద్రోసితివేల? వెలలేని చలువ వలువలుండ నీమైలదుకూలము లేల గట్టితివి? మృదుల పర్యంకములపైఁ బవ్వళింపక ధూళిధూసరితంబగు నేలపైఁ బొర్లెదవేల? పసిడిసలాకపసను సరకుసేయని నీకుసుమ కోమలాంగంబు వాడువాఱ నదేల? హీరహారాద్య లంకారముల నొప్పారు నీశరీరమాహారవిహారాదులొల్లక కుందనేల? పున్నమ వెన్నెలజేని చెన్నుదన్ను నున్నని నీమేను కాంతిసన్నగిలెనేల? బాలచంద్రుని బోలు నీఫాల తలమునఁ బట్టి

రాచితివేల? నీ యలినీలాలకజాలంబు ఫాలతలం బాక్రమించుచుండఁ బాపటుఁదీర్పక యేపుచెడి పడితివేల? నీ యరుణాధరంబుల యరుణిమదశదిశలఁ బ్రసరింపఁ జేయక, శ్వాసోచ్ఛ్వాసముల వేడిమికి వాడఁ జేసితివేల? కమ్మని తావులీనుతమ్ములమ్ముల కెల్లమ్ములనంది కెమ్మోవినిడవేల? రాకాశశినిభాననా! జగ్గుగ్గి మెఱయువెన్నెలనిగ్గునుఁదగ్గించు నీ చిఱునగవు సిరిని నాపై నెఱపవేల? చెన్నుఁజెడి, సిందూరాఱి, చెలువుఁ గేఱి, మదిఁగూలి, యిలఁగూలి, సొలితివేల? ఎవరు నీకే యెగ్గులొనర్చిరి? ఎవరు నిన్నెదిరిమాటాడిరి? తెలుపుము. విధాతవారి నుదుట వ్రాసినవ్రాఁత నేటికిఁ దుది యనిపించెద. లజ్జవిడి, నామాటలాలించి, మన్నించి, హితమెంచి, గౌరవమూంచి, యనురాగముఁబెంచి సరససల్లాపముల నను నాదరింపుము. దేవీ, నీవు కోరితివేని నాప్రాణంబునునైన నిచ్చుటకు సిద్ధుఁడుగ నున్నాడను.

కైకే (లేచియొప్పుచు) నాథా! నాకు నెంతయుండిననేమి నే ననాథనైతిని.

(6. అనుబంధము.)

దశర:— మోహనాంగీ! అమంగళము పలుకులు పలుకకుము. అది యెంత గొప్పదయినను నీయభీష్టంబు నెఱవేర్చ నీదాసుఁడగు దశరథుఁడు సిద్ధుఁడుగనుండ నీవనాథ వెటులయ్యెదవు? నాయెడ నానిర్వీడ? నీ యిష్టార్థ మేమయినది నడుగుము. మారాడక నిచ్చెద వేడుము.

కైక:—(దశరథుని కంఠమునపైఁ బ్రేమ సూచించుచుఁ గేలుసాచి) మోహనాంగా! మగవారికి క్షణమునకు నొకబుద్ధి. ఊసరవెల్లివర్ణములు మార్చినటుల వారిబుద్ధులు మారుచుండును. వారికృత్యములో సందుసుడిమాయలు. అసత్యములే వారి యాభరణ

ములు ఈ దుర్గుణములన్నియును రాజులయందు రూపముఁ గొనియుండును. వారినిఁ దామసరాజసగుణములావరించి యెల్ల కాలము బాధించుచుండును. పాపభీతివారికి నించుకయినను లేదు. వారు మనమునఁ దలఁచునది యొకటి. నోట నాడునది వేఱొకటి. చేతఁ జేయునది మఱియొకటి. కావుననే రాజులకుఁ త్రికరణశుద్ధి లేదనిరూఢి.

ఉ. రాదు నిజమ్ము. రాజసవిరాజిత రాజుల నోట; వారికిన్
లేదు నిజమ్ము రాజు లవలీల నళీకము లెన్నియేని, స
మ్మోదమునన్ వచింతు రది ముఖ్యమతమ్మని; కాన భూధవుల్
మేదురపాపయుక్తులని, మేదినిఁ బల్కుదు రార్యు లెల్లరున్.

మోహనాంగా! సామాన్యముగ రాజు లింతటి దుర్గుణాధికులని సర్వు లెఱుంగుదురు. నీవో సూర్యకుల పారావారరాకానిశాకరుఁడవు. ఆదినుండి మేదిని నేలిన రాజులలో నధిక పుణ్యుఁడవు. అనేక యాగాచరణకర్మము లొనరించి పునీతుఁడైనవాఁడవు. నీయట్టి వానియం దనృతదోషంబు రాదని నే నెఱుంగుదును. అయినను నెట్టి సజ్జనుని మానసమైనను జలించుచుండును. అట్టి కాలంబున వారికి నసత్య దోషము మానసమున స్ఫురింపదు. జ్ఞప్తికి రాదు. కావున నీ విప్పుడు సలిపిన బాస సత్యమనియు తప్పక చేసెదననియు మాట యిచ్చినచో, నాయిష్టార్థంబు నీకుఁ దెలిపెద.

దశర:—కైకా! ఇన్నిదినములుగ నీవు నాకుఁ బ్రేమాస్పదురాలగు దారగనుండి, యిపుడు నాసత్యవచస్థితిని సందియించెదవా? సత్యము తప్పనని నీకుఁ బ్రమాణము గావలయునా? సజ్జనుని వాక్కే ప్రమాణము. వలచితివి గానఁ దెలిపెద వినుము. నీమనమును దెలుపుము.

ఉ. కామిని! తెల్పుమా! ద్విరదగామిని! నీదగు కామితార్థముం
దామరసాక్షి తీర్తునిదె, దైవము సాక్షిగ, భూమిసాక్షిగా;
నీమృదులాంఘ్రిసాక్షిగను, నీరధిసాక్షిగ, నమ్మవేని, గా
రామున మేము బెంచు మన రామునిసాక్షిగ, నగ్నిసాక్షిగన్.

భామామణీ! ఇంతకంటెను గరిసప్రమాణంబు నీ కేమి కావలయును?

కైక:—నాథా! భద్రము. ఆడితప్పిన దోషమునకు లోఁబడకుము.

దశ:—నాతీ! ఏల యీరీతి బాధించెదవు. నీయిష్టం బానతిమ్ము.

కైక:—నాథా! మఱేమియు లేదు. నాతోఁ దెలుపక రహస్యముగ రామునికిఁ బట్టాభిషేకంబు రేపు ప్రాతఃకాలంబుననే సలుప యత్నించితివఁట నిజమేనా?

దశ:—నాతీ! నిజము. ఆవార్తఁ దెలుపుటకునై నేనిపుడు వచ్చితిని.

కైక:—నాథా! అది నిలుపుటయె నాయిష్టార్థంబులలో నొకటి.

దశ:—ఏకారణంబున నిలుపవలెను?

కైక:—భరతునకుఁ బట్టముగట్టుటకు.

దశ:—కైకా! పెద్దకుమారుఁడుండఁ జిన్నవానికిఁ బట్టముఁగట్టుట రాజధర్మవిరుద్ధము.

కైక:—సత్యముతప్పుట ధర్మశాస్త్రవిరుద్ధము.

దశ:—అట్టిదికోరుట నీకు రీతికాదు.

కైక.—ఆడితప్పుట నీకు నీతికాదు.

దశ:—నీకోరిక నాకుఁ గోపకారణం బగును.

కైక:—మాటమీఱినచోఁ బాపకారణం బగును.

దశ:—వలదీ పిచ్చికూతలు.

కైక:—వదలుము నీ రిచ్చచేతలు.

దశ:—నీపలుకులు కర్ణశూలములు.

కైక:—నీపలుకులు నావీనులకు ములుకులు.

దశ:—నాతీ, నీవు మనఃపూర్వకంబుగ నిట్టికోరికఁ గోరియుండవని నాకుఁ దోఁచెడు.

కైక:—నాథా! నేను త్రికరణశుద్ధిగ నాకోరికఁ గోరినాను.

దశ:—ఛీఛీ! ఈదుర్మార్గబుద్ధి నీకువలదు! వలపు తలకెక్కినతఱి వెలది కోరినదియిత్తునని మాట యిచ్చినమాత్రాన నింతటి ఘోరమగు వర మడుగనగునా? నీకిది బుద్ధికాదు.

కైక:—అటులయిన నిచ్చినమాటతప్పెదువా? నీ సత్య మింతటిదేనా? నీ వధర్మపరుఁడవు. కావున నీసరసనుంట దోషము.

దశ:—కైకా! కామోన్మాదుఁడనై నేనాడినమాటలు కార్యమూలకముగ సాధించుట ధర్మముగాదు.

కైక:—సత్యధర్మసూక్ష్మములు నాకు వలదు. నేను వెళ్లిపోయెద.

(అనుచు వెళ్లుచుండును.)

దశ:—నీయిష్టము వెళ్లుము. (చింతించుచుఁ బరుండును.)

మంథర:—(పొంచి వినుచు వెళ్లెడు కైకనుఁజూచి) కైకా! కాటికి నెచటవెళ్లెదవు? దశరథునకు నీయందు నిజమగుప్రీతిలేదని ప్రారంభముననే పలికి నాలుగుసాధనముల నుపదేశించితి. అందు నొకటి యుపయోగించి విఫలవై వెళ్లివచ్చితివేల?

కైక:—మంథరా! నీవు పిచ్చిదానవు. నే నటు వెళ్లుదాననా? దశరథుని మనోవృత్తినరయ నిటువచ్చితి. నన్ను మాటలాడింపక యున్నవాఁడు.

మంథర:—మనోవృత్తి చూచుటేమి? నీకు మనోవృత్తినొసంగ సిద్ధుఁడుగనున్నవాఁడు. నీవు మనోహతవు కావలదు.

కైక:—తిరిగివెళ్లి నాసాహసంబుఁజూపెద. (దశరథుని సరసఁజేరి ముసుఁగుఁదీసి పాఱవైచి).

అనృతవాదీ! నేను వెళ్లిపోయితినని సంతసించి నిదురించితివియా? నే వెళ్లను. లెమ్ము. నీవు మోహంబుఁ దలకెక్కి మతిఁదప్పి మాట యిచ్చితివనుకొందము. అది పోనిమ్ము. నన్ను వివాహంబునకుఁ గోరినపుడు సవతులపైఁ దనబిడ్డనగు నన్నియ్యనని నాతండ్రి పలుకఁడా?

దశ:—నిజము. పలికెను.

కైక:—అపుడు నీవేమి బదులిడితివి?

దశ:—ఏమి బదు లిడితిని?

కైక:—ముదసలివై మతితప్పెను గాఁబోలు. నీరాజ్యంబు నాకునుంకువగ నుంచలేదా?

దశ:—(ఇంచుక యాలోచన నభినయించి) నిజము. నిజము. ఇపుడేల యామాట.

కైక:—నారాజ్యము నీవెటు రామునకు నిచ్చెదవు?

దశ:—కైకా! నీవాఁడుదానవు గనుక ధర్మసూక్ష్మములు దెలియవు నాభార్య లిరువురి కడుపునను పిల్లలు లేనందున నిన్నుఁ బెండ్లియాడ యత్నించితిని. నీకు సవతుల తొందర లేమికని నాయనురాగంబు తగ్గక యుండుటకును నారాజ్యం బుంకువ నుంచితిని గాని వేఱుతలంపునఁ గాదు.

(7. అనుబంధము.)

కైక:—ఔరా! మటుమాయకారీ! ఎన్నిమాయలు నేర్చితివి?

కానిమ్ము. పూర్వ మింద్రునకుఁగాను నీవు శంబరాసురునిపై యుద్ధమొనర్చితివి కదా ?

దశ:—నిజము. ఒనర్చితిని.

కైక:—ఆ శంబరాసురుఁడు నీపై ననేకములగు మాయలుపన్ని మేఘమార్గమునుండి బాణములు వేయ నీవు సొమ్మసిలి రథముపైఁబడితివి కదా ?

దశ:—నిజము మూర్ఛలో మునిఁగితిని.

కైక:—ఆకాలమున వాఁడు నిన్నుఁ జంపనటులఁ గాంచి, ధవళాంగుఁడను ఋషి నా కుపదేశించిన మంత్రమహిమచే శంబరుని మాయలన్నియును నోటు పడఁజేసి నీచే వానిఁ జంపించితిని కదా ? అపుడు నీవు నన్ను మెచ్చుకొని నాకు రెండువరంబు లొసఁగితివి కదా ?

దశ:—నిజము. నిజము.

కైక:—సమయము వచ్చినపుడు నే నావరము లడిగెదనని పలికియుండ లేదా ?

దశ:—నిజము.

కైక:—ఆవరము లిమ్మని యిపుడు నే నడిగెద.

దశ:—కైకా ! వార్ధకదశచే బాధనంది పుత్రస్నేహసాహాయ్యమునఁ బ్రాణదీపంబు నిలిపికొనియున్నాను నీక్రౌర్యఝంఝూమారుతమనువాయువును వరమిషచే పీచి యార్పకు. ఇచ్చిన వరంబులు లేదనను. వానిని సద్వినియోగ మొనర్పుము. నినువేఁడికొనియెద.

కైక:—దశరథా ! ఈబెసిమాలిన పలుకులు పలుమాఱు పలుకకు. జిక్కినజుట్టు చిక్కకున్నఁ గాళ్లనునానుడి ననుసరింపకు. చుట్లు

రట్టువలదు. నిజముకుఱుచ. భరతునకుఁ బట్టంబుగట్టుము, ఇది
యె నా కోరు మొకటివరము.

(8 అనుబంధము.)

దశ:—కైకా! నేనెంత వేఁడికొనినను, నీ క్రౌర్యము మానవైతివి. సప్తా
శ్వకులజుఁడను. సత్యబద్ధుఁడను. ఈవరమునుండి యనేకానర్థము
లుత్పత్తిల్లును రాముఁడు సుగుణాభిరాముఁడు. పితృవాక్యపరి
పాలకుఁడు. వానికి నేవిధమయిన సమాధానమైనను జెప్పివాని
నూఱడించెద.

కైక:—ఇక నా రెండవ వరము విధముఁ దెలిపెద వినుము.

దశ:—కైక! ఈనీ రెండవకోరిక యైనను ధర్మసమ్మతముగ నుండనిమ్ము.
బతిమాలి వేఁడికొనియెద.

కైక:—నాథా! భరతునకుఁ బట్టముఁ గట్టుటచే ననర్థము లనేకములు
కలుగునని నీవిపుడే పలికితివి గదా? నాకును నాభయమున్నది
కావునఁ బదునాలుగేండ్లు రాముఁడు వనవాస మొనర్చులాగు
నానతిమ్ము.

దశర:—(కోపమున) చాండాలీ! చాండాలీ! నోటికొచ్చిన నేమి పలికి
తివి? ఏమాడితివి?

కైక:—పదునాలుగేండ్లు, పూర్తిగఁ బదునాలుగేండ్లు, నేపటినుండి గూ
పదునాలుగేండ్లు రాముని, వనవాసగతునిఁ, జేయవలెను.

దశర:—(హాయని నిశ్చేష్టతఁగూర్చుని మూర్ఛచేఁ బడును).

కైక:—(భీతిలి. వెనుకకుఁ జరుగును). (మంథర ప్రవేశించి, కైకకేలుఁ
దట్టి).

మంథర:—భలా కైకా! నీభర్తనుఁ జక్కఁగ నెదిరించి వరంబులు
గొంటివి.

కైక:—నాభర్త నా రెండవకోరిక వినఁగనే క్రిందఁ బడిపోయెను. ఏమనునో కదా?

మంథర:—ఏమియు నేలయగును. ఇపుడు బ్రతికినన్నినాళ్లు మఱల బ్రదికియుండును. ఆభయము నీకునలదు.

దశర:—(లేచి, కూర్చుని) కైకా! కైకా:

కైక:—వచ్చితిని.

దశర:—కైకా! నీ వడిగినదియేమి?

కైక:—అపుడే మఱచితివియో? తేపటినుండి పదునాలుగేండ్లు రాముని వనవాసంబునకుఁ బంపవలెనని యడిగితిని?

దశర:—మగువా! సుగుణాభిరాముఁడగు రామునిపై నింతటి పగయేల? భరతునకుఁ బట్టంబుగట్టికొమ్ము. వాఁడు సుఖముగ రాజ్యమేలికొననిమ్ము. ఈ వృద్ధాప్యదశలో రాముని నే వదలఁజాలను. రామునివియోగము నా మరణసంయోగమేను. బహుకాలంబు పుత్రరహితుండనై తపించి దైవానుగ్రహమున సుతునిం గన్నులారఁ జూచునంతటి భాగ్యము కలిగెను. కలిగినభాగ్యము నగలఁజేయకు. పుత్రుల ముఖదర్శనవిభవంబుఁ జూడ నేఁబడిన పాటు దైవాఁ బెఱుంగు.

సీ. ఆపన్నసత్త్వయౌ యువతివ నాలోకించి
పుమపత్యపుణ్యంబు పొందఁజూచి
పొదుగుళ్లలో నున్న పుత్రునిరీక్షించి
ముద్దుపల్కులు వినిమోదమంది
చిఱునగవులునవ్వు చిఱుత నిరీక్షించి
ముదజలనిధిలోన మునిఁగి తేలి

వినయవినీతునిఁ దనయుఁ గన్నులఁగాంచి
సర్వస్వకుఁడనంచు సంతసించి
గీ. అట్టివానికిఁ బట్టముఁ గట్టుతెఱిని
గుట్టుగట్టుల పాజ్ఞేయఁ గోరనగునె
వనజలోచన నామాట వినవె నీదు
పదము లంటుచు వేఁడెద బ్రదుకుఁ గనెద.

కైక:—(మూర్ఖ్యగ మిడుకొని నిలుచును)

దశర:—కైకా! రాముని వనమునకుఁ బంపు కోరిక యొకటి మాని మఱి యెద్దియైన నడుగుము. రామునిపైఁ బగ సాధింపకుము.

కైక:—దశరథా! నేను పలుమాటల దానను గాను. పట్టినపంతము వదలు దానను గాను. నీమాయ పలుకు వినుదానను గాను.

దశర:—కైకా! అటులయిన నిన్ను మఱియొకటి వేఁడెద. దాని నైన నిమ్ము.

కైక:—అది యేమి?

దశర:—కైకా! మన భరతుఁడు గిరివ్రజపురమునుండి వచ్చునంతవఱకయినను రాముఁ డిచట నుండనిమ్ము.

కైక:—ఔరా! ఆలోచన? దురాలోచన? నేను నీమాట వినుదానను గాను భరతుఁడు వచ్చిన పిదప వాని నెటులయిన మోసగించి నాపట్టుదల మరల్పు లాగొనరింపవలెనని కదా నీదురాలోచన. నాకుఁ దెలియును. నీతల్లి నీకేపాలిచ్చి పెంచెనో నాతల్లియు నట్టి పాలే యిచ్చి నన్నుఁ బెంచినది. నీమోసములు నాయందు ఫలింపవు. ఏల దీ బయకారి పలుకులు. నా పంతము వదలను.

దశర:—కోమలీ! సంతోషజలనిధి వీచికలలో సంతతముం దలి

దంద్రుల నోలలాడించు బాలకుని, వంశపాలకుని, రాముని, రూపజితకాముని, సౌజన్యగుణధాముని, గనికరము మాని, కౌటిల్యమూని గహనతలములకుఁ బొమ్మన నీకు నోరెటులాడెనే? వలదీకోరిక. నినువేఁడెద.

(9. అనుబంధము)

కైక:—(కోపమున) అనృతవాదీ! దుష్టాశయా! క్షత్రియవంశపాంసనా! సప్తాశ్వాన్వయ విదూషకా! కులక్షీరసాగర హాలాహలా! వంశాంబుధి బాడబా! ప్రణవమునఁ బ్రపంచమంతయు నణఁగిన విధమునఁ బదునాలుగు లోకంబులు సత్యముపైన నిలిచినవి? ఆ సత్యమును బరిపాలించు నీవే యింతటి యసత్యములాడి యిక్ష్వాకుకులమునుఁ జెఱుపఁజూచి యేమి యుద్ధరించెదవో చూచెద. నేఁ బోయివచ్చెద.

దశర:—(నిట్టూర్పు సారించుచు కైకనుఁబట్టి నిలిపి).

సీ. కటకటా! నాపాలి కాలపాశంబయ్యె
 కాంతవినూతన కాయరుచులు
హరిహరీ! ప్రాణాపహార విషంబయ్యె
 హరిమధ్యరుచికలి తాంగవల్లి
అక్కటా! శిరముపై నశనిపాతంబయ్యె
 నానత్తనాభి యనుఁగుఁ బలుకు
నిర్భరదుర్వార దుష్ప్రసహంబయ్యె
 విమలలోలాపాంగ వీక్షణములు
గీ. నాఁడు కానేరదిది మహావారిధరను
 నాతి కానేరదిది మహాభూతమవని

దయిత గానేరదిది దొడ్డదయ్య మయ్యొ ?
చెడితి నన్నిటఁ నీచెలి చెలిమిఁ జేసి.

అకటకటా! ఈకుటిలాలక, యింతటి కటిక గుండియ, యని తెలియనైతిని అయ్యో! ఈకలకంఠకంఠి, నాబహిఃప్రాణంబగు బాలకుని సుఖముపాలి యకాల కాలపాశంబుగఁ బరిణమించెను? ఈకాలాహివేణి, నాబాలునకు గళబద్ధోగ్ర కాలాహియయ్యెను. ఈమత్తకాశిని చిత్తము శిరీషసుమంబున కంటె మెత్తనని యెన్నితిఁగాని మెత్తిన పాషాణంబని యెఱుంగనైతిని. ఈచెలి, తళుకుబెళుకులు మోహనంగాగలతలని మోసపోయితినిగాని, నన్నుఁగట్టుటకు నేసేకొనిన నిశ్నఖచిత సువర్ణశృంఖలములని కాననైతిని. ఈయలివేణి మందమారుతస్వన ఘంటిగాని పూఁబోణికాదు. ఈచెలిమేకవన్నె పులిగాని నామేలు గోరెడియాలుగాదు. ఈయువతీలలామ,మృషాభిమాన మద హింసా జనన సీమగాని, స్వాభావిక భామగాదు. ఈకలాపి కలాపకుంతల, నాపురాకృత సుకృత సారంగ శార్దూలగాని నాసుఖాలవాలమగు సుగుణ జాలగాదు. ఈయండజరాజగమన నాకను పంకువయి ముంగసునని మోచితినిఁ గాని నాకుగా గుండె తల్లడమగునని తలఁపనైతిని. ఈయులసగమన నాయలసటకు నమృత కలశమగునని యెన్నితిని గాని నాకంటకమై నలుసగునని తెలియనైతిని. ఈమచ్చెకంటి నాసచ్చరితములకుఁ గోడగునని యుంటిని గాని నాపచ్చడంబులోని చిచ్చగునని యెన్ననైతిని. ఈదుశ్చరిత నాకు దుశ్చికిత్సంబగు వ్యాధయయ్యెను. ఈయురగవేణి నాపరిధానాంతర్లీన మహోరగమయ్యె. అయ్యో! మాటలాడఁజాల. శరీరము కాల చక్రముంబలెచలించెడు. మానసము కీలికీలలంబడి కాలెడులాగున్నది. నిలువఁజాల? (అనుచు శయ్యపై మూర్ఛపోయి పడును.)

మంథర:—(ముందరికివచ్చి దశరథునిఁజూచి). కైకా! నీవు భయపడకుము. నీధైర్యమంతయును జూపు సమయము ముందున్నది. మగనిమ్రోల నింతగ రచ్చకెక్కి యితరులెవ్వరేని నేమాయినను బలికినపుడు సొలిపోయితివేని నీవుచంచలయని యపనింద వచ్చును. నీకడుపునఁబుట్టిన కొడుకునకుఁ గాను నీవేమొనర్చినను దోషములేదు. నీచాతుర్యమంతయును నిపుడుచూపుము. ఎవరికిని వెఱువవలదు. వెలుపలనెవరో కాలుచప్పుడు సేయుచున్నారు. పోయిచూచెద. (వెళ్లిసుమంత్రునిఁ బిలుచుకొని మఱలవచ్చును).

కైక:—(సుమంత్రునిఁజూచి) ఏమీ? సుమంత్రీ! వచ్చితివి?

సుమంత్ర:—అమ్మా! తెల్లవాఱవచ్చినది. రాముని పట్టాభిషేక మహోత్సవంబునకు సర్వము సిద్ధముగ నున్నది. దశరథ మహారాజుగారు వచ్చి మంగళస్నాన మొనర్చు సమయమైనది. మఱచి నిదురించిరేమోయని పిలువవచ్చితిని.

కైక:—మంచిపనిఁ జేసితివి. సమయమునకు వచ్చితివి. రాజుగారించుక యాయాశమున బాధఁబడుచు రామునిఁ జూడఁ గలవరించుచున్నవారు. వైళమె నీవు నీతండ్రిగారు పిలుచుచున్నారని రామునకుఁ దెలిపి పిలుచుకొనిరమ్మా. పొమ్మా.

(సుమంత్రుఁడు నిష్క్రమించును).

మంథర:—(ముందరికివచ్చి కైకనుఁ జూచి) కైకా! రామునేల పిలిపించితివి?

కైక:—మంథరా! ఆవిషయము నీకిపుడే తెలియును.

దశ:—కైకా! రామునేల పిలిపించెదవు? ఇఁక రెండు గడియలు నెమ్మదిగనుండుము. నేనంతకున్ బ్రోలు జేరిన పిదప నీవు రాముని నీచెంతకు బిలిపించి యువ్వార్తఁ దెలుపుము. అంతోమ్మత్తుఘనైన నన్ను దయఁజూడుము. కఠికనై, నాముద్దుబాలుని రాముని నటవికిఁ బొమ్మని పలుకఁజాలను.

కైక:—దశరథా! ఈముసలిమాటలు మాటలాడి నన్నటమటింపఁ జూడకు. ఇట్టినటనలు నాకుఁ దెలియును. చిఱుకర్కమును నాతో లో మూర్ఛపోయిన వానింబలెఁ బడియెదవు. అటులనే చివాలు న లేచెదవు. ఇన్నిపడఁగాని యవస్థలు బడుచుంకొనెను నాకువరములియ్యనని యొక యసత్యమాడిన జాలు. నాకదపదు వేలు. నీ యశము దశదిశలు నిండును. అసత్యమాడునారిలో దశరథుఁడే ప్రథమపాదముగ నుండువాఁడని జనులలోనీకు శాశ్వతకీర్తివచ్చును. నీవంశ మూలపురుషుఁడగు సూర్యుఁడు సకల కర్మసాక్షిగ నుండి నీచర్యనుఁజూచి తనవంశజుఁడగు దశరథుఁడు సత్యము చక్కఁగఁ గాపాడెనని యెదమెచ్చును. ఇక్ష్వాకుఁడు మొదలగు నీపితృపితామహులు తమ వంశజుఁడు కులమునకే పన్నెఁ దెచ్చెనని సార్వకాల మెన్నుచుందురు.

(రాముఁడు సుమంత్రునితోఁ బ్రవేశించును. దశరథుఁడు ముసుఁగిడుకొని పరుండును.)

(10 అనుబంధము.)

రాముఁడు:—(దశరథుని సమీపించి) నాయనా! నీ సుతుఁడు రఘురాముఁడు నీయానతి రీతిగవచ్చి నీయాజ్ఞకుఁ గాచియున్నాఁడు. ఆజ్ఞ యిమ్ము.

దశర:—(ముసుఁగు తీసి రాముని మోముఁజూచి కన్నీరునించుచు మఱల మోము మూసికొనును)

రాముఁడు:—నాయనా! ఇదియేమి చర్య? నీ విన్నాణపు మోమున నింతటి ఖిన్నభావము నే నెన్నఁడును జూచి యెఱుంగనే? నన్నుఁ జూచిన క్షణముననే చేరందీసి కప్పుకొని కౌఁగలించి శిరము మూర్కొని నాయనా యని యనురాగమున ననుఁ బల్కరించుచుంటివి గదా? నేఁడేమి నా మోముఁజూచి కన్నీరు నించెదవు? నేనేమి మం తొనరించితిని? నాతో నొకమాట సైత మాడని యపరాధము నే నేమొనర్చితిని. ఎవరు నీకేమి యెగ్గొన రించిరి?

క. ననుఁగన్న నాయనా! యిటు
ఘనతర వ్యసనమునఁగుంది క్రాఁగెద వేలా!
వినిపింపుము సర్వము, నీ
తనయునకును, గొంకుమాని, తడయక యెలమిన్.
జనకా! లోకము లెల్ల నొక్కమెయి జయింపఁగల పుత్రులు
నలుగురుండ నీకే కొదువఁగలిగెను?

దశ:—(రాముని మోముఁజూచి నిట్టూర్పువదలును. మఱల ముసుఁగిడి కొనును)

రాముఁడు:—(కైకనుఁజూచి) అమ్మా! ఏమి కారణమున నాతండ్రియిటు వ్యాకులాయత్తచిత్తుఁడై పడినాఁడు.

చ. తెలుపఁగదమ్మ తండ్రియిటు తేఁకువవీడఁగనేల యమ్మ వ్యా
కులమిది యేటికమ్మ, ననుఁగూరిమిఁ జూడక మౌనమూనఁగా,
దలచుట యేలనమ్మ, సుతుధైర్యము ప్రీలుగదమ్మ యీవిధ
మ్ములకుఁగతమ్మెఱుంగ నిదె మ్రొక్కెద ననుమమ్మ ప్రేమతోన్.

అమ్మా! నాయన్నయేల నాయన్నాయని నన్నుఁ బల్కరింపక చేరఁదీయక శిరంబు మూర్కొనక, ముద్దిడక, గుండె లెగయుచు, నిట్టూర్పులు విడుచుచు, కన్నీరు కడవలనుండి బలెగుమ్మరించుచు శయనించినాఁడు? కారణంబేమి ?

కైక:—తనయా! రామా! జగదభిరామా! నీతండ్రి వ్యసన వృత్తాంతమునర్వమును సంక్షేపముగఁ దెలిపెదను వినుము. మున్ను దేవకార్యార్థమయి నీతండ్రి శంబరాసురునితో యుద్ధమొనర్చుచు వానిమాయలకుఁ జిక్కి ప్రాణాపాయము గలుగుసమయమున, నేను, ధవళాంగముని వరప్రసాదంబునఁ బడసిన మంత్ర మహిమచే, నా రాక్షసుని మాయలడంచి నీతండ్రిచే వానిఁ జంపించితి. అట్టినా సాహసకార్యమునకు మదిమెచ్చి, నీతండ్రి నాకు రెండు వరమ్ము లొసంగెను? సమయము వచ్చినపుడు నేనువానిని వేఁడెదనని పలికియుంటిని. ఇప్పుడట్టి సమయము తటస్థించినందున నావరములిమ్మని వేఁడితిని? అవి యెవ్వియనునది, తెలిపితిని? దానికీరీతిఁ జింతించు చున్నవాఁడు.

రాముఁడు:—అమ్మా! నీవేమి గోరితివి;

కైక:—నాయనా,

దశ:—కైకా! నిన్ను పలువిధముల వేఁడికొనియెద తెలుపవలదు.

(11) అనుబంధము.

కైక:—నాయనా! భరతుని పట్టాభిషేకంబును పదునాలుగేండ్లు నీ వనవాసంబునుఁ గోరితిని.

దశర:—(లేచి)? ఛీ. చాండాలీ; పుత్రఘాతుకీ? (అనుచుఁ దిన్నఁబోవును. రాముఁడడ్డగించి తండ్రినిఁ గూర్చుండఁబెట్టును)

దశర:—(ముసుఁగు తీసి రాముని మోముఁజూచి కన్నీరునించుచు మఱల మోము మూసికొనును)

రాముఁడు:—నాయనా! ఇదియేమి చర్య? నీ విన్నాణపు మోమున నింతటి ఖిన్నభావము నే నెన్నఁడును జూచి యెఱుంగనే? నన్నుఁ జూచిన క్షణముననే చేరందీసి కప్పుకొని కౌఁగలించి శిరము మూర్కొని నాయనా యని యనురాగమున ననుఁ బల్కరించుచుంటివిగదా? నేఁడేమి నా మోముఁజూచి కన్నీరు నించెదవు? నేనేమి మంతొనరించితిని? నాతో నొకమాట సైతము మాడని యపరాధము నే నేమొనర్చితిని. ఎవరు నీకేమి యెగ్గు లొనరించిరి?

క. ననుఁగన్న నాయనా! యిటు
ఘనతర వ్యసనమునఁగుంది క్రాఁగెద వేలా!
వినిపింపుము సర్వము, నీ
తనయునకును, గొంకుమాని, తడయక యెలమిన్.
జనకా! లోకము లెల్ల నొక్కమెయి జయింపఁగల పుత్రులు నలుగురుండఁగ నీకే కొదువఁగలిగెను?

దశ:—(రాముని మోముఁజూచి నిట్టూర్పువదలును. మఱల ముసుఁగిడికొనును)

రాముఁడు:—(కైకనుఁజూచి) అమ్మా! ఏమికారణమున నాతండ్రియిటు వ్యాకులాయత చిత్తుఁడై పడినాఁడు.

చ. తెలుపఁగదమ్మ తండ్రియిటు తేఁకువవీడఁగనేల యమ్మ వ్యా
కులమిది యేటికమ్మ, ననుఁగూరిమిఁ జూడక మౌనమూనఁగా,
దలచుట యేలనమ్మ, సుతుధైర్యము ప్రీలుగదమ్మ యీవిధ
మ్ములకుఁగతమ్మెఱుంగ నిదె మ్రొక్కెద ననుమమ్మ ప్రేమతోన్.

అమ్మా! నాయన్న యేల నాయన్నాయని నన్నుఁ బల్కరింపక చేరఁదీయక శిరంబు మూర్కొనక, ముద్దిడక, గుండె లెగయుచు, నిట్టూర్పులు విడుచుచు, కన్నీరు కడవలనుండి బలెగుమ్మరించుచు శయనించినాఁడు? కారణంబేమి ?

కైక:—తనయా! రామా! జగదభిరామా! నీతండ్రి వ్యసన వృత్తాంతముసర్వమును సంక్షేపముగఁ దెలిపెదను వినుము. మున్ను దేవకార్యార్థమయి నీతండ్రి శంబరాసురునితో యుద్ధమొనర్చుచు వానిమాయలకుఁ జిక్కి ప్రాణాపాయము గలుగుసమయమున, నేను, ధవళాంగముని వరప్రసాదంబునఁ బడసిన మంత్ర మహిమచే, నా రాక్షసుని మాయలడంచి నీతండ్రిచే వానిఁ జంపించితి. అట్టినా సాహసకార్యమునకు మది మెచ్చి, నీతండ్రి నాకు రెండు వరమ్ము లొసంగెను? సమయము వచ్చినపుడు నేనువానిని వేఁడెదనని పలికియుంటిని. ఇప్పుడట్టి సమయము సంప్రాప్తించినందున నావరములిమ్మని వేఁడితిని ? అవి యెవ్వియనునది, తెలిపితిని? దానికీరీతిఁ బాధించు చున్నవాఁడు.

రాముఁడు:—అమ్మా! నీవేమి గోరితివి;

కైక:—నాయనా,

దశ:—కైకా! నన్ను పలువిధముల వేఁడికొని యెద తెలుపవలెనా.

(11) అనుబంధము.

కైక:—నాయనా! భరతుని పట్టాభిషేకంబును పదునాలుగేండ్లు నీ వనవాసంబునుఁ గోరితిని.

దశర:—(లేచి)? ఛీ. చాండాలీ; పుత్రఘాతుకీ ? (అనుచుఁ బిన్నఁబోవును. రాముఁడడ్డగించి తండ్రినిఁ గూర్చుండఁబెట్టును)

రాముఁడు:—నాయనా; ఇంతకేనా యింతటివంత? అదియేమి కారణమో పిన్నతనమునుండి నాకు నరణ్యమున నివసింపవలెనను కోరిక హెచ్చుగనున్నది దానికి ననుకూలంబుగ దయానిధి యగు నాతల్లి కైకేయీదేవి వరములడిగినది. దీనికినీకుఁ జింత యేల? నావియోగమునకుఁ గదానీవు చింతించునది. ఆవియోగము కాలక్లిష్టమనది గదా? వేదాంతవిదుఁడు దశరథుఁడని పడిసన్నుఁ గాంచిననీవు విమోహ వారిధిలో మునుంగనగునా? రవివంశమున స్థిరసూనృతకీర్తి ధురంధరుఁడవని పేరందిన నీయశః ప్రసూనామోదంబు వారాశిప్రావృత మేదినీవలయంబెల్ల వ్యాపించినది. ఈరీతిఁగీర్తి కన్యకనుపెంచి పెద్దఁ జేసిననీవు పుత్రవ్యామోహమునఁ జిక్కి నూరిమి కళత్రమునకు నిచ్చినమాట తప్పనగునా ? ఈవ్యామోహము నీవివేక లవిత్రమునఁ దెంపుము. వదలుము నీవ్యాకులము ఇంతకును పట్టాభిషిక్తుఁడుగానున్నవాఁడు నాయనుంగు సోదరుఁడు భరతుఁడు? నీకుపుత్రులందఱును సమానులేకదా? ఒకవేళ నేను రాజయిన ను రాజ్యభారంబు నానిపై నిలిపి దేవబ్రాహ్మణ ప్రీత్యర్థము కొన్ని వత్సరంబులు నేనరణ్యముఁ జేరి రాక్షస కంటకంబులచటినుండి తొలఁచివేయవలెనని యుంటిని. కాకతాళీయన్యాయంబుగ నాయభిలాషయే నాతల్లి కైకేయీదేవి వరరూపంబున నెన్నినాకు మహోపకార మొనర్చుచున్నయది. నాకు సెలవిమ్ము. ఈవార్త నాతల్లికిని నాయనుంగు తమ్ముఁడగు లక్ష్మణునకును సీతకును దెలిపి వచ్చెద.

దశర:—రామా; రవివంశ ధామా; వలదు వారికిఁ దెలుపవలదు. రఘురామా? పావననామా? సుందరకామా ? నీవియోగంబు నే

సైంపఁజాలను. జానకీరామా! రాక్షసవిరామా! నృపకులసా ర్వభౌమా! విశాలయశోభిరామా! నీలమేఘశ్యామా! నిను వదలి నేమనఁజాల. నిలువఁజాల.

రాము:—నాయనా! ఈవ్యాకులము మానస సంతాపనీయకుము.

క. పదునాల్గేండ్ల వియోగము
పదునాలుగు గడియలనుచుఁ బాపుమతండ్రీ!
పదములఁ బట్టుచును వేఁడెద
సదయత నడవులకుఁబంపు చయ్యన నన్నుళా.

నాయనా! "సత్యంవద"యని శ్రుతి శాసింపదా? ఈవిధికి దేశ కాలబాంధవ్య సమయ నియమములు లేవుగదా! "సత్యేసర్వం ప్రతి ష్ఠితం" మ్మని వేదవచనమున్నదికదా? జగత్త్రయము సత్యముపైనఁ బ్రతిష్ఠింపఁబడినది నిజముగదా? "సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ"యనుట వలన సత్యము భగవంతునిస్వరూపమని శ్రుతివాక్యప్రమాణములు స్థాపించుచున్నవి. "సత్యమేవజయతి నానృతం" అనువాక్యముచే సత్య మున జయము గలుగును గాని యనృతమువలన జయముకలుగదు. వీని నెల్ల నీవు చక్కఁగ నాలోచించి నాతల్లి కైకేయీదేవికి నిచ్చినవరము లు ఫలీకరింపఁ జేయుము. సత్యము ధరణిలో స్థాపింపుము. పుత్రవ్యామో హమున సత్యము వదలకుము.

దశ:—రామా! నీవెన్ని వేదాంతవచనములు బోధించినను నామా నసమును బంధించిన మోహపాశమునుఁ ద్రెంపఁజాలను. నిన్ను వదలఁజాలను.

రాము:—నాయనా! ఇపుడే మరల నీ దర్శనమునకువచ్చెద. మన మును వ్యాకులమున చింపక యూఱడిల్లియుండుము. (వెళ్లును.)

దశ:—రామా! రామా! పోవలదు. పోవలదు. నీతల్లికి నీవార్త తెలుపవలదు. (కైకనుజూచి) కైకా! నీవెంతటి కటికదానవై తివియే? ఎంతటి పాపాత్మురాల నయితివే! నీమోముఁ జూచిన దురితము వాటిల్లు. (ముసుఁగిడుకొని పరుండును) (తెఱపడును)

(నిష్క్రమము.)

చతుర్థరంగము - రాజభవనము.

రాముఁడు, లక్ష్మణుఁడు, కౌసల్య, సుమిత్ర, సీత.

(12. అనుబంధము.)

కౌసల్య:—రామా! నీవెంట నేనును వచ్చెద. నిన్ను వదలి నేమనఁజాలను.

క. తనయా నీవెను వెంటనె
వనతలమును జేరుదాన, వలదనవదలన్
నినువదలి యుండఁగలనే
తనువునఁ బ్రాణములు దాల్చి తగునని ధరణిన్.

రాముఁడు:—అమ్మా! పతివ్రతాశిరోభూషణవగు నీవీరీతిఁ బలుకనగునా? నాతండ్రి శతవృద్ధు. అట్టివానిని నిరాదరించి, నీవు నావెంట వచ్చినచో నతఁడు ఏ విషయమేమి దలంచును? లోకులు నీవిషయ మేమనియెదరు? పుత్రస్నేహమున నీవు ధర్మసూక్ష్మములు మఱచుట తగదు. నీకు నావియోగం బతిస్వల్ప కాలముగదా? నాతల్లి కైకేయీదేవి శాశ్వతంబుగ నే నరణ్యంబున నుండవలెనని కోరదు.

మ. జననీ! యీవల వంతయింత తగునే? చాలింపుమాచింత; నే
వనవాసం బవలీలఁగా సలుపుచున్ వత్తున్నిను న్వేగఁగా

కౌ:—తనయా! నీదు వియోగజన్యమగు చింతల్ బాయఁగా శక్యమే
అనలంబారునె దూదికప్పిన విహారారామరామాకర్ణ.

రామా! నీపలుకులు హితనీతి యుతంబులు. అయినను నా మానసాగ్ని నీసాంత్వన వచనములఁ జల్లారక యున్నది.

రామ:—తల్లీ! ఈవిషయమున దూరాలోచనపరురాలవు గమ్ము. పితృవాక్యమునుఁ బాలింపక నేనిచట నిలిచితినిఁబో, దీనినుండి కలుగు ననర్థము లనేకము లుండును.

సీ. కులదైవ మొల్లెడఁ గలయఁజూచుచు నన్నుఁ
గలుషవర్తనుఁడని తెలియునమ్మ
ఇక్ష్వాకభూపాలు నీడితకీర్తికిఁ
గుందుఁ గల్గుచు నాశముందునమ్మ
సత్యహరిశ్చంద్రు నడిసన్న యడుగంటి
కలుషవారిధిలోనఁ గలయునమ్మ
అలభగీరథుయశ మవనినిఁ గూలును
నానుండి నిజమిది నమ్మవమ్మ
గీ. తండ్రికినిఁ గీర్తిఁ దేలేని తనయుఁ డుండి
ఫలము లేదమ్మ యిదినీవు తెలియుమమ్మ
గహనవాసమ్ము నీయను గ్రహమువలన
గృహమె యగునమ్మ సెలువిమ్మ కృపనుగనుమ.
(పాదములపైఁ బడును)

కౌసల్య:—(రాముని లేవనెత్తి) తనయా! సుగుణసముదయా! సముదంచితనయా! పుత్రవియోగ పటుతరచింతాక్రాంతనై, రామా! ఈశరీరము భరింపఁజాల. దుర్భరము. దుర్భరము. నాప్రా

ణమై నాప్రాణానిలమై, నాబహిః ప్రాణమైరాణించు చిన్నెల చిన్నెలాని, వన్నెలవగలకాని, చెన్నారు సొబగులవాని, గ్రొన్నెలమోమువాని, వెన్నెలఁబోలు దరహాసంబువాని, నున్నత భుజములవాని, నాకన్నుల పండువును, నామన్ననవాని, నాకన్న కొమరుని నిన్ను కాననంబునకుఁ బొమ్మని, నాయనా, నానాలుక నుండి యెటులాడఁగలను? పుత్రా! రాజీవదళనేత్రా! రంజిత శుభగాత్రా! నిన్నెట్లు నేమఱతు? నీవియోగంబు నే నెట్లు సైఁతు? ఈసంతత సంతాపంబు నే నెట్లు సహింతు? ఈశరీరమెట్లు భరింతు? అంతకంతకు మితిమీఱు వంత లెట్లు సైరింతు? నీగుణశీలంబు లెట్లు నే నెంతని యెంతు? ఎంతని విలపింతు తనయా! నీవులేని నా బ్రతుకు మావిలేని యుపవనముగాదే? ఈవిలేని భాగ్యంబుగాదే? తావిలేని కుసుమంబుగాదే? ఠీవిలేని రాజ్యంబుగాదే? పుత్రా! నీవులేనినా బ్రదుకు చంద్రుఁడులేని రాత్రియగునుకదా. సారసములులేని సరోవరమును బోలును గదా! కలకంఠంబులులేని యుపవనమెగదా? తాలిమిలేని తపసి చందమగునుకదా! అట్టి బ్రతు కేల? వ్యర్థము, వ్యర్థము. అకటకటా! నవమాసంబులు గర్భమున భరించి, దుస్సహప్రసవవేదనలు సహించి, పడరాని యిడుములఁబడి, కని, పెంచి, యెత్తి, ముద్దిడి, కడుఁబ్రేమతో రేయింబవలుఁగాచి, కరుణించి, యిన్నివత్సరంబులు రక్షించి, తుదకుఁ గఠినాటవులలో మృగముఁబలె సంచరింపఁ బంపఁ, గన్నతల్లినగు నాకు సాధ్యమా? తనయా! బహుప్రయాస లబ్ధ్యాశనప్రాశనులగు నిఱుపేదలకు నీవు జనింపక చక్రవర్తినినగు నాయుదరంబునఁ బుట్టినందునఁగదా నీకిన్ని కష్టంబులు గలిగె? తనయా! నీవునా

యుదరంబునఁ బుట్టక నీసవతితల్లియగు కైక గర్భంబున జనిం
చి యుండినచో నీసుఖములకు నెనలేక యుండెనుగదా! నీముద్దు
మోమునుజూచి మేమందఱము సంతసించుచుంటిమికదా?
పుత్రా! ఇన్నిదినంబులు రక్షించునది పటుతర ఘోరాటవులకు
బలియిచ్చుటకా? పట్టీ! పట్టభద్రుని జూడ్మిపట్టె నగునీకుఁ గట్ట
డవినివాసము ప్రాప్తియా? కట్టెడి బ్రహ్మనీఫాల సట్టికపై వ్రాయించె
నే? రామా! నీవుపుట్టినపుడు కాలజ్ఞులు నీజాతకమునుఁ జూచి
భోగభాగ్య సంపన్నుఁడవగుదు వనినమాటల ఫలమాయిది?
సాముద్రికశాస్త్రజ్ఞులు నీపాదపద్మములందుఁగల జలజాత,
హల, కులిశ, ధ్వజ, కలశరేఖలఁ జూచి విశ్వము నెల్లనేలు
సార్వభౌముఁడౌనని పలికినపలుకుల ఫలమా యీవిపినతలనివా
సము? రామా! వంశాబ్ధిసోమా! నిన్ను నేవదలజాలను.

రాముఁడు:—తల్లీ! ఈవ్యామోహము వలదు. ఊఱడిల్లుము.

క. అమ్మా! వ్యామోహము వల
దమ్మా. యూఱటను జెందవమ్మా. యటవుల్
గ్రుమ్మరలి వత్తునమ్మా
క్రమ్మఱి సెలవిమ్మ; మనముఁ గలఁపకు మమ్మా.

అమ్మా! నీపాదపద్మములకుం బడి వేఁడికొనియెద. నాకు సెల
విమ్ము.

కౌసల్య:—నాయనా! (అనుచుఁ గ్రిందఁ గూర్చుండును)

రాముఁడు:—(సీతనుఁ జూచి) సీతా! సుగుణసమేతా! నీ నాతోనుండి
ప్రయోజనంబేమి? నా వియోగము నీకుఁ బదునాలు గేండ్లు
గదా? అది పదునాలుగు గడియలని యెన్నుము. నీయత్త

మామగారిసేవ నేమఱక పుట్టిన యింటికిని మెట్టినయింటికినిఁ గీర్తిఁదెమ్ము. నాకు సెలవిమ్ము.

(13 అనుబంధము)

సీత:—ప్రాణనాథా! ఏల నాపై నింతగఁ గాఠిన్యము వహించితివి? నావేఁడికోలు నీ వీనుల కెక్కదాయెఁగా? నీవియోగము సైఁచికొని నే నెన్నిదినంబు లిచట మనఁగలనని తలఁచితివి? నీసుఖదుఃఖములో భాగరిని నేనుగానా? వివాహకాలమున నే నట్టుప్రమాణంబు సేయునా? ఎన్నఁడుగాని నిన్నెడఁబాయ నని యగ్నిసాక్షిగ నీవు ప్రమాణంబుఁ జేయవా? ప్రమాణ భంగంబు ధర్మవిరుద్ధంబు కాదా! చక్కగ నాలోచింపుము.

రాముఁడు:—మోహనాంగీ! నిన్ను వదలిపోవునంతటి కఠినాత్ముఁడనా నేను? కుసుమకోమలాంగివియగు నీవు విషమాటవుల సంచ రింపఁజాలవని యెన్నితినిగాని వేఱొకటి కాదు.

సీ. తలిరులఁబోలెడు తరుణి నీపదములు
కంటకకలిత మా కాననంబు
అతికోమలతఁబూను లతనీదు దేహంబు
వితతాతపాతప్త విపినమదియు
మెత్తనిమెత్తల మెచ్చదు నీమేను
కర్కశపాషాణ గహనమదియు
పిచ్చుక లఱచిన ఱిచ్చపడెదు నీవు
భీషణ మృగనాద భీష్మమదియు
గీ. కటకటా! యిట్టి గఠినత లెటులనీవు
సైఁతువని వీడనాడితి సతిరో నిన్ను

విడనాడిన కఠినుని విధముగాదు
మగువలకు కాననంబులు తగవు తరుణి.

కోమలాంగీ! ఘోరారణ్యంబులు నీయట్టి కుసుమకోమలాంగులు వసింప నర్హములైనవి కావు. మణిగణఖచితమందిరంబులందుండి సమ్మోదములందు నిన్ను వనమందిరంబులం దుంపనగునా? వీని నాలోచించికదా నిన్నిచటనే వదల నిశ్చయించితి.

**సీత:**—నాథా! నీదండ బాసి నేనుండి ప్రయోజనమేమి? నాథుని సన్నిధానంబుగాదే నారికి స్వర్గసుఖమ్ము.

సీ. పతిదండ లేనట్టి సతియుండఫలమేమి
కోయిల లేనట్టి మావిఁబోలె?
భర్తనుబాసిన భార్యయుండఁగనేమి
శారిక లేని పంజరముఁబోలె
పురుషరాహిత్యమై తరుణియుండఁగనేమి
తావినిఁబాసిన పూవుఁబోలె
ధవునెడఁబాసిన యువిదయుండఁగనేమి
శశివిలాసములేని నిశినిఁబోలె?

గీ. అనఘ జీవాత్మలేని దేహమునుబోలు
నాథు నెడఁబాసియుండిన నారిబ్రదుకు
దైవమును లేనిగుడియుండఁ దగునెరమణ?
స్వర్గసుఖమేల పతియుండు సతికిరామ?

రామా! నిన్నువదలి నేనిచట నుండఁజాలను. ఇంతకంటెను హెచ్చుగ నీకు మాఱుపలుకఁజాలను.

**రాముఁడు:**—సీతా! నినువదలియుండ నా మనమొప్పునా? వనవాస

క్లేశంబులు నీవు సైఁపఁజాలవని నేఁ బలికితిని. నీవా కష్టములో
ర్వను ధైర్య ముండెనేని నవశ్యము నావెంటరానగును.
(లక్ష్మణునిఁజూచి)

మ. అనుజా లక్ష్మణ పోయివచ్చెదను విన్నా శైల్య మిత్రమ్ముగా
గనియున్నాఁడను గాన నీవెటుల నీకౌసల్యకున్ దండ్రికిన్
వనటల్బాయుఁగఁ జేయుదో యిఁకియు నీభారమ్ము. నావారుగా
నినునేనుంచెద నిచ్చటన్ సతతము న్సేవింపుమావారికిన్.

లక్ష్మణా! పిన్నతనంబునుండియు మన మన్నదమ్ములముగ నుంట యగాక ప్రాణస్నేహితులుగ నున్నవారము. సదాకాలంబు నేమఱక నీవునన్ను సేవించు చుందువు. ఎడఁబాయని సోదరవాత్సల్యంబు నాకు నీపైనున్నది. నీయెడఁబాటు నాకు సంక్షకారణముగ నున్నది. పితృవాక్యపరి పాలనంబునకునై నే వనంబునకుఁ బోయెద. మనతండ్రి దశరథుఁడు. శతివృద్ధు పుత్రవియోగంబునఁ గుందుచున్నవాఁడు. నాతల్లి దుఃఖంబుఁ జెప్పనే వికాదు. పుత్రవ్యామోహా మా పురంధ్రీమణికి మానసమున నాటినది. నామాఱుగ నీవిచట నుండి యెడఁబాయక వారి శుశ్రూష యొనర్పుము. వారిని నూఱడింపుము. నీకు శ్రేయోభివృద్ధి గలుగును.

లక్ష్మ:—అన్నా! ఏమి పల్కితివి!

శా. అన్నా పల్కితివేమి? నేనుమనలేనన్నా నిను న్బాసి; నీ
వెన్నండేనియు నన్నుఁ బాయుదుగదా? యీనాఁడు నీవీమతిన్
జెన్నారన్ బలుపంగ నేమి కతమో? చెల్వొంద నీవెంటనే
నున్నన్ నాకదె సర్వ సౌఖ్యనిధియై యుండున్ సదాకాలమున్.

రామా! పగటిమిడిగనాడి, మానంబు విడనాడి, క్షత్రియధర్మముఁ బోనాడి, తేజమ్ముపీడి దీనోక్తులటు లాడనగునా! తండ్రియానతిని

ధిక్కరించుట తగదని యెదవేమో? తండ్రి శతవృద్ధుఁడుగ నుండినను కామాతురుఁడయి యెఱుకలేనివాను లెన్నియో యొనరించుచున్న వాఁడు. కైకకు వరమిచ్చి బొంకనేరకయున్నవాఁ డనియెదవేమో? రాజ్యంబునకుఁ బట్టంబు నీకుఁ గట్టెదనని వసిష్ఠాదిగురువరుల యెడను, హిత పురోహిత మంత్రివర్గ పౌర జానపదాదులయెదుటఁ బ్రతిజ్ఞఁ జేయఁడా? అసత్య మసత్యమా యేఁగా? బొంకుకుఁ బ్రమాణముగలదా? విష మెంత భక్షించిన నేమి? ద్రోహము ద్రోహమేను. నీవు దానినిఁ బాటింప వలదు. రాజ్యము మనతండ్రిది కావున నతఁడెవరికైన నీయఁదగు నని యెదవేమో? కాఁదు. రాజ్యము భరతునకు నియ్యనిమ్ము. నిన్నుఁ గాననమ్మునకుఁ బొమ్మనుట యెచ్చటిధర్మము? నీవేమి దేహమును విక్రయమునకు నమ్ముకొనిన దాసుఁడవా? దశరథుఁడెక్కడ; భరతుఁడెక్కడ కైక యెక్కడ; వర మెక్కడ? ఇప్పుట యెక్కడ. నే స్థిరముగనిలిచి, విల్లెక్కుడుదును. నన్నెవఁడు మార్కొనునో చూచెద. భరతుఁడే మొదలుగాఁగల వీరులనెల్లఁ దెగటార్చి పురంబు భస్మీభూతము సేసెదను. హరిహర బ్రహ్మాదులు వచ్చినను వదలను. నిన్ను సర్వభూపాలంకృతునిగ నొనరించి పట్టమునకు నభిషిక్తుఁ జేసెద. నాయట్టి పరాక్రమశాలి నీసేవకుఁడుగను సోదరుఁడుగను నుండ సామ్రాజ్యంబుఁ దృణీకరింప నీకుఁ దగదు. అడవులకుఁ బోవలయు ననెడి నుడి యుడుగుము.

కౌసల్య:—రామా! విమలతర వాక్యములాడు నీతమ్మునిమాట వినుము. శౌర్యమునమించి యార్యసమ్మతముగ నీయవనినిఁ బాలింపుము. సవతియగు కైకయొక్క మత్సరపుమాటలువిని, రాజ్యముమాని, కాననంబులు సేరుట ధర్మంబుగాదు. తనయా! ఇందు మఱియొక ధర్మసూక్ష్మం బున్నది. దాని నీవేల యాలోచింపవు? నాయింటనుండుము. నాదు శుశ్రూషఁ జేయుము. ఇంతకంటెను హెచ్చుధర్మము నీకులేదు. జనకుని యాజ్ఞశిరో

రత్నముగఁ బూనఁజాలిననీకు జనని యానతిసేల నన్నుఁ జేయ
నెన్నెదవు!

రాముఁడు:—తల్లీ! నాతమ్ముఁడు నాకుఁ బరిభవ మైనదని యెన్ని దానిని భరింపఁజాలక క్రోధావేశపరవశుఁడయి మిన్నుమన్నుఁ గానక ధర్మముమాఱ యెన్నియో సన్నమాటలాడెను? నీవును వానిమాట లూతఁగొని పల్కుట నీతి కాదు. నాజననమునకు క్షేత్రస్థానము నీవయినను నాధారము నాతండ్రి. కావుననే తండ్రియాజ్ఞను నెఱవేర్చుట తనయునకు ముఖ్యధర్మమని శ్రుతులు పలికెను. పెద్దలాచరించిరి.

సీ. తనతండ్రి పనుపునఁ దల్లినిఁ జంపెను
భృగురాముఁ డలనాఁడు భీతివదలి,
తనతండ్రి పనుపునఁ దడయక చలమునఁ
గుండీడు చంపెను గోవుఁగాదె,
తమతండ్రి పనుపునఁ ద్రవ్వరే జలధిని
సగరాత్మజులు నాఁడు సంతసముగ,
తనతండ్రి పనుపునఁ దారుణ్య మంతయుఁ
బూరుఁడునిడి జరా భారమూనె.

గీ. తండ్రి పనుపున నడవులఁ దాఱుచుంట
ధర్మలక్షణ మానిది తల్లివినవె
నీతికి విరుద్ధపథమెందు ఖ్యాతిఁగనునె
జనని నీవిది తెలియవే మనమునందు.

ధర్మసూక్ష్మము లన్నియును నీకుఁ గరతలామలకంబుగ నుండినను తెలియనిదానింబలె మాటలాడెదవు! కూరిమి దారకు నాతండ్రి వరము లొసంగెను. నాతల్లి యావరము లిమ్మని వేఁడెను. నాతండ్రి

కాననమ్ములకుఁ బోమ్మని నాకు నానతి నిడెను. ఇలనేలువాఁడు వేఱొకఁడు కాఁడు. నాతమ్ముఁడు భరతుఁడు తండ్రి పనుపునఁగైకొనిన కానన నివాసంబు కష్టంబుకాదు. ఇట్టివి దైవయత్నములు దాఁటఁగ మన తరముగాదు. కానున్నది కాకమానదు. ఊరకపొగలినఁ బ్రయోజనమ్ము లేదు. (లక్ష్మణునిఁ జూచి) లక్ష్మణా! నీవు బాలుఁడవు, ఏమియు నెఱుఁగఁజాలవు. వీరవరుల విక్రమంబుఁ జూపెదవుగాని ధీరవరుల తాలిమిఁ దాల్పవు. నీవిక్రమము, నీభుజాబలము, నీశరకౌశల్యము, నీబుద్ధియు, నీమగటిమియు, నేనెఱింగినదియేను. అనినంతకార్యము నీవు సేయనోపుదువు. అయినను నీపరాక్రమ మెవరిపైనఁ జూపనెంచితివి. నీ ముసలితండ్రిపైననా? నీయగ్రజునిపైననా? ఇంతకును భరతుఁడు మన కేమి యెగ్గొనరించెను. వాఁడు న్యాయం దెడతెగనిభక్తికలవాఁడే! ఇవి యన్నియు నాలోచించి శాంతి వహింపుము. ఆతురమిట్టికార్యమునఁ జెడుగగును.

గీ. తల్లియాచించె వరములు, తండ్రియిచ్చె
ననుఁగుఁదమ్ముఁడు రాజయి యవని నేలు
నడవినుండఁగ సమ్మతిఁ బడితి నేను
మీఁదు మిక్కిలిఁ జింతింప మీకునగునె.

లక్ష్మణుఁడు:—అన్నా! తెలిసియుఁ దెలియక నేనాడినదుర్వచనంబులు క్షమింపుము. నాకొకవరమ్ము నీనుండి కావలసియున్నది. దాని నిచ్చెదవని వేఁడికొనియెద.

రాముఁడు:—లక్ష్మణా! వరమ్మిచ్చుటచేఁ గలుగు ననర్థములు నీవిపుడెఱింగియు మరల నడిగెదవే! మంచిది. ఇచ్చెద వేఁడుము.

లక్ష్మణు:—అన్నా!

ఉ. కానన సీమలోనఁ గడుకష్టములందుచు నీవు సీతయున్
బూనిచరించుచుండ, మిముఁ బొందుచు సేవలు సేయుప్రీతి, నా
మానసమందుఁ గల్గినది ; మానక మీవెనువెంట వచ్చెదన్
మానవనాథ ; యీవరము మన్ననవియ్యుమ సమ్మదంబుగన్.

కౌసల్య:—(లక్ష్మణుని సమీపించి) నాయనా! లక్ష్మణా! మీతండ్రి ముదిమదిఁదప్పి కైకకు వరములిచ్చి పుత్రవియోగ దుఃఖమున నన్ను ముంచెను. నీవు రామునిచే వరమ్ముఁగైకొని యేమియుఁదెలియని నీతల్లి నేల దుఃఖవారాశిని ముంప నెంచెదవు?

సుమిత్ర:—తనయా! లక్ష్మణా! నీవినయవిధేయతకు నేనెదమెచ్చితి. నీవు బాణ బాణాసన పాణివై, తూణీరముధరించి దుర్గమాటవులందు నీయగ్రజుని నీవదినెను బూజించుచుండుము. వారి యాహారమునకునై కందమూలాదులఁ దెచ్చియిమ్ము. వారుంటకు వట తృణపర్ణాదులుదెచ్చి కుటీరముల నిర్మింపుము. వారి సేవయం దేమఱకుము.

రాముఁడు:—అమ్మా! నాతండ్రిని మరల సమీపించి సెలవుఁ గైకొని వచ్చెద మీరిచటనే యుండుఁడు.

కౌసల్య:—నీవెంట నేనును వచ్చెద నీవులేకుండిన యొకగడియయైనను నీముద్దుమోమును జూడక నే నిల్వఁజాలను.

సీత:—నాథా! నేనును నామామగారి యానతినంది వచ్చెద నానతి యిమ్ము.

(14 అనుబంధము)

లక్ష్మణు:—అన్నా! నేనును వచ్చెద. నాయన్నగారి యాజ్ఞఁగొనియెద.

రాముఁడు:—లక్ష్మణా! నీవచట నేమియు హెచ్చుగ మాటలాడవలదు.

లక్ష్మ:—మంచిది, అటులనే యొనర్చెద.

రాము:—అటులై నరండు.

(నిష్క్రమము.)

పఞ్చమరంగము.

మంథర - కైక—(కైకయిల్లు.)

మంథర:—(స్వగ ! నాపూనిన పనిలో నర్ధమాయెను. మిగతయర్ధము కష్టతమము. ఎటులయినను జేయవలెను. కైకకు నేను బౌరుషమునించి యొత్తిగిడిచినపు డెల్లను కోపమువచ్చును. అంత లోనే శాంతము వహించును. నాపూనిన పనికి నీ గుణము సరిపడదు. ఇత్తఱిఁ గైక మెత్తపడినచో నాకార్యము రిత్త బోవును.

(కైకప్రవేశము.)

కైక:—మంథరా! పనిపాటలువదలి యిటునిలిచి యేమో యాలోచన చేయుదానింబలె నగపడుచున్నావు. ఏవిషయమున !

మంథర:—మఱి యేవిషయమున నున్నది ? మన భరతుని విషయ మేను.

కైక:—భరతుని విషయములో నాలోచనయేమి ?

మంథర:—వాని పట్టాభిషేకమునకుఁ గానివారినుండి యంతరాయము లెన్నికలుగునో యనుభీతిచే.

౪౦. ఉదయము నుండియు నామన
మదియేమికతమ్మొ కలఁత నందితి నమ్మా
హృదయేశుఁడు వెతలంబడి
బ్రదుకుట దుర్లభమటంచు భయమగున గదే.

కైక:—మంథరా ! అదియేమి కారణమోగాని నేఁటిప్రాతఃకాలము నుండి నామనము కళవళపడుచున్నది. రాముని కాననవార్తఁ

దలఁచికొనిన నాహృదయమునఁ గేలిడి కలఁచినట్టు లగుచున్నది. ఏమిసేయుదును? ఇంతకు రాముఁడు కాననంబునకుఁ బోయెనేని నామగఁ డీయిల నిలుచునో నిలువఁడో? నిలువఁడేని నామాంగల్యంబునకే చాంచల్యంబుఁ గలుగును? అట్టిగతి నాకు నేనై తెచ్చుకొనినదాన నగుదును.

మంథర:—కైకా! దీనికి నన్నాలోచన యడిగెదవా? తెలిపెద వినుము. నీవు కౌసల్యకు దాసివయి యది మంచముపైఁ బవ్వళించియుండ దాని కాళ్లొత్తుచుండుము. దానికి నాకులు మడిచియిమ్ము. నీకొడుకగు భరతుఁడు రాముని కాళ్లముచ్చెలు తలపై నిడికొని నడుచుచుండనిమ్ము. అటుచేసినచో నీమగఁడు బ్రహ్మాయంత యాయువుకలిగి పెండ్లికొమారుఁడయి యుండును? నీమాంగల్యము చలింపక యుండును. నీవు సాపత్రికీతి ముత్తైదువుగ సదాకాల ముందువు.

కైక:—మంథరా! నాపట్టు సాధింపకున్న నాకగుగతి యంతేనా?

మంథ:—అంతకంటెను తక్కువ, ఈయవమతికిఁ దాళఁజాలక నీ సుతుఁడు నిన్నుశపించుచు విషముఁ దీసికొని చచ్చును. ఆ దుఃఖము భరింపఁజాలక నీవు చత్తువు. నీసవతులు మిన్నందు సంతసంబునఁ బొంగుచుందురు. దీనింగని నాకడుపులో నెంత మంటపడునో? నేనేమిగతి యగుదునో ఏడ్చును.

కైక:—మంథరా! ఏడ్చెదవేల? మొదటినుండి యింతదూరము పట్టిడ్చి మగనితోఁ గన్నకూఁతలు కూయించుకొని రచ్చకెక్కియిపు డాపట్టువదలుటకు నేనేమి పిచ్చిదాననా? కపిముష్టిన్యాయముగఁ బట్టినకార్యమును దుదిముట్టింతు. అయినది కానిమ్ము.

క. వదలను పట్టిన పట్టును
కదలను కార్యార్థిఫలముఁ గానకయున్నన్
బెదరను హృదినింతేనియు
బదిలంబిది మంథరా! శుభంబగు మనకున్.

మంథర:—అదికదా బుద్ధికుశలినిమాట! కైకా; ధైర్యము వదలకు. దూరమున నెవరివో పాదధ్వను లగుచున్నవి. మనమిచట నేల యుండవలెను? పోవుదము రమ్ము.

(నిష్క్రమణము.)

## షష్ఠరంగము.

దశరథుఁడు. రామలక్ష్మణులు. సుమంత్రుఁడు. కౌసల్య. సుమిత్ర. కైక. మంథర. వసిష్ఠులు.

రాముఁడు. క. జనకా! నీపదములఁబడి
తనయుఁడు నతులిడగవచ్చెఁ దద్దయుబ్రీతిన్
గని? సెలవిమ్మా పోయెద
వనమునఁ బదునాలుగేండ్లు వాసముసేయన్.

(అనుచు నమస్కరించును.)

దశరథు:—(నిట్టూర్పులుసారించుచు) కైకా! కైకా! (యనియఱచును.)

కైక ప్రవేశము.

రాముఁడు కైకకు నతులిడును.

దశరథుఁడు:—రాముఁడు వనవాసంబునకుఁ బోవ సిద్ధుఁడయి వందనంబు లర్పించుచున్నవాఁడు. ఇపుడైనను వానిపై దయఁ బూనుము.

(1వ అనుబంధము.)

కైక:—నాథా! ఇందుకేనా నన్నుఁ బిలిచినది!

దశర:—ఛీ! చాండాలీ! బాలఘాతుకీ?

కౌసల్య:—కైకా! ఇది నీకు నీతిగాదు.

మ. జగదంతా! యిది యెంత ఘాతకమవే సర్వంసహం భూత్వై
మగనిన్స్వాంతలపాలు సేయఁదగునే? మాన్యంబె పుణ్యంబె?

కైక:—ఔరా! మగువా! మాటలకుండి యేమిటని? యీమర్యాద మార్గంబులుగా! దగునంచుగా నినుఁదెల్ప వేఁడితిని? నిందా వాదముల్చాలునే.

కౌసల్య:—కాంతా! భూకాంతుని స్వాంతము వంతలఁ గుందునటులఁ జేసి ముద్దులసుతుని సుఖహంతవు కానగునా? ఇంతటి కటిక గుండియవయి, కసుకందని పసిబాలునిఁ గాననవాసంబునకుఁ బంపనగునా? నిష్కళంకమూర్తియగు భూవిభుని మన్నన కల దని వినయ సంపన్నునిఁ దనయుని, రాముని సుగుణాభి రాముని వనభూములకు నెట్టుమని వేఁడనగునే? చెలుకు తియ్యన యని త్రెళ్లతో నమలనగునే?

కైక:—జగరాగా! తలపోగురా! మంచిమాటలాడి రంతులొనర్చెదవు.

కౌసల్య—అమ్మా! కైకా! నీతో వాదులాడ నేనిచటికిరాను. పతి యెడల సతి యనుసరింపఁదగిన ధర్మములివియని తెల్పవచ్చితిని. అది నీవు విన్నను వినకయున్నను, పెద్దదానినగు నేను నీకా ధర్మంబులు సూక్ష్మంబుగ నైనను దెలుపవలసినవిధి కావున వానిఁ దెలిపెదను.

సీ. కరతలామలకంబు, గాదటే చెల్లెలా
    యిభయానకును ముక్తి విభునిభక్తి
కొంగుబంగారమ్ము కోమలీ; కాఁదచే
    వనజాయతాక్షికి వరునిభక్తి
ప్రాంగణస్థాపిత పారిజాతముగాదె
    తరళాయతాక్షికి ధవునిభక్తి
తలయంపి మేరువై వెలయదే చెల్లెలా
    నలినాననకుఁ బ్రాణనాథభక్తి
గీ. పతికిఁ బరదైవ మాధరఁ బతియెగాదె?
వనితకీయిల వ్రతనిష్ఠ వరుఁడుఁగాదె?
పడఁతి కీభువిఁ బరగతి పతియుఁగాదె?
చాన! పతిభక్తి సతికిని శక్తిగాదె?

కైక:—ఔను! సవతీ! నీకంటెను హెచ్చుగఁ బతిభక్తి వినయము నాకుఁ దెలియును. ఆహా! మించిమాటలాడకు. నానాథుఁడు పిలిచెనని నేనిచటికి వచ్చితినిఁగాని, నీకుగాను నేనురాను నీ మోమైన నేను జూడనోపను. (దశరథుఁ జూచి) నాథా! నాసవతిచే నాకు చీవాట్లు పెట్టించుటకేనా నన్నుఁ బిలిపించినది. ఈయేడ్పుగోళ్లవరములు నీవిచ్చిన నేమిఫలము. అట్టివరములు నాకువలదు. ఇప్పుడైనను పలుకుము. రాముని వనవాసమునకుఁ బంపెదవా? పంపవా? ఎట్లయినను నాకు సంతోషమేను. పంపిన నాపట్టుదల గెలుచును. పంపకున్న నీవసత్యవాది వగుదువు.

(దశరథుఁడు చింతించుచుఁ గూర్చుండును.)

కౌసల్య:—చెల్లెలా! రాముఁడు సకల సద్గుణాభిరాముఁడే. వానివిషయమున నీకేల యింతటి కాఠిన్యము. నాతనయుఁడు నీతనయుఁ

దుకాఁడా! వానికి నాకంటెను నీపయి హెచ్చుభక్తియె అనుచు
బాలుని నేల వనవాస క్లేశంబులఁ దపింపఁ జేయుదువు?

సీ. దాసినై నీసేవఁ జేసి నే మనియెద
పుత్రభిక్ష మొసంగి ప్రోవుమమ్మ
కరములు మోడ్చెదఁ గన లేఁ బ్రాతాక్షిరో
పుత్రభిక్ష మొసంగి ప్రోవుమమ్మ
ఒడియొడ్డి కడుభక్తి జడజాక్షి వేఁడెద
పుత్రభిక్ష మొసంగి ప్రోవుమమ్మ
అడుగులఁబడియెద నతివరో దయఁ బూని
పుత్రభిక్ష మొసంగి ప్రోవుమమ్మ.

గీ. ముదిత నీకిదె చాఁగిలి మ్రొక్కెదను
పుత్రభిక్ష మొసంగుచుఁ బ్రోవుమమ్మ
దిక్కులేదిఁక నినుఁదప్ప దీనురాలఁ
బుత్రభిక్ష మొసంగుచుఁ బ్రోవుమమ్మ

తల్లీ! కైకా! చిన్ననాఁటనుండియు నను జింతలేదు. నీపదముల పైఁ బడి వేఁడికొనియెద. నాతనయునిపైఁ గృపఁబూని నన్నరసి యేలుమమ్ము. నీతనయునకుఁ బట్టము గట్టికొనుము. నేఁ లక్షణను. నేనును నాసుతుఁడును నీదాస్యమున నుందుము. ఇంతమాత్రము నను గ్రహింపుము.

సుమిత్ర:—కైకా! ఇది యోగ్యమగు సమ్మతమై యున్నది. దీనికి నీవును సమ్మతింపవలెను. ఇం దేదోషము నులేదు. నీయిష్టార్థంబు కొనసాగును.

మ. తగునే చెల్లెల? యంశమాత్రమగునే సద్వంశసంజాతకున్
మగువా! నాసుతుఁ డీ ధరాధిపత్యమై మాన్యుండునై యేలెడున్

జగతిన్ గాదె? మరేమికావలయు! దైవంబేల? యీపుత్రుఁడే
పగదిన్ నీకెపుడేని నెగ్గులొనరింపన్ జూచెఁడా యెన్నఁడా?

(16 అనుబంధము)

కైక:—నాథా! రచ్చకెక్క దుర్వాదము నొనరించు నావశ్యకత నాకెద్దియును లేదు. నేనిచట నిలువఁజాలను. పోయివచ్చెద.

రాముఁడు:—(అడ్డముగఁ బోయి.)

కం. జననీ; కినియుఁగనేలా?
తనయుఁడు తనతండ్రియాజ్ఞ తడయక చేయన్
చనిఁ బూని వచ్చి నిలిచెను
ఘనమగు దీవెనలనిచ్చి కనుపుమ కరుణన్.

తల్లీ; నీతనయుఁడు, తనతండ్రి సత్యంబీధరను స్థాపింప వనవాసంబు సలుప నిశ్చయించి నీచే దీవెన లందవచ్చినాఁడు. వందనంబు లర్పించెద. దీవెన లిమ్ము.

కైక:—(పెడమొగ మిడుకొని) రామా! నిన్నుఁ గరుణించి దీవెనలిచ్చి సెలవిచ్చువాఁడు నీతండ్రిగాని నేనుగాదు. (వెళ్లి దూరమున నిలుచును.)

రాముఁడు:—(తండ్రిని చేరి) నాయనా.

చం. తడయక నీవు నాసవతితల్లికి నిచ్చినమాట రీతిగా
నడవులనుండి నీశపథమారయఁ జేయఁగఁ బోయివత్తు
నీయడుగుల వ్రాలి వేఁడెఁ గృపాయుతచిత్తముతోడ దీవెనన్
గడుముదమందనాకిడుము? కాంచుము భూరియశమ్ము ధాత్రిలోన్.

నాయనా; నీవు నాసవతితల్లికి నిడినవరమ్ములు వమ్ముసేయనట్లు నేవనవాసమ్ముఁ జేయఁ బోయెద. సెలవిమ్ము; వందనమ్ములాచరిం

చెద. ఆర్యుఁడయి యర్యమకులంబున జనించి, చక్రవర్తివై సర్వదిశలునేలి, శతక్రతువు లొనరించిన పుణ్యమూర్తివయి పునీతజిహ్వగలిగిన నీవు నీకూరిమిరాణికి నిచ్చినమాట తప్పితివేని సూర్యకులంబునకే కళంకము గలుగును. కావున మానవుఁడెన్ని కష్టములకైనను నోర్చి సత్యము ధరను స్థాపింప యత్నింపవలెనని శ్రుతిస్మృతులు ఘోషించుచున్నవి. ఇట్టికాలంబునఁ బుత్రవ్యామోహమున నడలుట ధర్మవిరుద్ధము. నాయనా; నావియోగంబు మానసంబున నంట నీయకుము. వందనంబు లర్పించెద. దీవెనలిచ్చి సెలవిమ్ము.

దశరథుఁడు:—రామా! రామభద్రా, రామచంద్రా, నాయనా.

సీ. దృష్టితాఁకునటంచు దిగులంది, చక్కని
మోము చూడఁగనైతి, ముద్దుతనయ
రావయ్య యిటురమ్ము రామాయనుచు నిన్నుఁ
బిలిచి ముద్దిడనైతిఁ బ్రీతితోడ
కొడుక, యీభూషలు దొడఁగుమా యనుచును
నొడువనైతిని పాపినోట నెపుడు
వెలగలవలువలు చెలువొప్పఁదగునని
యీపాదుకరముల నిడఁగనైతి.

గీ. అన్న, రావన్న ముద్దునాయన్న, యెన్ని
వన్నములు గల్గె నాకన్న చిన్నితనయ
నిన్ను నిడుముల పాల్జేసి నిలిచియున్న
నన్నుఁ గినియుచు శపియింపుమన్న తండ్రి.

రామా! నిన్నుఁ గాననంబులకుఁ బోయి కష్టంబులందు మని యీపాపినోట నేఁ బలుకఁజాలను. నిన్ను వదలి యొకగడియ నైనను నే నిట నిల్వఁజాలను (కైకాయని యరచి) జగజంతా; హాంతకారీ;

మహామారీ; కాళరాత్రీ; నా రాముని వెంట నేనును నాజనులతోఁ నరణ్యంబుఁ జేరెదను. పాడుపడిన పట్టణంబునకు భరతునకుఁ బట్టము గట్టుము.

కైక:—నాథా! ఈయూఱటపుఁ బలుకుల నన్నేల నాఱడిపెట్టెదవు. పాడుపట్టణమునకు భరతుని రాజుగఁ జేయుటకంటెను నీకు వరములియ్యనని మృషలుపలికి యిలాపోరాటమును దప్పించుకొన రాదా! ఏల యీజంజాటము.

రాముఁడు:—తల్లీ! తపనునివంశజుఁ డగు నృపతి కపటము లాడ నేర్చునె? ఈవిపరీతభాషలు వలదు నాజనకుని యానతినిఁ బూని యొకవనవాసం బననేల? విష మయినను మ్రింగుదును. వనధినైన మునుఁగుదును. విపులాగ్నినైనఁ జొత్తును.

కం. తపనుని కులమణి యగునీ
నృపవరుఁ డనృతంబు లాడ నేర్చున తల్లీ
విపరీతభావ లుడుగుమ
కృప దీవెనలిమ్ము నాకుఁ గీర్తినిఁగనుమా!

నాయనా! నేనిచటనుండునంతవఱకుఁ బుత్రవియోగ దుఃఖంబు మీాయం దభివృద్ధిఁ జెందుచుండును. కావున నాకు సెలవిమ్ము.

(వందన మర్పించును.)

దశరథుఁడు:—(లేవనెత్తి.)

ఉ. బూడిదకప్పు నిప్పు, పెనుభూతము, కైక, యసూయ చిత్తయై
పోడిమివీడి నిన్ను వనభూములనుండఁగఁ బంచె, నక్కటా
యాడఁగనేమి? దైవకృపవంబుచుఁ గానసమందునీకు, జా
గూడునె గాన మంగళ మఖండిత సౌఖ్యచిరాయు రున్నతుల్,

నాయనా; నీకాయరణ్యమే శరణ్యమై చెలువొందుఁగాత. క్రుక్కిడి మృగములు నీపరమమిత్రములై యుండునుగాత. అర్యమకుల వ్రతనిష్ఠలు వదలకు. దేవబ్రాహ్మణ ప్రీత్యర్థము సమస్తకర్మంబు లొనరింపుము. చిన్నతనమునందే నీకు నిన్నియిడుముల నిడిన నేను పెక్కుదినములు మననోపను నాయనా.

(చింతించుచుఁ గూర్చుండును)

సీత:— (దశరథునకు వందనంబు లిడుచు.)

కం. మామావందనమిడెదను, రాముని వెంబడిని నే నరణ్యంబుల కే
గా మించి పోవ నెంచితి, నామనవిని చిత్తగించి నన్నంపుదయన్.

దశరథుఁడు:—(తలవంచికొని) సీతా! నీవు దేవాంశసంభూతవు. పునీతవు. లోకమాతవు. ఎన్నఁడు నేలాటికష్టంబులకును కన్నీరుం గాంచని చిన్నదానవు. ఇంట సుఖమున నుండు నీవు, కంటకాన్వితమగు కాననంబుల నెటునిలువఁగలవు?

సీ. బృందారకారామ మందార తరుబృంద
గంధాధికత యందుఁ గలదె తనయ?
మలయజ పరిమళ మిళితమై, మై వ్రాలు
మలయానిలం, బందుఁగలదె, సీత
చెలువుల మైతావికలరి కలియవచ్చు
నళికులరవ మందుఁగలదె తనయ
సురుచిర తరుచారుతర తీరరంజిత
కాసార వరమందుఁగలదె, సీత.

గీ. చటుల మృగయూథపటహా మూయటవి చాల
సహజభీషణమైనది గహన మకట

చెన్నమీఱెడు వన్నెల చిన్నిచాల
యిన్ని యిడుములు నీకేల కన్నతల్లి.

తనయా! వినయసమేతవు. సతీశిరోమణివి. రెండవసిరిగ నీవు నీపతి ననుసరించియుండుము. నీవు శిరీష కుసుమకోమలాంగివి, కంటక సమేత విషమోపస్థలంబులు ద్రొక్కఁజాల వనినేఁ జింతించెద.

**సీత:**—మామా! ఆ చింత నీకువలదు.

కం. నాపాలివిభుఁడు, దైవము
నాపుణ్యంబులకుఁ బ్రోవు, నాప్రాణవిభుం
డేవున సన్నిధి నుండఁగ
నాపద భయ మేలనాకు; ననఘా వినుమా.

(అనుచు నమస్కరించును.)

**లక్ష్మణుఁడు:**—నాయనా, వందనంబు లర్పించెద.

ఉ. రామునివీడి, నేనిచట గంజిరనుండఁగలేను, నాయనా,
సేమమునంద నగ్రజుని సేవయొనర్చుచు సీతమాతనుఁ
గాముల బాధలేనటులు గాచెద రేలుఁబవళ్లు కానలో,
నీమతి నాకుఁ బుట్టె సెలవిమ్మ దయానిధి నీకు మ్రొక్కెదన్.

నాయనా, మెప్పనోప; రామునింబాసి యుండనోప; రాముని వియోగంబు సైఁపనోప; నాకు సెలవిమ్ము. నారాముని వెంబడి నేనును గాననంబులకుఁ బోయెద.

**దశరథుఁడు:**—(నిట్టూర్పు పారించుచు.)

సీ. శాకినీదానవి - కైకనాదారయై
చిచ్చుగా నాయిల్లు జొచ్చెనమ్మ

ఆపదలనుబాపి - కాపాడె నన్నని
యడిగిన వరములు నిడిలినమ్మ
దుర్మతియిది యను - మర్మమెరుంగక
ధర్మదగ్ధుఁడనై తి తథ్యమమ్మ
కానకకన్నట్టి కన్న నాకొమరుని
గానల పాల్జేసి కలఁచెనమ్మ

గీ. పుట్టు శ్రీమంతురాలవు పుణ్యవతివి
కుసుమకోమలగాత్రివి. ఘోరవిపిన
తలము లెటుసంచరింతువో తల్లినీవు
మైదవతనంబునను నుండ - వమ్మ సీత.

నాయనా లక్ష్మణా! భ్రాతృవాత్సల్యం బింతకంటె హెచ్చుం డునా? నీవు మీయన్నకు శుశ్రూష యొనర్పఁబోవ సమకట్టినది యతి శ్లాఘ్యంబు. నీకు దైవంబు శుభంబు లిచ్చుఁగాత.

రాముఁడు:— కౌసల్యను జేరి) తల్లీ నందనంబు లొనర్చెద, దీవెనలిచ్చి నాకు సెలవిమ్ము.

సీ. కామించి కైకకుఁ గరినవరమ్ముల
నొసఁగెఁ దండ్రియటంచుఁ గసరకమ్మ
వార్ధక్యమునఁ గుంది వనటఁ జెందినతండ్రి
నింపారఁగా నూఱడింపుమమ్మ
కాని కార్యములిన్ని కైక చేసెనటంచు
దూషించి యామెను దూరకమ్మ
తనయు వియోగంబు మనమునఁ దలఁచుచు
నమ్మ శోకముఁ బూనియుండకమ్మ.

గీ. విధివిధానము తప్పునే వెరవకమ్మ
దైవకృపనంది తనయుఁడు తిరుగునమ్మ
అధిక కష్టంబులని నా నను లందవమ్మ
సంపదలు హెచ్చు దీపించి పంపవమ్మ.

(అని మని నమస్కరించును.)

కౌసల్య:—(కన్నీరుగార్చుచు రాముని లేవనెత్తి శిరము మూర్కొని.)

సీ. గ్రహరాసు లన్నియు గిహానములను నీకు
సేమ మొసంగి రక్షించుచున్న
సురవార వానరవర కిన్నరాదులు
నిరతము నన్ను మన్నింతురన్న
అతినియతని బూను యతులు ఋక్పతులెల్లఁ
ప్రేమని నిత్యసదా బ్రోతురన్న
సిద్ధులును నోముఘను సిద్ధఘుల్ నిరతము
నిను నిరామయునిఁగ మనుతురన్న.

గీ. గిరులు ఝరులును దయలును దరువులెల్ల
సిలువ నీడల నిచ్చుచుఁ జెలఁగునన్న
సింహమనమున నీకడు నీదువాంతి
దీవనలనంది మనుమన్న ధీరుఁడగుచు
పోయి రావన్న రామ పెంపొందుమన్న.

రామా! నాయనా! నాముద్దులతనయా! నాగారాముబిడ్డా! నాయంతటి పాపాత్మురాలు నీకు నిడిచిన దీవెనలు ఫలకారియగునా? ఘోరాటవుల యందు సూర్యచంద్రాది గ్రహరాసులు సుర ఖేచర కిన్నర కింపురుష యక్షాదులు, నదులు గిరులు పాదపములును అనాదినుండు ఋషులు, నతనియతు లగుయతులు బృహస్పత్యాది మహామతులు,

దాంతిశాంత్యాది దేవతలు, నదీనదములు, నిధులు, వనధులు, నోషధులు, దశదిశలు, నింద్రాగ్ని వరుణాది దిక్పాలకులు, నీకు స్వస్తి నొసంగుదురు గాత; నాయనా! పుష్యనక్షత్రయోగంబగు నేఁడు నయోధ్యారాజ్యంబు నకుఁ బట్టంబుగట్టెదనని పల్కిన యదే నక్షత్రయోగంబున నీకు నరణ్య రాజ్యమునకుఁ బట్టముగట్టెనా నీతండ్రి! నాయనా! శీతభానునిఁ బోలు నీమోము చంద్రభానుని కిరణంబులు సోఁకివాడునట్టుల నరణ్య శాఖలు గిరిగుహలు నీకు శ్వేతాతపత్రంబులయి రక్షించునుగాత! రామా! భూమిసుర రామాయణులు నేమంబున నీమంగళంబును గోరుచు, నీయుత్తమాంగమున సేసలుజల్లుకీతిని, కాంతార సీమయం దొప్పారు కొమ్మలు నీపయిం బూలసేసలు జల్లుదురు గాత, తండ్రీ; దుందుభి పటహాది తూర్యఘోషములు, వందిమాగధుల కైవారము లౌ కాంతారనివాస మృగవార భయంకర రావములయ్యెను గదా? నిన్న పుడు బలిసివచ్చు పౌరులకు మారుగ వనచరాదులు సేనావార మయ్యెను గదా; విధివ్రాఁతఁ దుడువ నెవరివశము?

(అనుచు గన్నీరుఁగార్చును.)

సీత:—అత్తా! వందనంబు లాచరించెద. నీసుతుని వెంటఁబోవ నాకు సెలవిమ్ము.

కౌసల్య:—తల్లీ! జానకీ, నీ వాఁడస్త్రీమంతురాలవు. కుసుమకోమల గాత్రవు. ఎండకన్నెఱుఁగని దానవు ఈ నాసుతుడు రాముఁడు సుగుణాభిరాముఁడు, చక్రవర్తి కొమారుఁడు, సర్వవిభవముల

నొప్పారువాఁడు, వానింగూడి నీవత్యంతము సుఖపడుదు వని తలంచి నీతండ్రి నిన్నిచ్చెనుగాని, కాననంబుల నీవు కష్టపడుదు వని నిన్నొసంగఁడయ్యెను. దైవయోగంబున నిట్టిదుర్గతి ప్రాప్తిల్లెను. ఏమి సేయనగును తల్లీ సీతా!

సీ. చేయిడఁ జాలెడు చెలువ నీనునుమేను
కఠినోపలంబులఁ గందునమ్మ
పంకజంబులఁబోలు, పడఁతి నీపదములు
కంటకంబులఁ ద్రొక్కఁగలవె సీత
పటు నీలిమచ్ఛాయఁ బరఁగు నీకేశముల్
జడగట్టి చెడునమ్మ చంద్రవదన
చెలువారు నీమేని శృంగారమంతయు
నడవులగాసిలి చెడుగదమ్మ.

గీ. చీని చీనాంబరంబులఁ జెలువుమీఱు
చెలువ ; ధరియింతు వెటు నార చీరలమ్మ
కందమూలాదు లెటులు నింపొందునమ్మ
దైవయోగంబుఁ దప్పింపఁదగునటమ్మ.

తల్లీ సీతా ! నీకు క్షేమ మగుఁగాత. అడవులలో నలయక, పతి నెడఁబాయక, పతివ్రతాశిరోమణివయి బ్రదుకుము.

(సీత సుమిత్రకు వందనంబు లిడును. సుమిత్ర దీవించును.)

(లక్ష్మణుఁడు కౌసల్యా సుమిత్రులకు వందనంబిడును. వారుదీవింతురు.)

రాముఁడు:—(కైకను జూచి.)

సీ. మానసానందముల్ మాతనీకోర్కెలు
స్థిరతర భక్తినిఁ దీర్తునమ్మ
జనకుని వచనముఁ దనరఁగ బాలింపఁ
దనయునకును భూరిధర్మమమ్మ
ప్రాణసమానుఁడు భరతుఁడు రాజౌట
కన్న వేలు ప్రియమ్ము కలుగదమ్మ
మునిసేవ లభియింప వనవాసమునకునన్
బంపుట యిది నాదుభాగ్యమమ్మ.

గీ. నీ మభీష్టమ్ము దీర్చెద నిక్కమమ్మ
కవికరమ్మునఁ దనయునిఁ గాచుమమ్మ
సంతసముమీఱ వని నివసి తాపసమ్ము
ప్రాపతిశయింప నన్ను దీవింపుమమ్మ.

తల్లీ! కైకా! మందిరంబు లొప్పగించెద దీనినిమ్ము అడవులకుఁ బోవువారికి నీవలువ లేల? నారచీర లొప్పగింపుము.

కైక:—(సిద్ధము మంథర చేతిలో నిడికొని యున్న నారచీరలు దీసికొనివచ్చి యిచ్చును.)

వసిష్ఠులు:— కోపమున లేచి కైకా! వివేకశాలినిగు కేకయ రాజపుత్రికవయ్యును నీ మతివేగమును వెలిఁబుచ్చితివి. ఈ వసుధీశుని మోసపుచ్చి కులనాశకారిణి వైతివి. నీయట్టి పాపిమోముఁ జూచినఁ బాపం బొందఁగూడును. కావున నీపురివారిం గూడి మేమెల్లరము రామునివెంటఁ బోయెదము. ఈ పాడుపడిన పట్టణమును భరతుఁ డేలనిమ్ము. నీకొడుకు భరతుఁడు పట్టంబుఁ గట్టుకొని రాజ్య సౌభాగ్యంబనుభవించెదను నని నీవు సంభ్రమించుచున్నావు. నీపుత్రుని నాగ్ని నీవు తెలియకయున్నావు. నీ సుతుఁడు రాముని భృత్యుఁడనని త్రికరణశుద్ధిగ నమ్మినవాఁడు. వాఁడు రామునిఁ దనతండ్రిమహారాజుగాఁ జూచును. ఇట్టివార్త భరతుఁడు వినెనేని నీపై మండిపడి నిన్నుఁ దూఱి, యరణ్యంబుఁ జేరి, యారాముని చరణంబులు శరణములనినమ్మి, వానిపాదుకలు శిరమున ధరించుకొని తిరుగుచుండును గాని, నీమాటలు వినునా? పిదప పాడుపడిన వీడులను వ్యాఘ్రాది జంతువులను జూచుచు, క్రుసుకుచు, విలపించుచు, పిచ్చిదానివలెఁ బలవరించుచు నుండి, దేహంబుఁ జాలించి, నరకంబునఁబడి పొరలెదవు.

దశరథుఁడు:—కం. ఛీ! చండాలీ! పలునా
వేచనుమా యిచటనుండి వెడలు వెడలు నం
కోచింపక, యిటుపలుకకు
నీచపు భాషణము చాలు నిలువకు మిచటన్.

చండాలీ! దుష్టచారిణీ! రాముని వనవాసంబు నీవుగోరితివిగాని నారచీరలుగట్టునటులని కోరితివా? కటికదానింబోలె నా కట్టి కసు మూని యాకుటిలాలకను సీతను అడవికిం బోవ సమ్మతించుటయు గాక నారచీరలుగట్ట నిచ్చితివి గదా? నీవెంతటి కఠినచిత్తవు. నీవు నివసింప యమధర్మరాజునకు నిపుడుండు నరకము చాలదు మఱియొక నూతన విషయంబు నీకొఱకు నిర్మింపఁబడవలెను ఛీ పాతకీ! వెడలిపొమ్ము. నీముఖదర్శనంబు పాపమూలంబు, నీసల్లాపంబు నిరయాభీలంబు, నీసామీప్యంబు నరకాలవాలంబు, నీమోము మాంగల్యసూచనంబు, కావున నేఁ బోయెదనోప.

(అనుచు ముసుఁగిడుకొని పడును.)

రాముఁడు:—తల్లీ! మన మిచటనున్న నాతండ్రిదుఃఖంబు హెచ్చుచుండును, పోవుదము రమ్ము.

(17 అనుబంధము)

కౌసల్య:—కం. కని నిను గొడ్రాలయితిని
ఘనముగ నీశోకభరము కాల్చును నన్నున్
జనుమా దేహము వదలుచుఁ
జనునే యిటులుండ మానసమ్మా నీకున్.

(నిష్క్రమము.)

# పాదుకాపట్టాభిషేకము.

## ద్వితీయాఙ్కము, ప్రథమరంగము.

కైక - మంథర.

కైక:— నిట్టూర్పులు సారించుచుఁ గూర్చుండి సంకటపడుచు.)

(18 అనుబంధము.)

కం. ధవునకు దూరంబైతిని.
సవతులలో దూఱువడితి, సరిపొలఁతులలో
నవమాన మందితిని, నిఁక
భవితవ్య మెఱుంగలేను బ్రదుకుదు నెటులన్.

(తలవంచుకొని కన్నీరుఁ గార్చుచు నాలోచన జేయుచుఁ గూర్చుండి యుండును.)

ప్రవేశము—మంథర.

సీ. కైక, కారణమేమె వ్యాకుల చిత్తవై
నేలఁ గూలితివేల సోలి సొలసి
సంతసమందెడు సమయంబు నందున
వంతలఁ గుందుట వాసియగునె ?
నినువెక్కిరించెడి నీసవతులు దుఃఖ
వారిధిలో మున్గి నారుగాదె ?
వనవాసకష్టంబు లనుభవింపను రాముఁ
డడవికిఁ బోయెను బడలియుడలి.

గీ. పట్టభద్రుండు భరతుండు పట్టణంబు
జేరు, రాజ్యాభిషిక్తుండై, సేమమంది
నిన్ను మిన్నందఁ జేయును నిజముగాను
కతంత లేలనె యిటు శుభకాలమునను.

మంథర:—కైకనుజూచి తలయూఁచుచు ఏమి కైకా! సంతోష సమయమున నెవరినోపు గొట్టుకొనిన దాని బలెఁ గన్నీరుఁ గార్చుచు నిండినయింటిలో నసిష్ట దేవతగఁ గూర్చున్నావు. ఏమి కారణము?

కైక:—అమ్మా మంథరా! నీపలుకులువిని, నాథుని మనమునొప్పించి సవతులను వ్యాకులాంబుధిలోముంచి, పౌరజనుల హృదయములెల్లఁ గలఁచి, రాముని వంచించి, వనవాసంబుననుండ నియమించితి. నాఁటినుండియు, నాప్రాణనాథుఁ డపుడపుడు స్మృతిఁ దప్పి పడుచున్నాఁడు. స్మృతి కలిగినపుడు రామా రామా యని పలవరించుచున్నవాఁడు.

మంథర:—ఇదియేమి స్వాభావికి విరుద్ధము కాదుగదా! కన్నకొడుకును బోఁగొట్టుకొనినవారు సంతోషముగ నుండఁగలరా! అందున సుగుణరాశియగు సుతునిఁ గోల్పోయి నీనాథుఁడు స్మృతిఁదప్పిపడుట యేమియాశ్చర్యము! దీనికి నీవేలఁ జింతించెదవు?

కైక:—మంథరా! నానాథునకు నిన్నఁటినుండియు దేహముపై స్మారకమే లేదు.

మంథర:—చింతాభరంబున స్వాంతము చెదరినది కాఁబోలు.

కైక:—మంథరా! నిన్నఁటినుండియు నాకంటికి నిదుర రాకయున్నది. ఇంచుక కూరుకుపట్టినతోడనె చెప్పనలవికాని చెడ్డకలలు కలుగుచున్నవి.

మంథర:—కైకా! అవి యేమికలలు?

కైక:—అమ్మా! ఏమని తెలుపుదును? కలలో జ్యేష్ఠాదేవి, భయంకరముగ నాయెదుటనిలిచి, బలవంతముగ నామాంగల్యమునుబట్టి తెంచుచున్నది.

మంథర:—కైకా! నే నొకమాట యడిగెదను కోపము వలదు. ఎన్నదినంబు లీమాంగల్యంబు నీకు స్థిరముగ నిలుచును? నీవు మిక్కిలి యదృష్టవంతురాలవు, కావున నే వృద్ధునిఁ బతిగఁ గైకొనినను నిన్నిదినంబులు మాంగల్యంబు స్థిరముగ నిలిపికొంటివి. దశరథునకు నిన్నిచ్చునపుడే మీతల్లి కొట్టికొనెను. నేను మొత్తుకొంటిని. పిచ్చివాఁడై నీతండ్రి యతని యొద్ద ప్రౌఢవును, పేరు ప్రఖ్యాతిని, సౌభాగ్య భాగ్యములను సామ్రాజ్య రాజ్యమును జూచి తనకేమో యితఁడు రక్షణము చేయునని యుప్పొంగి పెండ్లి చేసి యిచ్చెను. ఉన్నతసమునచే నీకు వైధవ్యము ప్రాప్తిలునని నేను నిర్ధరించుకొని యుంటిని. కనను నీవదృష్టవంతురాలవు. కావున నీవు ముత్తైదువుగ నిన్నిదినంబులు నిలిచితివి. నీవు వ్రతఫలంబుననో, యజ్ఞఫలంబుననో బంగారమువంటి పుత్రునిఁగంటివి వానిఁజూచి సంతోషపడుటకే యీవృద్ధు పతిపోవునేయని చింతించుచున్నావే? ఎంతటి యవివేకము! నీవు ఉంచుకొనిన నీమగనికి వయసు వచ్చునా? ఇప్పుడు బ్రతికి యన్నిదినములు మరల బ్రతుకునా! పుట్టినవాఁడు గిట్టుట సహజముగదా! తప్పింపుమనఁ దరమా! నిముగఁ జేము యీశ్వరునిగుఱించి తపంబొనర్చ మార్కండేయునంబటె స్థిరాయువు పడయుగఁ గోసనాఁహా! వలదీచింత. ధైర్యమును వహింపుము. కానున్నది కాకమానదు. రానున్నది రాకమానదు. ఎప్పటికేది రావలయునో యదివచ్చితీరును. చింతించినఁ బ్రయోజనంబేమి!

కైక:—మంథరా! ఈ వైరాగ్యవచనంబులు నామానసమునకు నూఱట గలిగింపవు. నావలన నామగనికి నింతటి దుఃస్థితి వచ్చెనేయని చింతించుచున్నాను. అనాథ యగుదునేయని వగచుచున్నాను.

మంథర:—ముందెప్పుడో కలుగు వైధవ్యమునకు నిప్పటినుండియు వ్యసనపడి యేడవేల? నీమగని దుఃస్థితికి నీవే కారణంబని నీకుఁ దోఁచినచో వనవాసంబునకుఁ బోయిన రామునిఁ బురికి రప్పింపుము. మనభరతుని వనవాసంబునకుఁ బంపుము. అటులయిన నీమగఁడు శాశ్వతాయువుగలిగి బ్రదికియుండును. నీమాంగల్యంబు స్థిరముగ నిలుచును. అప్పుడు నీమగని ముద్దుమోముఁ జూచుచు నీవు సంతోషమున నుండనగును.

కైక:—మంథరా! నే నీరీతి వ్యసనాంబుధిలో మునిఁగియుండ నీవీయెకసక్కెపు మాటలాడ నగునా? నీమాటలువిని గదా నేను నాథునిఁ బీడించి, వరములంది, రాముని వనవాసంబునకుం బంపితి? నామగనికి వ్యసనంబుఁ గల్పించితి.

మంథర:—అవునమ్మా! నామాట వినినందునఁగదా నీముద్దుకుమారునకు రాజ్యప్రాప్తి గలుగును; నీవు సకలసామ్రాజ్య మనుభవింతువు నీసవతులను నేలకు వదుగంటఁ జేసితివి. ఇవి యన్నియును నావలనఁ గలిగిన చెఱుగులేనా, అవునమ్మా, మంచికిఁ గాలము కాదది. ఉపకార మొనర్చినవారికి వెంటనే యపకారము జుట్టికొని వచ్చును. నే నొనర్చిన పనికి నెంతయో బహుమానములు వచ్చునని తలంచి కొండంత యాశపెట్టికొని యుంటిని. ఇంతటి యవమతి నాకగునని కలనైనఁ దలంపనైతిని, ఏమిసేయవలెను, నేనిచట నిలువఁజాలను! నాకు సెలవిమ్ము. పోయివచ్చెద. (పోవుచుండును.)

కైక:—(మంథరను నిలిపి) మంథరా! నీవిటులఁ గోపగించిన నాగతి యేమి, చేసికొనిన మగఁడు చేరకయున్నవాఁడు. సమీపమునకు రానియ్యఁడు. సవతులు నన్నుఁ గసరిన వంటలు గ్రక్కుచున్నారు. వసిష్ఠ సుమంత్రాదు లెల్లకాలము నన్ను శపించుచున్నారు. పౌరులు నన్ను మహాపాపకారిగఁ జూచుచున్నారు. నా సేవకులు స్త్రీలును నన్నుఁ జూచి [illegible] మొగము [illegible] కొనుచున్నారు. [illegible] చెలికత్తెలు [illegible]చున్నారు! ఇంతటి శత్రుపక్షము నకు నన్నుఁ జిక్కఁజేసిన నన్ను నీవును వదలిపోయిన నా గతి యేమి? నాకటువంటి జాలక యేమేమో కొన్ని మాటలాడితిని, దానికి నీవు కినియ వలదు. అమ్మా, మంథరా! నాపతిగతి యేమగునో కదా?

మంథర:—కైకా! ఆడినమాటనే మరల నాడుదువే! నీపతిగతి యేమగును? బ్రదికిన బ్రదుకును, చచ్చినఁ జచ్చును, ప్రపంచములోఁ బతులు లేని సతులెందరు లేరు? వారిలో నీవొకతె వయ్యెదవు.

కైక:—మంథర! చచ్చిన నాగతి యేమి?

మంథర:—మరల నన్నదే రీతిగ నడిగెదవు. నీవును బ్రదికిన బ్రదుకుము. చచ్చినఁ జావుము. చచ్చు నుపాయము [illegible] బడిఁ జితిలోఁబడి జావుము. పుణ్యగతికి మార్గమగును, సీ తలవ్రాత యేమియో రేలుంబవళ్లు మగఁడు చచ్చును, మగఁడు చచ్చునని చావకమునుపే మొత్తుకొనుచున్నావు. నీనాలుకపై నేమో యనిష్టమున్నది. ఊరడిల్లుము. బ్రహ్మవ్రాఁత యెటులుండిన నటులగును. ఇచట నేలఁబడి పొరలాడుచున్నావేల? ఇంటిలోనికి రమ్ము, పోవుదము. (నిష్క్రమణము.)

## ద్వితీయరంగము.

దశరథుండు. కౌసల్య. కైకి.

దశరథుః—(చింతించుచుఁ జేతులు నోడించుకొని కూర్చుండి.)

సీ. రామ, పరంధామ, రవికులాగ్రణిసోమ,
రామ, రామా, రమారామ, రార
రారె, సుందరాకార, రా, రాజీవవిరామ,
నీలమేఘశ్యామ, సుపురారె,
రారె, చిన్నికుమార, రా, రాజసుకుమార,
రార, నాయనటుమార, రారతండ్రి,
రా, సుమకోమల, రాజశుభాకార,
రార, ప్రాణాధార, రారతనయ

గీ. రామ రామా త్రిలోకాభిరామ, విజిత
రామ, శ్రీరామ, రఘురామ, రామచంద్ర,
జానకీరామ, నృపకుల సార్వభౌమ,
విభవసుత్రామ, త్రైలోక్యవిమలనామ.

(అనుచుఁ గన్నులింపుకమూసికొని.)

రామా, రామా! ఈలాగు మౌనమూన నుచితమా? పట్టభంగమొనర్చితి నని నాపైఁ గోపమా? లేక యుడినాపపమా! **తనయా!** సముదంచితవినయా! సునయనా! చలంబున నన్నుఁ జూడవేల! నాపై నింతటి తాపమేల? తనయా! పదునాలుగేండ్లు వనవాసాయాసంబు నీవెటు సైఁచితివి? అచ్చటి విశేషంబు లేమి? కాననాంతర కష్టంబు లనుభవింపఁజాలక నన్ను శపించితివా? నాయనా! నాముద్దుకోడలు సీత క్షేమముగ నున్నదిగదా? అరణ్యంబున రాక్షసు లేరైన నిన్ను

భాధించిరా? వారిని నీవు జంపితివా? కుమారా! నాతో మాట పలుకక నిలబడితివేల? రమ్ము. కూర్చుండుము. మాటలాడుము. నన్ను గౌఁగిలించుకొనుము. ఒకసు దిమ్ము. (అనుచుఁ జేలుసాచును. కానక దిగ్గున లేచి) ఏడీ నారాముఁడు? ఏడీ నాబంగారురాముఁడు. నాకులార్ణవ సోముఁడు? (నలుదిక్కులుజూచును.) ఇఁక నెచట రాముఁడు! కాననంబులఁ గారాకులు మెసవు రాముఁ డెటు లిచ్చటికివచ్చును! ననుఁబోలు పంచమహాపాతకుని మోమయినను జూడ వానిమన మొప్పునా? భూమికి భారముగ నేనేల యీయాధరఁబుట్టితి. పుట్టితినిఁబో! నలుగురలో నొకఁడుగ నుండక రాజ్యంబునకు నేనేల పట్టంబుఁ గట్టికొంటిని! రాజునైతినిఁబో! మొగిరువురు భార్యలు చాలక, యాచండాలిని, దుష్టచారిణిని, పాతకిని, కేకయ రాజపుత్రిని నేల వివాహమాడితిని! శంబరుని జయించుటకు నింద్రుఁడేల నాసాహాయ్యంబుఁ గోరెను! ఆయుద్ధమునకు నేనేల యీదుష్టశీలను గైకను వెంటఁబెట్టుకొని పోతిని? శంబరుఁడు నన్ను హతాత్ముఁ జంపక మూర్ఛఁగెడపెనేల? ఆసురాత్మురాలు నన్నేల బ్రతికించెను? నేనేల వరంబు లిచ్చితి? బ్రద్ద బ్రదికినరీతి నేనేల యిన్నిదినంబులు బ్రదికితి? పుత్రహీనుఁడనై యుండక, నేనేల కష్టపడి పుత్రకామేష్టి యాగం బొనర్చితి? రాముఁడేల పుట్టెను? నాగారాము కుమారుఁడయ్యేలపెరిఁగెను? నేఁగాననంబునకుఁ బొమ్మని పలుకకమున్నె తానె ప్రయాణం బయ్యెనేల! నన్ను ధిక్కరింపఁ డాయెనేల? అయ్యో! నారాముఁడు సుగుణగణాభిరాముఁడు నాకొకనికిఁగాను ఆబాలవృద్ధులకును బ్రేమాస్పదుఁడు. ఇట్టి వానినిఁ గట్టాకట్టడవిని నుండబొమ్మని పలికితినిగదా? అయ్యో! ఇంతటి ఘోర పాపిని నింతటి యనిర్వచనీయ కలుషాత్ముని, దుర్భరదురిత దూషకుని, దైవమేల యీధరపంచి రక్షించినాఁడో తెలియదు. అకటా! బాలకుఁ డనియెన్నక, ముద్దుకుమారుఁడని భావింపక, వినయ విధేయుఁ

డని తలంపక, నెన్నెల్లకాలము భక్తిచేఁ గొలుచు కుమారుఁడని సరకు సేయుకపోతివి కదా? అయ్యో: ఇంతటి కొంపటితనంబునకా నారి, యీ మహామారి కారణమాయెఁగా? ఇవి యన్నియు నెఱింగియుఁ గామాంధుఁడ నైతిని. ఏమిసేయుదు? నన్నెవరును జంపరే! ఆహా: యెటు సైపుదు, (అనుచుఁ బరుండును).

(కైక ప్రవేశము.)

కైక;—దశరథుఁ(జూచి) ఏమి నాథా: ఏమేమో కలవరించు చున్నావు దేవా యెటుల నున్నది?

దశరథుఁడు:—(కోపమున లేచి దుష్టచారిణీ: దురాధర్షిణీ! వివేక విభ్రష్టుఁడనై తమోరూపంబున నగపడిన బంధుతృణ పరివృతాగాధకూపంబునఁ బడితి. పుత్రవియోగమున నవారితసంతాప శోక కర్శితుఁడ నైతిని నీవిచట నుండకు. నాసమీపమున నిల్వక వెడలిపొమ్ము (కైక మూలఁగను నిలుచును.) హా, హా, ఏదిక్కునఁ జూచినను నా ప్రియుఁడు, నాకుమారుఁడు, నాముద్దుబాలుఁడు, రాముఁడు, గుణాభిరాముఁడు. త్రిలోకపావన రాముఁడు, నా కంటికగపడుచున్నాఁడు. సర్వమును రామమయముగ నున్నది. ఆహా! అయ్యో: ముద్దుతనయుని నరకటికను మాని వనవాసంబునకుఁ బంపితిని, దురాత్ముఁడనైతిని. హా, హా, విటీకృత దుష్టమనస్సీ; నే నిన్నెంత దూషించగలను? హా? మదాంధీభూతదుష్టాశయా, క్షత్రియ వంశనాశనా! సప్తాశ్వాన్వయ విధ్వంసనా: రఘుకులక్షీరసాగర హాలాహలా: తరణికులాంబుధి బాడబా: నీచసంచారిణీ: పావనకుల కుఠారకుఁడవై నీవేల జన్మించితివి? ఓరి మానహీనా! బాలకుని వనములకుఁ బంపుటకంటెను హాలాహలము భక్షించి చచ్చియుండఁ

గూడదా ! అజాగళస్తనంబుం బలె నిష్ప్రయోజకుఁడవై యీభూదేవతకు బరువుచేటుఁగ నేల నిలిచితివి? అయ్యో రామా! రామా ! రామా !

(19 అనుబంధము)

(కౌసల్య ప్రవేశము).

కౌసల్య:— దశరథునిఁ జూచి ప్రాణనాథా! హా రామా! హా రామా! యని నీవేల శోకించెదవు? నీరాముఁడు ఘోరారామముఁ జేరెను. లోకనిందకు నీవు వెఱచి కైకేయీమూలమున నిన్ని యపాయములఁ దెచ్చికొంటివి మునుపే రామునకుఁ బట్టంబుగట్టుదు నని సభలో గట్టిగఁబలికి, కట్టడి కైకమాటవిని నాతనయునకు వనమునకుఁ బట్టముగట్టితివి. నిందకు నోడిగట్టితివి. ఆకైక దయలేని రాముని వధింపు మని ప్రార్థింప దయ్యో ప్రార్థించియుండినచో నీపిల్లను చంపుటకైనను వెనుదీయువాఁడవు కావు. అయ్యో ! నీవేమి సేయుదువు? సత్యపాశాబద్ధుఁడవైతివి నీకేల శోకము, పెక్కునోములునోచి కానక కన్న కన్నకొమారునిఁ గానకు బలియిచ్చితివి.

దశరథు:— భామా! నీవు వచించినదెల్ల నిజము. పాపకర్ముఁడను నే ననుటకు సందియంబు లేదు. నాకిపుడే మరణసంకటము పుట్టినది. ఎట్టిదైవములకు నైనను దనకర్మఫల మనుభవింపక తప్పదని యుండ సామాన్యమానవుఁడగు నాకుఁ దప్పింపఁదరమా? నాతీ! నేను బ్రహ్మర్షి భాషణ కవిచ్యుత భాగ్యుఁడను. అన్నమిన్నా! నాచిన్ననాఁటి వృత్తాంతంబు వినిపించెద వినుము. నాచిన్నతనమున సమస్తశస్త్రాస్త్ర విద్యలు నేర్చి శబ్దవేధి యను విద్యను సాధింప సరయూతీరారణ్యములు జేరితిని.

అచ్చటఁ జీఁకటిరాత్రులలో మృగముల ధ్వనిఁబట్టి యాశబ్దము బుట్టిన స్థానమునకు నా బాణముఁ వేసి మృగములను జంపుచుంటిని ఒక యమావాస్యాంధకారంబున నీటిలో నేనుఁగు దిగి నీరు త్రావుచప్పుడు వినఁబడెను. ఆధ్వనిఁ బట్టి నే బాణంబువేసిన క్షణముననే "హాతండ్రీ, చచ్చితిని" యనెడి నార్తారావంబు వినఁబడెను. నేను భయపడి వడవడ వడఁకుచు, నడుగిడఁ జాలక తొట్రుకొనుచు నచ్చటికిఁ జని దీపము వెలిఁగించి చూడ నొక ఋషికుమారుఁడు నా బాణము దేహమునఁదవిలి నాటిన మహాసంకటమున నాక్రోశించుచు నందుఁ బడియుండెను. నేను [illegible] సంకటపడ, వాఁడు నన్నుఁ గరుణించి వృద్ధులును నంధులును నగు తన తలిదండ్రులకు నీరందించి పిదప దనవార్తఁ దెలుపుమని చెప్పెను. నే నట్లే కానిమ్మని పలికి యాంతని దేహమునుండి బాణము వెలిఁదీయఁగనే మరణించెను. ఆ ఋషికుమారుఁడు కోరినరీతి నేను వాని తలిదండ్రులఁ జేరి నీరిచ్చి జరిగినవార్తఁ దెలిపితిని. వారు పుత్రుని మరణంబునకు దుఃఖించుచు నన్నుఁ జూచి నీవును నవసానకాలమునఁ బుత్రవియోగమున దుఃఖించుచుఁ జావుమని శాపంబిచ్చిరి. ఆశాపవార్త యిప్పుడు నాజ్ఞప్తికి వచ్చినది కావున నాయవసాన కాలము సమీపించినదని నేను నమ్మితిని. దానికి సహకారులముగ నాయుదరమునఁ గెలిడి కలంచినట్లు ఉన్నాఁడు. నన్ను మాటలాడింపకుము.

(మునుఁగిడుకొని పరుండును. మరల లేచి)

కౌసల్యా:—నారాముఁడు శంఖ చక్ర గదా హస్త కోదండధారియై నెమ్మి నిటేవినాఁడు చూచెదనా? రామా, జగదభిరామా! పావననామా!

(కైకసమీపించి)

కైక:—ప్రాణేశ్వరా: నేను గడుపాపిని. నానుండి యిన్ని విపత్తులు సంభవించెను. శతాపరాధిని. సర్వాపరాధిని. నన్నుక్షమింపుము.

(దశరథుండు కైకను జూడక పెడమొగముఁ బెట్టును.)

కౌసల్య:—నాథా: మన కైక తా నొనర్చిన కర్మము పాతకమని నమ్మి పశ్చాత్తాపమొంది క్షమింపుమని ప్రార్థించు చున్నది. క్షమింపుము. క్షమించితి ననుము

దశరథ:—సర్వులను క్షమించువాఁ డారాముచంద్రుఁడు. రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా, రామా.

(తెర పడును.)

తృతీయాంకము.

వసిష్ఠుఁడు - సుమంత్రుఁడు.

వసిష్ఠుఁడు:— సుమంత్రునిఁ జూచి సుమంత్రా! మనరాజు దశరథుఁడు పరమపదించి నేటికి నాలుగుదినములయ్యెను. సుగంధద్రవ్యములు కళేబరమునఁ గప్పి భద్రపఱచియుంచినాను. భరతశత్రుఘ్నులను బిలువఁబోయిన వారింకను రారైరి. రాచనగరంతయు రోదనధ్వనుల నిండిపోయినది. కౌసల్యకుఁ బుత్రవియోగంబే చాలినంతయుండెను. దానికిఁ జేరికగాఁ బతివియోగంబొకటి ప్రాప్తిల్లెను. ఆదేవి నిద్రాహారములు వదలి నేలంటినది. ఎవరేమి మాటాడించినను రామా యనుచున్నది. ఆమె

సంకటము నేఁ జూడలేను. ఇవియన్నియు నిటులుండఁ బౌరులు చెలరేఁగి కైకయింటికి నగ్గిఁదవిలించి కైకను మంథరను జంప వలెనని యత్నించుచున్నవారు.

**సుమంతుఁడు:**—పాప మాకైక యేమిసేయును? మంథర దుర్బోధనలకు లోఁబడి యింతకార్య మొనర్చెను. ఇపుడు పశ్చాత్తాపమునఁ గుందుచున్నది. ప్రయోజనంబేమి? గిరివ్రజపుర మిచటికి దూరముగ నున్నది వడిఁగల గుఱ్ఱములపై నేలుఁబవళ్లు రెండు దినంబులు ప్రయాణమయి పోయినను జేరుట కష్టము.

**వసిష్ఠుఁడు:**—ఈ దినమంతయును జూచి మరల నాలుగు గుఱ్ఱములు దారిలో నుంచులాగొనర్పుము. శీఘ్రముగ వారువచ్చుటకు ననుకూలముగ నుండును.

**సుమంతుఁడు:**—అటు లొనర్చెద. మీరును శవమును భద్రపఱచు కార్యంబున నుండుఁడు. రాజు స్మారకముదప్పి పడినాఁడని జను లెల్లరు భావించినారు. అటులనే నమ్మియుండని.

(నిష్క్రమము.)

చతుర్థరంగము.

అయోధ్యాపురి బాహ్యప్రదేశమున భరత శత్రుఘ్నులు.

(20 అనుబంధము.)

**భరత:**—తమ్ముఁడా! నామన మేలొకో ప్రాతఃకాలమునుండియును గళవళ పడుచున్నది. తెల్లవాఱుజామున నేఁ గనిన కల నన్ని టులు కలంచుచున్నదియా యేమి?

**శత్రుఘ్ను:**—అన్నయ్యా! నీకలతీరేమి? నాకిదివఱకుఁ దెలువ వైతివే!

భరతుఁడు:—తమ్ముఁడా! నీవు వెఱతువని తెలుపనైతిని. ఇపుడు విని చెద వినుము.

సీ. దారుణ స్వప్నంబుఁ దమ్ముఁడా! కంటిని
నిన్నఁటిరేయిని నిద్రలోన
అచలాగ్రమెక్కి మాయయ్య జడల్వీడ,
గోమయ హ్రదములోఁ గూలినటుల
ఘనతైలవాపికోమునిఁగి రాసభమెక్కి
దక్షిణదిశకును దరలినటుల
రక్తాంబరముఁదొడ్గి రక్తగంధముఁ బూసి
నగ్నుఁడై యగ్నిని నడిచినటుల.

గీ. మనపురంబయోధ్య మసనమై నట్టుల
పౌరకాంతలశ్రుపూరితలుగ
రోదనంబు సేయురొద విన్నట్టులఁ
గంటి నిట్టు లేమికతమొ యెఱుఁగ.

తమ్ముఁడా! నేఁగనిన కల సార్థకఁబుగ మన పౌరజన సంచార రహితమయి నిట్టిదిగ నున్నది మున్ను పౌరనారీమణుల కలకలారావములు మానసానందములుగ సతతము ధ్వనించుచుండెను గదా? ఇపుడే నాదము వీనులకు వినరాదు. పురిప్రాంతారామంబులం దారామామణులు పురుషులంగూడి విహారార్థము గుంపులుగఁ జేరుచుండిరి గదా? ఇపు డొకరైనను నచటలేరు. గజతురగ శకట రథారోహకులికాలంబున వీథులందు సంచరింపక మానిరి. ఏమి కారణమో? అనుజా! చూచితివా యీ యుద్యానవనములు. ఫల పల్లవ కుసుమ మకరంద రసముల శుకపికశారికాభ్రమరముల సంత సింపఁజేసి యీ మధుర ధ్వనుల తాము సంతసించుచుండు సంతాన

తరువులు విగత ఫలపల్లవ ద్రుమములై శుష్కించుచున్నవి. పురము నందు వేణువీణాకల నిస్వనంబులు వినరావు. గిరివ్రజపురంబునందుండు తఱి నేఁగనిన దుస్స్వప్నంబును, మనమార్గమ్మున నయిన యపశకునములును, నిపు డీపురియందుఁ దోఁచు నవలక్షణములును, మనగురువుల వారు మనకు లిఖించిన విగతశ్రీకారలేఖయుఁ జూచి నామన మపరిమిత వ్యాకులాంబుధిలోఁ మునిఁగినది. తమ్ముఁడా! చూచితివా పురభవనములు వైభవ విహీనములై ప్రభాహీనంబులయి బలికర్మరహితంబులై ధూపగంధాది పరిమళ శూన్యములై సొబగు దక్క యున్నవి.

ఉ. కానవె తమ్ముఁడా; పురము కానసమున్బలెఁ గానిపించెడున్,
గానను కారణమ్ము. జనకాండము పట్టణమేల వీడెనో?
మానవ నాయకుండయిన మాజనకుం డిల నుండు నేకదా!
జానకినేత రాఘవుఁడు సౌఖ్యమున న్మనియుండు నేకదా?

**శత్రుఘ్నుఁడు:**—అన్నా! నాకును భయమయ్యెడు! త్వరితముగఁ నిల్లు సేరి కారణ మరయుదము రమ్ము.

**భరత:**—పోవుదము.

(21 అనుబంధము)

(నిష్క్రమము.)

---

## పఞ్చమరఙ్గము.

భరత, శత్రుఘ్నులు. కైక. మంథర.

(22 అనుబంధము)

**మంథర:**—(చింతించుచున్న కైకనుజూచి) అమ్మా: కైకా! ఏల యీరీతిఁ జింతించుచుఁ గూర్చున్నావు. మరల నీకేమి

విపత్తు సంభవించెను? నీగారాము సుతుని తత్క్షణమే వెళ్లి రమ్మని వసిష్ఠుఁడు జాబు వ్రాసినాఁడఁట, ఈ ప్రొద్దు జేపటిలో వాఁడు వచ్చును. అపుడుగదా నీభాగ్యము శిఖరభూషిత మగును.

కైక:—మంథరా! మరల నీకు నేనేమని చెప్పుదును?

ఉ. భూరివిచారనీరధిని గ్రుంగితి, మంథర! యేమిసేయుదున్
భారము నా శరీరమయెఁ బాసెను ప్రాణము ప్రాణభర్త; దు
ర్వారవినిందలన్ జనులు రక్కసి కైకయటంచు నెప్పుడున్
దూఱుదురక్కటా! యెటుల దుఃఖము సైతును నేను ధారుణిన్.

మంథర! అసూయాభూతావేశపరనై, ముందు వెనుక లాలోచింపక, పైనవచ్చు హానినిఁ దలపక, యింటితనఁపు గౌరవమును విచారింపక, రాముని ప్రవాసంబుఁ గోరితిఁ; పుత్రవియోగాతిశయ దుఃఖంబునఁ బ్రాణపతి ప్రాణంబులు బాసెను. ఆ దుఃఖాతిరేకంబున నేనుండఁ, గన్నవారు కన్నకూఁతలు కూయుచుఁ బచ్చిగయ్యాళి కైక యని నన్ను నిందించుచున్నవారు! నా మోముఁ జూచినఁ దమకేమి పాపము ఘటిల్లునో యని ముఖమున ముసుఁగు వేసికొని యెదరు. ఎవరును నాయింటి కడపఁ ద్రొక్కరు. నన్ను మాటలాడింపరు. ఏమి సేయుదును?

మంథర:—ఇంత కేనా యింతటివంత; నీమగఁడు పోయినందులకు మన మేమి సేయఁగలము? నీవు బ్రతికినంతకాలము వైధవ్యమనుభవింపక తప్పదు. రానున్నది రాకమానదని నేను నాఁడే పలికితిని, ఇఁక నూరివారు కన్నకూఁతలు గూయుచు నిన్ను దూఱుదు రనికాదా నీచింత. అట్టివారిపేరు వ్రాసియుంచికొనుము. మన భరతుఁడు రాజయిన తోడనే వారిని దండింపఁ

జేయుదము. పిదప నూరివారెల్లరుఁ జచ్చినటుల నోరుకట్టి
కొని పడియుందురు.

(భరత శత్రుఘ్నుల ప్రవేశము).

(23 అనుబంధము.)

(భరత శత్రుఘ్నులు కైకకు వందనంబు లొనర్తురు.)

(కైక భరతు నాలింగన మొనర్చి.)

కైక:—నాయనా! ఎన్నిదినంబులకు వచ్చితివి. క్షేమమా? నీతాత
గారును ముసలవ్వయు మేనమామయు క్షేమముగ నున్న
వారా? నిన్నుఁ బ్రేమతోఁజూచి యాదరించిరా?

భరతుఁడు:—తల్లీ! అందఱును నచ్చట క్షేమముగ నున్నవారు. సదా
కాలము నిన్నుఁ దలఁచికొను చున్నవారు. అమ్మా!

కం. నాతండ్రి దశరథుండును,
నాతండ్రి సమానుఁడైన నాయగ్రజుఁడుణ్
నాతమ్ముఁడు లక్ష్మణుఁడును
సీతయు సుఖమున్నవారె చెప్పవె తల్లీ!

అమ్మా! నాతండ్రి సుఖమున నున్నవాఁడుగదా! ఎల్లకాలము
లందు నిన్నుఁజేరియుండునే? ఇపుడేల యిచటికి రాఁడయ్యెను?

కైక:— (నిట్టూర్పులు సారించుచు.)

కం. భరతా! యేమని తెలుపుదు
గురుతరమగు జరనుఁజిక్కి క్రుంగుచు జనకుం
డురుతరసుఖముల తావగు
స్థిరతర స్వర్గమునునంది సేమముఁగనియెణ్.

(భరతుఁడు హాయని చింతించుచుఁ గూర్చుండి మరలలేచి.)

భరతుఁడు:—హా, నాయనా! హా, సమస్త రాజవంశతిలకా! నిష్కారుణ్యముగ మము నొంటిగవదలిపోవ న్యాయమగునా? తండ్రీ! శరత్కాల పూర్ణిమాచంద్ర విరాజితంబగు నభంబును బోలు నీతల్పము, వర్షాకాలము నందలి యమావాస్యాంధకారమునఁ గప్పంబడిన యాకాశముంబోలె శోభ చెడినదిగదా?

కైక:—భరతా; నీవు విమలజ్ఞాన విరాజితుఁడవు. ప్రాజ్ఞుఁడవు. ప్రాకృతునింబోలె శోకాక్రాంతుఁడవై క్లిశ్యమానుఁట ధర్మము గాదు. నిన్నుబోలువాఁడు దైన్యమున నిటుసంతాపించినచో నింగతవారిగతి యేమి? నీవు దుఃఖమున నేడ్చినమాత్రానఁ జనిపోయిన నీతండ్రి మరల బ్రదికివచ్చునా?

భరతుఁడు:—తల్లీ! నీవైరాగ్య వచనంబులు నిజములు. అయినను నాతండ్రి, నాసోదరునకుఁ బట్టంబుగట్టి తాను వనమొకటి యాచరించునని నమ్మియుంటినిగాని యారీతి దురంతదుఃఖమున మము ముంచిపోవునని తెలియనైతిని. అమ్మా! నాయగ్రజుఁడు నాతండ్రి సమానుఁడు రాముఁడు నా నాయనను సంస్కరించి కృతార్థుఁడయ్యెను. అంతటి పుణ్యము నాకు లేదయ్యెను గదా యని చింతించెద.

కైక:—కుమారా! నీరాకకై వేచి నీనాయనకళేబరమును సంస్కారమొనర్పక యుంచియున్నవారు.

భరతుఁడు:—అమ్మా! నాభ్రాత! నాతండ్రి సమానుఁడు, నాదైవము, రాముఁ డిచట నున్నవాఁడే! శవసంస్కారణం బొనర్పక యేల నిలిపిరి!

కైక:—నాయనా! ఆవిషయము ఘోరతమముగనున్నది. నీయన్న సీతనుంగూడి లక్ష్మణుఁడు వెంబడింప నరణ్యంబుఁ జేరెను.

భరతుఁడు:—అమ్మా! ఏమీ ఏమీ! నాయగ్రజుఁ డరణ్యంబుఁ జేరెనా? ఏల?

కైక:—నాయనా! ఆసమాచారంబు వినఁగోరితివేని వినిచెదవినుు. కుమారా! నీతండ్రి నన్నుఁ బరిణయమయిన తరుణమున శంబరుఁ డను రాక్షసునితో యుద్ధ మొనర్పవలసివచ్చెను. ఆయసురుఁడు తన మాయాబలంబున దశరథునిఁ జంప యత్నింప నే నామా యలను మటుమాయ లొనరించి నీతండ్రిని రక్షించి దానవునిఁ జంపించితి. నన్ను మెచ్చి నీతండ్రి రెండువరంబు లొసంగెను. ఇపు డా వరమ్ము లొసంగుమని నే వేఁడితిని.

భరతుఁడు:—తల్లీ! నీవే మడిగితివి?

కైక:—నాయనా! నిన్ను గిరివ్రజపురంబునకుఁబంపి నీకొక జాబయి నను వ్రాయక, యిచటనే యుండునాకును దెలుపక, కౌస ల్యయు నీనాయనయుఁ గుట్రలువన్ని రహస్యముగ రాము నకుఁ బట్టాభిషేకం బొనర్ప సమకట్టిరి. అవ్వార్త నేనువిని సహింప నోపక దశరథునింజేరి పూర్వము నాకిడినవరమ్ము లొసంగు మని వేఁడితిని. ఇచ్చెద ననెను. ఒక వరమ్మునకు రాముని పట్టాభిషేకంబు నిలిపి నిన్ను రాజును జేయుమని యడిగితిని.

భరతుఁడు:—హరిహరీ యని చెవులు మూసికొనును. రెండవవర మే మని యడిగితివి?

కైక:—పదునాలుగేండ్లు రాముని వనవాసమునకుఁ బంపు మని వేఁడితిని.

భరతుఁడు:—(నిశ్చేతన్యుఁడయి క్రిందఁగూర్చుండును, మరలలేచి.)

చం. అనఘునిఁ దండ్రిఁజంపి, మహితాత్ముని రామునిఁ గానకంపి, నా
జనని సమానయై యలరు జానకి సౌఖ్యముఁద్రెంపి, తమ్మునిన్
వనతలమందునిల్పి, యిటవై భవముల్ భుజియింప నేర్తునే
జనని ! స్వధర్మహానికిని పైఁతునె ? పాపవిచార మూరయున్.

కైకా ! నీ ఘోరపాపకర్మము భూరమణుని మారణకర్మము నకుఁ గారణమయి నాశరీరమెల్ల వ్రణమొనర్చెను. నాతండ్రి కెనయైన రాముని దాపసునిఁజేసి నావ్రణమునందు తీక్ష్ణక్షారము నించితివి. ధర్మాత్ముఁడగు దశరథుఁడు, నీవు మానవ మానినీవేషముఁ బూనిన దానవి యని తెలియక వెలయిచ్చికొని తెచ్చికొనిన ఫలమనుభవించెను. భస్మవ్యాప్తాగ్ని శిఖికణమనుచు నిన్నరయఁడాయెను. నీవు కులఘ్నివి కావుననే నాజనకుఁడు విగతచేతనుఁ డయ్యెను. రఘుకుల శీలవృత్త సుఖయశములు జలధిలో మునిఁగెను. పామునంటిన పామునింబలె నాతండ్రి నిన్నంటి తీవ్రవేదనలకు గుఱియయ్యెను. నృశంసినీ, కైకా, పాపచారిణీ; అనపత్యతాఘమునకుఁ జిరకాలము తపించుచు, నెట్ట కేలకు బీదవాఁడు భాగ్యమును గనినరీతి మహనీయుని రామునిఁగని సంతసించు నాతండ్రిని నంతకుని చెంతనిడితివి. అయ్యో; ఆరాముఁడు, నయవినయ గుణాభిరాముఁడు, తనతల్లికంటెను నిన్ను హెచ్చుభక్తినిఁ గని గౌరవించుచుండెను గదా; అట్టివానిని భూమియం దంతరాళ పరిపూరిత కీర్తిని రామమూర్తిని జటాజినవల్కలములు ధరియించి యడవి నుండుమని పల్కుటకు నీకు నోరెటులాడెను ? మాతా ! వంశాచార విద్వేషిణివయి సదార నిరతుని, వీరశూరాగ్రేసరుని, పుణ్యకర్మ విస్తారుని, నంభోరుహ లోచనుని, సౌందర్యాకారుని, రఘు రాముని, ఘోరారణ్యములందు సంచరింపఁ బొమ్మన నగునా ? పుణ్య

పథవిభ్రష్టా; కులవినాశినీ; వంశపాంసనీ; మూఢమానినీ; పూర్వరాజగర్హితంబైన యీమతము నీకెవరు బోధించిరి? రఘువంశమున జ్యేష్ఠసుతుఁడు పట్టాభిషిక్తుఁ డనుధర్మంబు నీ వెఱుంగవైతివిగదా? ఓ యన్వయహారిణీ; నీ తండ్రియగు కేకయరాజ కులంబున సైత మీధర్మ మనువర్తనంబై యుండునుగదా?

ఉ. ఇంతదురాగతంబకట హీనమతీ; యొనరించితీవు; నా
స్వాంతము సంతతంబు నవిచారపయోధి ముంచితిట్టు, లా
శాంతవిశాల కీర్తియగు నగ్రజుఁ గానకుఁ బంపితీవు నీ
యంతటి రాక్షసిన్ జననియంచని యెన్నఁగ నౌనె పాతకీ.

దుష్టచారిణీ! ఇంతటి కులనాశకత్వమునకు నొడిగట్టితివికదా? సత్యరహితా; పాతకీ; అనర్థయుతముగ నీ వన్యాయవృత్తిని నార్జించిన విత్తము నే ననుభవింతునని తలంచితివా? సుధాసంయుత భోజ్యమును వదలి, గరళ సంకీర్ణాన్నమును భుజింతునని తెలిసితివా? రాజ్యభార ధారణత్వమున, నసాధారణ గ్రహణ ధారణత్వంబుఁగల నా సోదరుని రాజ్యము నే నేలఁగలనా? ఏల నిచ్ఛయింతునా? దురాధర్షిణీ; నీయంతటి గురుపాతకి గర్భమున నేను జనించుటకంటె నొక నిర్భాగ్య గర్భమున జనించియుండినచో నాకింతటి దుఃఖము వచ్చుచుండెనా? అయ్యో; కులదూషణీ; పుత్రశోకం బెట్టి బెట్టిద మనునది నీ వెఱుంగవుకదా? నీమోముఁ జూచిన పాపంబు వాటిల్లు.

మంథర:—(ముందరికివచ్చి), భరతా; కైక నీ మాత: నీతి కోవిదుఁడవు నీవు, మాతను నిందించుట నీతియా? ఇంతకు నీ మాత నీకేమి యపకృతి యొనర్చెను? నీ సేమంబరసి నీకుఁ గాను, తాఁబడరాని మాటలుబడి, రాజ్యసామ్రాజ్యము సాధించెను. అందులకై సంతసింపక మేలెన్నక కృతజ్ఞతా వచనంబులైనను బలుకక దూషించెదవే? నీబుద్ధి పెడదారిఁ బట్టనేల?

సిరిరా మోఁకాలొడ్డువాని విధంబున నటించెదవు, రాముఁడు నీకు దాయాదికదా? 'జ్ఞాతిశ్చే దనలేనకి' మ్మనెడు పెద్దల వచనమ్ము లేదా?

**శత్రుఘ్నుఁడు:**—అన్నా! భరతా! ఇన్ని యనర్థములకుఁ గారణ మీదాసి యని నేనమ్మితిని, కేకయరాజ సంజాత కైక కీనీచబుద్ధి సహజముగ రాదు, కావున నీకులవిధ్వంసిని మంథరను నేనిపుడే చంపెద అనుచు మంథరపైఁ బడ బోవును. భరతుఁ డడ్డముగఁ బోయినిలిపి.

**భరత:**—తమ్ముఁడా! స్త్రీహంతవు గావలదు; మనరాముఁడు దీనిని వినునేని మనమోమయినను జూడనోపఁడు, మన మీఁక నిచట నిలిచినచో పాపంబు హెచ్చును. కావునఁ బోవుదముర మ్ము.

(భరత శత్రుఘ్నుల నిష్క్రమము)

(24 అనుబంధము)

**కైక:**—(చింతించుచు) మంథరా: నాగతి యెంతకు దిగెను చూచితివా?

**మంథర:**—కైకా! నీవెంతటి నిర్భాగ్యుని సుతునిఁ గంటివే?

**కైక:**—మంథరా! నాకింతటి దుర్గతి నీవు తెచ్చితివి. నీమాటను నాఁడు నేవినక యుంటినేని చల్లఁగ నుండుచుంటిని.

**మంథర:**—నాఁడు నీవెంటరా నని నేను నిరాకరించి యుండినయెడల నాకింతటి దౌర్భాగ్యము వచ్చుచుండలేదు; ఇపు డేమాయె, వెళ్లెద.

**కైక:**—మంథరా, మంథరా! నీవిరీతిఁ బోయిన నాగతియేమి?

(నిష్క్రమము.)

## షష్ఠరంగము.

వసిష్ఠుఁడు. కౌసల్య. భరత శత్రుఘ్నులు.

కౌసల్య:—(చింతించుచుఁ గూర్చుండి.)

సీ. నాపూర్వ సుకృతంబు నాపూర్వ విభవంబు
నాపుత్ర రత్నంబు నా ముఖంబు
నాకామితార్థంబు నాకామిత ఫలంబు
నాసుఖవారాశి నాదువాసి
నాగృహదీపంబు నాదునిక్షేపంబు
నా మూలరూపంబు నాతపంబు
నావలపులతేఁడు నాకలుములవీడు
నాలీలలకుజోడు నాదుఱేఁడు.

గీ. నాదు చిన్నిచిలుక, నాదాత, నానేత,
నాయనుంగుఁజేత, నాదుభ్రాత,
ఈడు లేనివాఁడు, లేడకట్టా నేఁడు,
కానఁజేరినాఁడు, కానలేఁడు.

హా! రామా! రవికులారవసోమా! రాక్షసవిరామా! రామా! జనకామా! నిన్నువదలి నేనుండఁగలనా! నీవియోగము సైఁపఁగలనా! నిన్నుఁగానక నేమనఁగలనా! నాయనా! పూర్వజన్మంబున నేనాపాతకి కైకకు నేమివిషంబుఁ బెట్టియుంటినోగదా! ఇపుడా ఫలము పుత్రవియోగ మిషచే నే ననుభవించుచున్నాను. అయ్యో! తనయా! నీవు నాయట్టి పాపాత్మురాలి గర్భంబునందు జనించిన కారణంబునఁ గదా కనరాని కానన కష్టంబులం గంటివి. కొడుకా! నేనేమి సేయఁగలను? నీవియోగ దుఃఖంబు సైఁపఁజాలక సదాకాలంబు నీ ధ్యానంబుసేయుచు, నీతండ్రివలెనే నేనును ప్రాణం

బులువదల నెంత ప్రయత్నించినను, నా ప్రాణంబులు గట్టివడి మొండి బండగ నిలిచినవి. బలాత్కార ప్రాణత్యాగ బు పాపమూలంబని తలంచి యకార్యంబునకుఁ బూననై తని.

(వసిష్ఠుల ప్రవేశము.)

వసిష్ఠ:—అమ్మా! కౌసల్యా! నీవీరీతి దుఃఖించినఁ బ్రయోజనమేమి? పూర్వజన్మకృత కర్మానఫలం బనుభవింపక తప్పునా? మాప్పానఁ గూడినపుడు ధైర్యము చెడక దేహయాత్ర సలుపుటయు మానవధర్మము, ఆహారాదులువదలి ప్రాణత్యాగంబుఁ జేయఁ బ్రయత్నించుట పాపకారణం బగును. కావున నీవు దైన్యము మాని కాలము వచ్చువఱకు మని యుండుము.

(25 అనుబంధము.)

కౌసల్య:—స్వామీ! ధైర్యమూనవలెనని యెంత ప్రయత్నించినను పుత్రశోకాగ్ని సముద్రములోని యలలం బలె పైపైఁబైన నుబికి జ్వాలలు వెడలి మానసమును గాల్చుచున్నది. ఏమిసేయుదును? శక్తి చాలకయున్నది.

(భరత శత్రుఘ్నుల ప్రవేశము.

(భరత శత్రుఘ్నులు కౌసల్యనుజూచి చింతించుచు నిలఁతురు.)

భరతునిఁజూచి నాయనా! భరతా! నీతల్లి దుష్కర్మవశంబున నీ సోదరుఁడగు రాముని రాజ్యము నిష్కంటకముగ నీకు సమకూరెను. జటలు ధరింపఁజేసి నారచీరలు గట్టనిచ్చి నా గారాము కొమారుని రాముని దారుణారణ్యములకుఁ బంపి నీతల్లి కృతార్థయాయెను. రామరాజ్య పదవినిఁజేకొని పాలింపుము. ఆలస్యమేల? నీశీలమును నీతల్లిశీలమును దేశమెల్ల నెఱింపఁజేయుము. భరతా! నేను నీకుసవతితల్లి యగుటడి క్రోధము మనమునం దిడక నాముద్దుల కొమారుఁ

దుండిన దారుణాటవులకు నన్నుఁ బాపుము. వాని మోముచూడక నే నిలువఁజాలను. నాయం దు ప్రీతిఁ జేసి యింతపట్టునకు నుపకృతియొనర్పుము. ఈయన్యాయ విధముగ నీతల్లిచే నార్జింపఁబడిన యీయనామయ రాజ్యము నీవు చల్లఁగ నేలుచుండుము.

భరతుఁడు:—తల్లీ.

ఉ. పుత్రవియోగ దుఃఖమెటు భూరితరంబుగ నిన్ను నేచునో,
భ్రాతృవియోగ దుఃఖమటు బాధితుఁ జేసెను నామనంబునన్,
ధాత్రిని దుర్యశంబున వృథాపడి కుందెదనమ్మ మాత యా,
ధాతృ విధానమిట్టిదయొ, దైవము చేతకు మాఱుగల్గునే.

తల్లీ! అకల్మషుఁడగు నన్నిరీతి గర్హించెదవేల? నాయగ్రజునిపై నాకుఁగల భక్తిపిని(?)మతలు, ప్రేమాతిరేకంబును, నీకు విదితంబుగాదా? సీతాపతి పదారవిందంబు సదాకాలంబు ముదావహంబుగ భజించు నన్నీరీతి దూఱనగునే? జననీ! నేనే పాపమెఱుంగనివాఁడనని నీదివ్యపాదంబులంటి ప్రమాణంబు లొనరించెద. తల్లి, నే నెపుడయినను మన రామునకు నెగ్గుఁదలంచి యుంటినేని నాకు శాస్త్రశిక్షితఘనబుద్ధి కలుగకుండునుగాత! తల్లీ, నాసోదరుని విషయమున నేనెన్నఁ డేనిఁ దప్పుఁదలంచియుంటినేని, పాపాత్ముఁడు పోవుగతికిఁ బోవుదునుగాత! మూఢుని దురితమునకును, పండికొనియున్న గోవును దన్నినవాని గతికిని, భృత్యుని చేతఁబనిఁగొని జీతమియ్యని వానిగతికిని, స్వామి ద్రోహికి గలుగుగతికని పోవుదునుగాత! రామునకు నెన్నఁడేని ద్రోహముఁ దలఁచి యుంటినేని సద్వారమున బుఱ్ఱ్వజునకు దక్షిణనొసంగకున్నవాని గతికిని, పోరునఁ బఱచిన వానిగతికిని, కర్మజ్ఞాన శాస్త్రములు ధిక్కరించిన వానిగతికిని, గురువులను దండించిన వానిగతికిని పోవుదునుగాత. ఆరామవిభుని పట్టాభిషేకమునకు సంగ

మొనర్ప నే నెప్పుడేనిఁ దలఁచియుంటినేని, గురువులఁ దిట్టిన వానిగతికిని, మిత్ర ద్రోహిగతికిని, రహస్యమును వెలివేసిన వానిగతికిని, నార్యద్వేషికిఁ గలుగుగతికిని, నాత్మహంతగతికిని, కృతఘ్నుని గతికినిఁ బోవుదునుగాత! తల్లీ, సత్య సంధుఁడగు శ్రీరామచంద్రునకు నెగ్గుఁదలంచినవాఁడు పుత్రదార మిత్రక్షేత్ర విహీనుఁడై, సౌఖ్యరహితుఁడనయి దుఃఖభారంబున నశించును. జననీ! నాయగ్రజునికి నే నెన్నఁడేని ద్రోహంబు వాఙ్మనంబులనైన నెన్నియుంటినేని, స్త్రీవృద్ధబాలకులఁ జంపినవాని దురితంబునకును, లాక్షా మధు మాంస లోహ విష విక్రయంబులచేత జీవయాత్ర జరుపువాని కలుషంబునకును, నుభయ సంధ్యాకాలంబులందు నిద్రపోయినవాని పాపంబునకును, వహ్నిదాయకుని కిల్బిషంబునకును, గురుతల్పగముని పంకంబునకును, మిత్రద్రోహి పాతకంబునకును, బరశ్రేయస్సుఁజూడనోపనివాని పాపంబునకును, పితృమాతృ శుశ్రూష జరుపనివాని దుర్గతికిని, యాచకుల కామితార్థంబునకు విఫలం బొనర్చిన వాని యఘంబునకును, బోవుదునుగాత! మాతా, సకలలోక పవిత్ర చరిత్రుండగు భవత్పుత్రునకు నెగ్గుఁదలంచి యుంటినేని, దరిద్రుఁడును, జ్వర రోగపీడితుండును, సురాపానరతుండును, కామక్రోధాది భూతుండును, నున్మత్తుఁడును, ధర్మదార పరిత్యాగియును, పరదారాపహారిణుండును, గుణబాహ్యుఁడును, సదాచార రహితుఁడును, స్వల్పాయువును గలిగి చాండాలునఁ బలె దుష్కర్మము లొనర్చుచు నిరంగనై భూతలమున సంచరించువాఁడ నగుదును గాత.

కం. జననీ! రాముని ధర నా
  జనకుండని తలఁచి మానసంబున భక్తిం
  గని గొలుచుచుండఁ గోరతి
  గన నేపాపంబు నేను కనుమా ప్రీతిన్.

కౌసల్య:—భరతా! లెమ్ము.

మ. తనయా నీశపథోక్తులన్ వినఁగ నాతాపాగ్ని హెచ్చయ్యె, నీ
వనఘాత్ముండవటంచు నేనెఱిఁగియున్ వైమనస్యంబుగాఁ బల్కితిన్
మన మందాకులపాటునందకుము, లెమ్మా పుణ్యచారిత్ర ; స
జ్జన సంస్తుత్యపదంబు నీకునగు రాజ్యంబేలుమా మేలుగన్.

పుత్రా! నీవు పావనచరిత్రుఁడవు. నిష్కళంకమూర్తి వని నాకుఁ దెలిసియు, పుత్రవియోగంబు నాహృదయంబు బేల్చుచుండ యుక్తాయుక్త జ్ఞానంబుఁగానక హెచ్చుమాటలాడి నీమనంబు నొచ్చులాగొనర్చితిని. వ్యసనపడకుము. సుఖంబున రాజ్యంబేలుచు సజ్జన సంస్తుత్యుఁడవుగమ్ము.

భరతుఁడు:—మాతా! మరల నామానసంబుఁ గలంచు మాటలాడెద వేల? తల్లీ! ఆర్యవినుతుఁడును, ధర్మవిచారపరుఁడును, ధీరచిత్తుఁడును, ధీమంతుఁడును, వేదశాస్త్ర విచారస్నాతుఁడును, ననఘుఁడును నగు రామభూవిభుఁడు రాజ్యంబువిడిచి యడవులం దిడుములఁ గుడుచుచుండ నతని రాజ్యంబు నపహరింప నెవ్వఁడోపును? దశరథుని తనయుఁడనై ధర్మంబుఁ దప్పి యగ్రజుని సొమ్ము నపేక్షింపఁగలనా? మహామహిముఁడగు రాఘవుఁడు దశరథునింబలె రాజ్యంచేయుటఁ జూచి సంపూర్ణ సంతోషంబుఁగాంచి యాపుణ్యచరిత్రుని పదకమలముల సాన్నిధ్యమున నిలిచి కొలుచుట తప్ప నాకు వేఱొక భాగ్యముండునే? కావున నేను గాననంబుఁజేరి నారామునిఁ గని, వేఁడికొని పట్టణంబునకుఁ బిలిచికొనివచ్చి రాజ్యాభిషిక్తునిగ నొనరించి యామహాత్ముని సేవఁ జేయుచుండెద. నాకిపుడు కర్తవ్య కార్యంబంతకంటెను హెచ్చులేదు. అటు లొనరించెద.

వసిష్ఠుఁడు:—భరతా! నీధర్మవచనంబులు సూర్యవంశయశమునకు వన్నె యెక్కించెను. దశరథునకుఁ దనయుండవు నీవనుట సార్థకపఱచితివి. అయిన నిపు డొనరింపఁదగిన ముఖ్యకార్యంబు మఱియొకటి యున్నది. అది నీతండ్రి సంస్కారంబు. దాని నొనరించి నీతలంచిన మహాకార్యంబు సేయుము.

భరతుఁడు:—గురువర్యా! తమ యానతిరీతిగ నొనర్ప సిద్ధుఁడుగ నున్నాఁడను. ఆకార్యంబునకుఁ బోవుదము రండు.

సీ. ఇనకుల దీపుఁడై యిక్ష్వాకు భూపతి
యశమెల్ల దిశల నింపెసఁగ నిలిపె
చండాంశువంశాబ్ధిచంద్రుఁడై యాహరి
శ్చంద్రుఁడు సత్యము జగతి నిలిపె
భాస్కరవంశ సంభవుఁడు భగీరథుఁ
డాకాశగంగను నవని నిలిపె
రవికులజుఁడు పంక్తిరథుఁడగు నాతండ్రి
యసుర బాధలడంచి యశమునిలిపె.

గీ. భానుకులమునఁ బుట్టిన వారలెల్ల
పుణ్యకర్మము లొనరించి పూజ్యులైరి
అట్టికులమున నేఁబుట్టి యక్కటకట
యపయశంబును నిలిపితి నవని లోన.

(నిష్క్రమము.)

# పాదుకా పట్టాభిషేక నాటకము.

తృతీయాంకము, ప్రథమరంగము.

మందాకినీతీరము - శృంగిబేరపురము.

గుహుఁడు. నావికులు. భరతుఁడు.

**గుహుఁడు:**—(ఉభయదిశలఁ గొలిచియున్న నావికులఁజూచి), నావికులారా ; నాచిరకాల మిత్రమును ప్రభువును దశరథుని సుపుత్రుఁడును అగు రాముని సందర్శనమున మనమెల్లరము ధన్యులమైతిమి. మనపుర మతి సౌభాగ్యతఁ జెన్నందెను. ఆరాముఁడు త్రిలోక పావనుఁడు - సాక్షాద్దైవమేను. కాదేని కాతిని నాతినిఁ జేయఁజాలునా ? మాయల మిన్నలగు మారీచ సుబాహుల పొడ వడఁపజాలునా ? ముక్కంటివిల్లును విఱువఁజాలునా ? అట్టిదైవము సైతము విధివశుఁడై దుష్కర్మములకుఁ జిక్కిన వానింబోలె దుర్గమాటవులలో వసింపవలసి వచ్చెనుగదా ! నావికులారా ? ఆ రాములకు దుర్గమారణ్యములలో మార్గదర్శకులుగఁ బోయిన మనచెంబడివారు మరలి వచ్చిరా ?

**నావికుఁడొకఁడు:**—స్వామీ ! నేనును మఱికొందఱమున్న పోయియుంటిమి. మనరామయ్య చెక్కుచెమర్పక గంగమ్మ దక్షిణపు రేవును జేరెను.

**గుహుఁడు:**—అచ్చటనుండి యెచ్చటికిఁ బోయిరి ?

**నావికుఁడు:**—సామీ ; బరదాజముని యాశ్రయంబున రెండుదినములుండి పిదప చిత్రకూటమున నిలచి మాకు సెలవొసంగిరి.

**గుహుఁడు:**—మనదేవమ్మ సీతమ్మయు - మనస్వామి తమ్ముఁడు లక్ష్మ ణుఁడును శ్రమపడక సేమముగ నున్నవారా?

**నావికుఁడు:**—ఆదేవమ్మ సేమముగ నున్నది. లచ్చయ్య మాత్రము చాల కష్టబడు చున్నాఁడు?

**గుహుఁడు:**—ఎందుకు?

**నావికుఁడు:**—రేలుంబవళ్లు మనదేవునకు దేవేరికి నూడిగఁపుఁ బనులు సేయుటయందే యతని పసియొల్ల మగియుచున్నది. కడుపు నకు నెప్పు డేమి తినునో తెలియక యున్నది. కొలమెల్లవారినిఁ గాఁచుటయందే గడపుచున్నాఁడు.

**గుహుఁడు:**—వారి గ్రహచారమునకు నెవరేమి సేయఁగలరు? చెంబ డివాఁడొకఁడు పరుఁగిడివచ్చి గుహునకు నమస్కరించి లేచి సామీ! కడలియలలంబలెను, మిడతల దండుబలెను, తండోప తండంబుగ దండువచ్చి యేటిగట్టున దిగినది. అది యెవఁడో భరతరాజఁట, మనరామసామయ్యను వెదకుచువచ్చె నఁట. అది యెంతటి దండుసామీ.

**గుహుఁడు** (ఇంచుక యాలోచ నభినయించి నిట్టూర్పుసారించుచు).

మ. రమణీయంబగు రాజభోగములు సర్వంబుఁ విసర్జించి, దు
ర్గమ ఘోరాటవులఁ గృహంబులుగ సారంగాది సత్త్వంబులుఁ
దమమిత్రంబులుగా నొసర్చుచు నిరాధారుల్వలెఁ సంచరిం
చు మహామానితపుణ్యకర్ములు కటా స్రుక్కఁ మనంబొప్పునే.

నావికులారా! ధన దుర్గ రాజ్య సామ్రాజ్యములు వదలి యే కాకులుగా గహన సీమలందు సంచరించు మహా మహిములగు రామ లక్ష్మణులు వనములో సైతము మనుట యేలయని తలఁచి కాఁబోలు

భరతుఁడు వారినిఁ దెగటార్ప గొప్ప సేనంగూడి వచ్చినాఁడు. నాము క్కన నూపిరియుండువఱకు వారి సికపూవువాడ నీను. కావున మీ రందఱును నాయాజ్ఞ యగునంతవఱకును మననావలు ఓడరేవున నుండనీక దూరము నకుఁ గొనిపొండు. ఆభరతుని మనంబు నే నెఱింగిన పిదప నేమి సేయఁదగినదిన్ని మీకుఁ దెలిపెదను. మీరిపుడు వెళ్లుఁడీ.

నావికులు:—చిత్తము. (వెళ్లుదురు.

గుహుఁడు:—(ఆలోచించి) భరతుఁడు నిండా సౌమ్యుఁడని వినియుంటిని. అట్టివానికి నిట్టి దుర్బుద్ధి పుట్టియుండునా? ఏమో కాల విపరీతం బిది.

చెంబడి:—(నమస్కరించి). సామీ! అయోదనుండి బరతప్పయను సామివచ్చి తమ్ముఁ జూడనున్నాఁడు.

గుహుఁడు:—ఏమీ, భరతరాజు నన్నుఁ జూడవచ్చినాఁడా? నేనే పోయి యతనిని సందర్శించెద. (వెళ్లి భరతునిఁ బిలిచికొనివచ్చి యాసనముపైఁ గూర్చుండ నియమించి).

(26 అనుబంధము)

స్వామీ! భవదాగమనంబున నేఁ బునీతుఁడ నైతిని. స్వకీయంబైన దాశకులమే పవిత్రతనందెను. ఈ నాదేశము తమ మందిరారామప్రదేశంబని భావింపుడీ, దేవా తమ రాకచే వారాశి, పున్నమ రాకచే నుప్పొంగురీతిని నేనుప్పొంగితిని. నేను మీతండ్రి మిత్రుఁడను. తమరాకకుఁ గతం బెద్దియును దాఁపక నాకెఱుంగింప వలెనని దాసుఁడగు నేను వేఁడుచున్నాఁడను.

భరత:—నిషాదపతీ! నావృత్తాంతం బతివిషాదకంబు.

ఉ. భూరియశోవిశాలనిధి; భూతదయా నిరతుండు, దుష్టదు
ర్వారభయంకరుండు, సురవార సుఖావహదక్షుఁడగ్రజుం
డారఘురాముఁ, డక్కటకటా, గహనాంతర సీమలందు, సం
చారము సేయుచుండఁగని, శక్యము నాకెటులింటనుండఁగన్.

నిషాదపతీ! ఆరాముఁడు నాకన్నయ్య పితృసమానుఁడు. ఆచార్యవర్యుఁడు, వందనీయుఁడు, సదావర్ణనీయుఁడు, ఆమహాత్ముఁడు పితృవాక్య పరిపాలనమునకునై యరణ్యమునఁ గ్రుమ్మరుచున్నవాఁడు. పట్టపదార్హుఁ డామహానుభావుఁడేను. ఆరాజీవదళనయనుఁడు లేని యయోధ్య జీవాత్మలేని దేహము బలెను, దేవుఁడులేని గుడిబలెను. జీవనములేని బావివలెను. కోవెలలేని మావిబలెను ప్రభావము చెడి పాడుపడినది. నేనా పాడు పట్టనమునఁ బాడియని నిలువఁజాలను. కావున గష్టపడి కాంతారములు గ్రుమ్మరి యాకాకుత్థ్సవంశజునిఁ గాంచి యతని చరణాబ్జంబులకు భక్తితోఁ బ్రణమిల్లి ప్రార్థించి మరలఁ దోడ్కొని యయోధ్యాపురిఁజేరి యమ్మహానుభావుని; మహితరాజ్య పదస్థునిఁజేసి దాసుఁడనై యతనిపదసేవఁ జేయఁదలంచితిని. కావున నే నిచటికి వచ్చితిని, ఈమందాకినీ నదినిఁ దరింప నీసాహాయ్యంబు వేఁడితిని.

గుహుఁడు:—(స్వగతము) హా! హా? భ్రాతృభక్తియన, నిటులుండ వలదా! అప్రయత్న లభ్యమైన రాజ్య సామ్రాజ్యంబును నవలఁ ద్రోచివచ్చెను. (భరతుఁ జూచి) మహానుభావా! నీవు ధన్యుఁడవు. దశరథుని తనయుఁడ వనునది సార్థకపఱచితివి. నేను నీ సేవకుఁడను. నన్ను వేఁడుటేమి? ఈరాజ్యమే నీసొమ్ముగ నుండు నపుడు నావలు నీయధీనములుకావా? నేను రామభక్తుఁడను. ఆసుగుణాభిరామునకునై యెంతటికార్యమైనను నేఁ

జేయనోపుదును. ఆరాముని పునస్సందర్శనమునకునై నేనును నీవెంట వచ్చెదను

భరతుఁడు:—గుహా! నీవు భక్తిరస విగ్రహుఁడవు, నిరాగ్రహుఁడవు, ఉగ్రారివినిగ్రహుఁడవు, నిఖిల సుగుణనివహుఁడవు, నిస్పృహుఁడవు, అమిహిరాన్వయమణినరయ, నరణ్యములో మార్గదర్శకుఁడుగ రాఁదగినవాఁడవు కావున నిన్ను మేము వెంబడించెదము. రమ్ము నీవు నాప్రాణమిత్రుఁడవని యెన్నికని.

(నిష్క్రమము.)

ద్వితీయరంగము.

మందాకినీనది.

నావికులు భరత శత్రుఘ్నాదులు నావలపైఁ గూర్చుండియుండ నావికు లోడపాటలు పాడుచు నావలను నడపుట. ఓడపాట.

(27 అనుబంధము.)

తృతీయాఙ్కము, తృతీయరంగము.

భరద్వాజాశ్రమము.

(భరద్వాజఋషి తపంబు సేయుచుండుట. భరతశత్రుఘ్నులును వసిష్ఠులును, కౌసల్యాదులును సమీపించి ఋషికి నమస్కరించుట.)

భరతుఁడు:—గీ. భూరిమునిసమాజ, పూజ్య కల్పక భూజ
భ్రాజితౌజ, దివ్యభాను తేజ,
రాజయోగమార్గ రాజిత యతిరాజ
నుతులొనర్చి నీకు నతుల నిడెద.

(అందఱు నమస్కరింతురు, ముని మౌనముూని యుండును.

వసిష్ఠుఁడు:— కం. యతివర ! మిహిరాన్వయమణి,
యతుల గుణాన్వితుఁడు భరతుఁడను సౌజన్యం,
డతిశయ భక్తిని నీకిదె
నతులొనరించెడిని, గనుమ నయనముల దయన్.

భరద్వాజుఁడు:—[కనులుదెఱచి యంజలినింగాంచి] మునివరా, వసిష్ఠా!

మ. అతఁడో, యాభరతుండు? రాఘవుని నుగ్రారణ్యముంజేర్చి భూ
సతికిన్ భారముగాఁగఁజిల్చి, రవివంశజెల్ల దుష్కీర్తి దు
స్థితి పాత్రంబుగఁ జేసినట్టి ఘన దుశ్శీలుండు, దోషాత్ముఁ, డే
గతి వాని స్తననాను? వీరెవరొ శంకన్ బాయుచున్దెల్పుమా?

వసిష్ఠుఁడు [భరతునిఁజూచి] భరతా! ఈ మునివరేణ్యుఁడు నీ ఋజుభావంబును సంశయించినాఁడు; కావున నీవే యతఁ డడిగన ప్రశ్నలకు సదుత్తరంబిమ్ము.

భరతు:—మౌనివరేణ్యా!

సీ. లక్షణాన్వితుఁడగు లక్ష్మణుతోఁబుట్టు
శత్రుఘ్నుఁడను సాధుచరితుఁ డితఁడు
కలశాబ్ధి, చంద్రునిఁగన్నరీతిని, రాముఁ
గనిన కౌసల్య యీఁగఱితమాత
లక్ష్మణ శత్రుఘ్నులనుఁగన్న యీయన్న
మిన్న, విఖ్యాత సుమిత్రమాత
నిందజ్జగజ్జనానీక యీకైక, నా
పాపజన్మమునకుఁ బాత్రమయ్యె.

గీ. నిరపరాధి నేను నిందలపాలైతి
నిజము నీదు పాదరజము సాక్షి
దశరథుండుసాక్షి దశదిశలునుసాక్షి
జీవితేశుడైన రామదేవుసాక్షి.

జటివరేణ్యా! నేనే పాపమెఱుంగను, నిరపరాధిని, నింద జ్ఞన లోకైక కైక యను ఘోర గర్భమునఁబుట్టి కాకముబలె జీవించిన కారణంబున నీయపనింద నాకు ఘటిల్లినది. జటిజాలపాలా, అపనిందలపాలైన కతంబునను అతిశయ భ్రాతృవాత్సల్యమునను గుందుచు రాముని వియోగంబు సైఁపనోపక యామహానుభావుఁ డెందుండెనని గని, నమస్కరించి, ప్రార్థించి, మరల నయోధ్యకుఁ బిలిచికొని వచ్చి, రాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిగఁ జేయ యత్నించినాఁడను. ఇది సత్యము ముమ్మాటికిని సత్యము.

వసిష్ఠుఁడు:—మునివరా! భరతుఁ డాడిన వాక్యార్థములం దే యపోహములును లేవు.

భరద్వాజుఁడు:—(నిమీలిత నేత్రుఁడయి యాలోచించి) భరతా! దివ్యచక్షువుల నే నంతయును గంటిని. నీవు నిష్కళంకుఁడవు, పుణ్యమూర్తివి. ఆమహానుభావుఁడు రాముఁడు దేవాంశ సంభూతుఁడు, సీత దేవాంశ సంజాత.

త్రిలోక కంటకులగు రాక్షసుల వధార్థ మీ భువిలో మానవులుగఁ బుట్టి కేవల మానవమాత్రలుగ నటించుచున్నవారు. వారినుండి దానవులు వధింపఁబడి భూదేవత నిర్బాధిత గావలసియున్నది. దేవకార్యార్థమును సాధింపఁ జేయుటకై కాదె యాకైకకు, రాముని నరణ్యములకుఁ బంపు బుద్ధి యుద్భవించినది. కాదేని వేదాంత విదుఁడగు కేకయరాజు సుత కట్టి కాకుబుద్ధి పుట్టునా! కావునఁ గైకను

సుగుణ విఖ్యాతను నీమాతను నిందింపవలదు. రాముని వియోగము నీవు సైఁపవేని నీవామహామహుని సందర్శించి పురికి రమ్మని వేఁడి కొనుము. భరతా! అనుజన బంధుఁడగు రాముఁ డిపుడు యోజన ద్వయంబున నున్న పుణ్యతమమగు విపినప్రదేశములో చిత్రకూటమను పర్వత సామీప్యమున నున్నవాఁడు. నేఁ డిచట నీవువసించి నే నొసఁగు నాతిథ్యం బంది విశ్రమించి రేపు ప్రాతఃకాలముననే రామ దర్శనమునకునై ప్రయాణము సేయనగును.

**భరతు:**—మునివర్యా! నేధన్యుఁడనైతిని. తమ యానతిఁ దలమానికంబుగ ధరించి యొనరించెదను.

**భరద్వాజు:**—అటులైన నాయాశ్రమములోనికిఁ బోవుదమురమ్ము.

(నిష్క్రమము.)

## తృతీయాఙ్కము, చతుర్థరంగము.

చిత్రకూట పర్వతప్రదేశము.

రామ. లక్ష్మణ. సీత. భరత. శత్రుఘ్న. వసిష్ఠ.

కౌసల్య. సుమిత్ర. కైక.

(సీతారాములు వనవిహారము సేయుచుండ సౌమిత్రి, దూరమున నొకవైపున ధనుష్పాణియై నిలిచియుండును.)

(28 అనుబంధము)

**రాముఁడు:**—కాతరనేత్రి! ఈకాంతార కాంత, నవీన యౌవన సౌందర్యాతి విభవంబున, విరవాలుమనం బగలించుచున్నది. షట్పద బృందమునకు విందొసంగుచున్నది. వసంతుని సౌభాగ్య వైభవ మిది.

మ. స్మరమత్తేభమదోద్గమంబుఁ, బక సుస్వానోద రోమోత్సాహముల్
నిరపాయావహ మందమారుతమునున్, నిండారఁబుట్టించు, వా
సనసంశోభిత చైత్రమాస, మవనిన్ జన్మించిమించెన్ దిశల్,
విరహం బగ్గలమయ్యె భూతతతికిన్, విందాయె భృంగాళికిన్.

సీత:—రామా! జాతి విభవములేనివానికి నేమియుండిన నేమి ?

రాముఁడు:—గీ. సకల లతలను గలిగెడు సౌరభమ్ము,
ధరణి నలుదిక్కులను, వాసితముగఁ జేయు
చైత్రునకు, నబ్బదయ్యెఁగా, జాతిముదము
అవని సంపూర్ణ సంపద, యెవనికబ్బు ?

సీత:—రామా! నీమాటలు నిత్యసత్యములు, మనమే నిదర్శనములు, మోహనాంగా! ఇటు గనుము. ఈకేసరములు నిర్మల జలబిందువులచే సంశోభితములై, కనుల కింపు నింపుచున్నవి.

గీ. పువుల రసమను స్వేదబిందువులు దవిలి,
లలి నవోద్గమ కేసరావళులు బొలిచె.
రాముఁడు:— వనవనిత మాధవుని స్పర్శమునఁ జెలంగ
నగపడిన స్వేదపులకాంకురాళి యనఁగ.

సీత:—నాథా! మందమారుతుఁడను వసంతుని మిత్రుఁడు, వనలక్ష్మి వివాహ సమయమున, బాలరసాల రేణువు లనుబుక్కపిండిని, నెగురవైచు చున్నాఁడు చూచితివా ?

రాము. ఉ. బాలసమీరవార మెగవైచిన బాలరసాల రేణువుల్
లాలితమై చెలంగు వనలక్ష్మికిఁ జల్లన బుక్కయయ్యెఁగా
కాలముఁ బట్టి నిశ్చలతఁ గాచిన కాయజమంత్రవాదికిన్
సోలువియోగిలోకులను జొక్కఁగఁ జేసెడిచూర్ణమా చెలీ.

సీత:—నాథా! మలయానిలాందోళిత తరుశాఖల నర్తనలు, కనుఁగ
వకు నెంతగ విం దొనర్చుచున్నయవి చూచితివా.

రాముఁడు:—మంజులవాణీ! నిజము. గురుశిక్షచే నిద్రాప్రభావము
హెచ్చుట సహజముగదా?

కం. మలయగిరి మలయజంబుల
కలయిక భాగ్యమును గనిన, గంధవహుం, డీ
తలమాఁదలి కొమ్మలకును,
కులుకుల నర్తనలు గఱపు గురువయ్యెఁ, జెలీ.

సీత:—రామా! ఈదిక్కునఁ గనుమా! కొమ్మలను గైసేయు ననలతి
కోమలములైనకతంబునఁ గొనగోటి సోఁకు సైఁపనివయ్యును
మధుపాన మత్తములైన షట్పదచరణ నారాచములకుఁ జిక్కి
యానందబిందువులు వర్షించుచున్నయవి.

రాముఁడు:—మంజువాణీ! అది సహజముగదా?

కం. అనురాగం బున్నయెడన్
ఘనత, లఘిమగాంచు, ఔచటఁ గన, నైజంబౌ
కొనగోటి సోఁకుసైఁపని
నన లోర్వవె భృంగచరణ నారాచములన్?

సీత:—మోహనాంగా! ఏస్వాభావిక వర్ణనలోను వ్యంగ్యాధిక
నర్థము కల్పించి బదులిడుచున్నావు. ఈ వన విహారంబుఁ
జాలించి యించుక విశ్రమించికొందము రమ్ము.

రాముఁడు:—సీతా; అలసినపుడు విశ్రాంతి యవశ్యకము. ఇది
గో సమీపముననే మంజులతర మాధవీ మండప మున్నది.
అది సుశీతల తలములచే వెలయుచున్నది. కేసరసీధు సీకరం

బులఁ గర మలరారుచున్నది, వశీకృతములయి రతి ప్రగల్భిత నవశతఁజెందిన శుకముల సుకమగు సూక్తులుగలది. పంచమ స్వనము లాలపించి ధీరుల యోపికలనుబాపి, విరహమును రేపు పికములుగలది. అట్టి మాధవీ మండపమును జేరుదము రమ్ము.

సీత:—నాథా! మంచిది, యటులనే పోవుదమురమ్ము. (పోవుచు) మోహనాంగా; ఈయుత్తరపు దిక్కునఁ జూడుము; దూరమున దుమారమంతరాళమెల్లఁ గప్పెను.

(27 అనుబంధము.)

రాము:—కాతరనేత్రి! అల్లదిగో భూదారవారమ్ము ఘుర్ఘుర రవమ్ములు నెఱపుచుఁ గాంతారం మెల్లెడలఁ బరుగిడుచున్నవి.

సీత:—నాథా; ఈ దిక్కుచూడుమా, సమదసాంౘగ శార్దూలాది మృగములు ప్రాణభీతిఁగొనినవానింబలె, దిక్కుతెలియక, చీకాకుపడి పరుగిడుచున్నవి.

రాము:—భామా; ఈవనమునం దాటవికులు, వేఁటకునై ప్రవేశించిరి కాఁబోలు. అయినను, నిందలి నిజస్థితినిఁ దెలియవలెను. (దూరమున నిలిచియున్న సౌమిత్రినిఁ జూచి). లక్ష్మణా! ప్రముకడి మృగములు క్రిక్కిఱిసి, ప్రాణభీతినిఁ బరుగిడుచున్నవి. కారణమేమో యరసిరమ్ము; మేమిచ్చట విశ్రమించియుందుము.

(లక్ష్మణుఁడు వెళ్లును).

(సీతనుజూచి). సీతా! అదియే, నాపలికిన మాధవీ మందిరము; కనులకు నెంతగ విందొనర్చుచున్నది యీప్రదేశంబు.

సీ. కమనీయ కహ్లార కలహంస కలితంబు
విమలాంబుకాసార విశ్రుతంబు
అందమౌ కురువింద మందార మహితంబు
సుందర మాకంద సురుచిరంబు
కంకేళి కేతకీ కదళీ కపిత్థ బు
కాంత కాంతలక సుకాంచనంబు
మధుసుధారసపూర మధురాంబు సారంబు
నారికేళాధిక నగ యుతంబు.

గీ. మందమారుత కందళ మానితంబు
కుందకుట్మల బృందోప సుందరంబు
న వనంబునకంటె నానందదంబు
నందముగఁ గాంచ, మాధవీ మందిరంబు.

మంజులవాణీ! ఇట్టి సుఖాలవాలమగు మాధవీ మండపమున నించుక విశ్రమించి కొందము రమ్ము.

[సౌమిత్రి నగఁ బ్రవేశించి.]

లక్ష్మణుఁడు:—అన్నయ్యా! మోసము. మోసము; సర్వము మోసమాయెను. ఓరా! క్రౌర్యము. ఓరా! దురాశ. ఓరా! దౌష్ట్యము. అగ్రజా! లెమ్ము; వేగమ్మె లెమ్ము. బాణబాణాసనములఁ జేఁబూనుము. నావదినగారిని గుహలోనుండఁ బంపుము, త్వరపడుము.

రాముఁడు:—అనుజా! ఏల యింతగ నాతురపడియెదవు. ఉన్నవార్త నున్నరీతిగఁ దెలుపుము.

లక్ష్మణుఁడు:—అన్నా! అపాపియగు కైకయొక్క దుష్టగర్భ సంజాతుఁడగు భరతుఁ డన్యాయముగఁ దనకు లభించిన రాజ్యసా

ప్రాజ్యముతోఁ దృప్తినందక యటవిలో నివ్వఁజంపి, గరళ కృత భక్ష్యంబుగ భ్రాతృస్వం బనుభవింప సమకట్టినాఁడు, ఆద్రోహికి మనోభంగముగ వాఁడు వచ్చుదారి నరికట్టి వానిఁ దునిమి దుమారఁబుఁజేసెద; నాకు సెలవిమ్ము.

రామః:—అనుజా! నీవు గొప్పపౌరుషవంతుఁడవేను, అయినను నాలోచనాయుతమతి నీకుఁ దక్కువ. ఆతురపాటు హెచ్చు. మన భరతుఁ డెన్నఁడేనియు మనకు నహితంబుఁ దలఁచెనా! ద్రోహబుద్ధి వానిడెందమం దుద్భవించునని సందియించెదవా! భ్రాతృ వాత్సల్యము నీకంటెను వానికి హెచ్చుగ నున్నదని నీవు తెలియవా? నాయందు వానికి సంపూర్ణమగు భక్తికల దుగదా! వాని సుగుణ సంపదకు నీవిటు న్యూనతఁ గల్పింప వచ్చునా? గిరివ్రజపురినుండి వాఁ డయోధ్యకు వచ్చి ననుఁ గానక, కారణంబుఁ దెలిసి నన్ను మరలఁ బురికి మ్మని ప్రార్థింప వచ్చుచున్నవాఁడుగాని యన్యం బెద్దియు నుగాను.

లక్ష్మ:—సీ. మున్ను నాలోచితముగ మాడలాడిన
మితిమించు భాష క్షమింపుమన్న
మనభరతుఁడు దార మానస స్తుత్యుఁడు
ఖలగుణంబులు వానిఁ గలఁపవన్న
మాతృదోషం బెంతమాత్రముఁ బుత్రుని
కలుషము కాదని తెలియుసన్న
భ్రాతృభక్తి విశేషభాసురుఁ డగువాఁడు
దురితములకు సదా దూరుఁడన్న.

గీ. దైవముగఁ బూజ సల్పఁగాఁ దగినసీవు
అడవినుండుట నే సైఁప నైతి నన్న

కోప మూర్తిగొని నన్నుఁ గూల్చేనన్న
నేరమెన్నక నన్ను మన్నింపు మన్న.

అన్నా ! నే ననాలోచితముగ భరతుని ఋజుభావంబును సందియించిన తప్పు క్షమింపుము. నిన్ను వేఁడికొనియెద.

రాము:— అనుజా ! నీవు పశ్చాత్తప్తుఁడవైన కారణంబునఁ బునీతుఁడవైతివి. ఆ భరతుఁ డిటు చేరునంతవఱకు నీమాధవీకుటజ సమీపమున నుందము రమ్ము:

(భరతుఁడు ప్రవేశించి దూరముననున్న రాముని దర్శించి దుఃఖాతిరేకంబున నశ్రుపూరిత నేత్రుఁడై.)

హా ! హా ! విధిమాయ దురూహ్యంబుగదా ? జలధి వలయిత భూవలయంబును, దనభుజబలమునఁ దాలఁగల రఘురాముఁనకా యీ యటవీతల నివాసము ? హా !

సీ. చేయిడ జాతెదు, చెలువారు నునుమేను
కఠినోపలంబులఁ గందువాతె
పంకజంబులఁ బోలు పాదతలంబులు
కంటకంబులు చిక్కి గాజువాతె
పటునీలిమచ్ఛాయఁ బరఁగిన కేశముల్
చటులారుణచ్ఛాయ జడలు వాతె
సుమదామ శోభిత సురుచిర కంఠంబు
తులసి హారముల యొత్తులకుఁ దాతె.

గీ. గోముమించిన రఘురాము మోముదమ్మి
చండకిరణుని వేఁడిమి నెండఁబాతె
పుట్టు శ్రీమంతుఁ డీరీతి నట్టడవినిఁ
జేరఁ గట్టడి విధిచేఁతఁ జిక్కఁబాతె.

(ఇంచుక సమీపించి.)

కటకటా! ఎంతటి ధీరుఁ డింతటి దీనదశకు దిగెను? దైవవిచేష్టలఁ దెలియ నెవరితరము? [రాముని దిక్కుఁజూచి] అయ్యో! వెలలేని దువ్వలువలు దాల్చుచున్న మహామహునకా యీనారచీరలు? ఈకట్టువస్త్రములు? కృష్ణాజినమా యుత్తరీయము? నలుతావుల వలపులు వెదజల్లు పూవులతావుల సొంపారు సౌందర్య శిరోమణి జటాధారణం బొనర్ప నర్హుఁడా? మృగమద చందన చర్చలఁ జెలువారు నునుమేనా, ధూళీదూసరితమై సొబగు చెడినది? అయ్యో! నావలనఁగదా యిన్నిసంకటము లీ మహామహునకుఁ బ్రాప్తిల్లె? నా బ్రతుకు వ్యర్థమయ్యె. ఇపుడు నేనేమి సేయుదును? నన్నుఁజూచి యీపావనమూర్తి "నేఁ బాపిష్ఠకైకగర్భమునఁబుట్టిన పాపకర్ముఁడ" నని తలంచి నిరాదరించి నన్నుఁబల్కరింప నిరాకరించు నేమోగదా! అటు లొనరించిన నాగతియేమి? ప్రాణత్యాగమే కదా? అట్టి దుఃస్థితి రాకమున్ను, నే నాదేవదేవునిదర్శించి, నిరపరాధి యని పలికి, పిదప నేమివచ్చినను దాని ననుభవించెద. ఇపుడా స్వామికిఁ ద్రికరణశుద్ధిగ సాష్టాంగ దండప్రణామంబు లాచరించెద.

[అనుచుఁ గర పుటములు ఫాలతలంబునఁ గీలించి.]

[రామాయణ శ్లోకము.] రామాయ రామభద్రాయ
రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ
సీతాయాః పతయే నమః.

[అనుచు సాష్టాంగ దండప్రణామం బాచరించుచుఁ బడియుండ.]

రాముఁడు [దూరముననుండి చూచి సమీపించివచ్చి భరతుని లేవనెత్తి గ్రుచ్చి కవుంగిలించి.] అనుజా!

ఉ. క్షేమమె నీకుఁ, దండ్రికిని, శిష్టవసిష్ఠ పురోహితాళికిన్
క్షేమమె మాతలెల్లరకు ? క్షేమమె నీయనుజుండు, పౌరులున్
క్షేమహితాటవీస్థలికి నీవిపు డేమికతంబు వచ్చినా
వో ! మహితాత్మ ! నీమధుర సూక్తులు నేవిని పంతసించెదన్.

సమ్మోదభరితా ! భరతా ! నీవీ భూభారమ్ము నవలీలగ భరించి నావుగదా ? భూజనుల నీవు న్యాయశాస్త్రానురీతిగఁ బరిపాలించు చున్నావుగదా ? మనగురువులు దినదినము నీకు రాజనీతివిధులు బోధించుచుందురు గదా ? మనమాత లెల్లరును నిన్నాదరాతిశయమున మన్నించుచుందురు గదా ? నావియోగమున దుఃఖించి కృశించు చుండు మన ముసలితండ్రిని మీరెల్ల రాదరించి దుఃఖోపశాంతిఁ గలిగించుచున్నవారుగదా ! అయోధ్యనువదలి నీవిపు డిచటికి వచ్చిన కారణం బేమి ?

భరతుఁ:—అన్నయ్యా ! శోకభరమ్మున నేనిపుడు మాటలాడఁజాలను, మనవా రెల్లరును గురువులగు వసిష్ఠులవెంట వచ్చుచు నున్న వారు ; వారినిఁ బ్రశ్నింపుము.

[వసిష్ఠులు. శత్రుఘ్నుఁడు, కౌసల్యాది మాతలు ప్రవేశింతురు. శ్రీరాముఁడు నమస్కరింపఁబోవును.]

వసిష్ఠుఁడు:—రామా ! నమస్కారములు నిలుపుము.

౪౦. వనవాస క్లేశంబులు
ఘనతరముగ నిన్నునేఁచి కాఁచెంచెఁగటా ?
జనపతి ; క్షేమమె నీవును ?
మనసీతకు లక్ష్మణునకు మంగళము గదా ?

రాము:—గురువరా! తమ యనుగ్రహాతిరేకంబున వనవాసక్లేశము లేశమయినను నాకుఁ దోఁపదు. ఆచార్యోత్తమా! నే నడిగిన కుశల ప్రశ్నలకు మారుత్తరంబు నీయక యున్నవా రేల? నాయనుంగుతండ్రి దశరథుఁడు కుశలుఁడు గదా?

వసిష్ఠ:—రామా! పరేంగితజ్ఞానప్రావీణ్యముఁ గల నీవీరీతి నడుగ నగునా?

కం. ఇలలో శాశ్వత కుశలము
కలుగునె యెవ్వానికైనఁ గాకుత్థ్సవరా?
జలబుద్బుదములు నిలుచునె
కలకాలము నీరుగాక కానవె దీనిన్?

(రాముఁడు ఱిచ్చవడి నిలిచియుండ.)

కౌసల్య:—రామా! (అని కౌఁగిలించికొని.)

చ. జనకుఁడు లేనిబిడ్డవయి, సారసుఖంబుల నీఁగి, యీవిధిన్
వనతలవాసకష్టము, లవారిగ నందఁగనైతివయ్య, యీ
జనని కిరాతిగర్భమున జన్మమునెత్తిన కారణంబునన్
తనయ నిన్నుఁ స్మరించుచును దండ్రిచనెన్ దివిసౌఖ్యమందఁగన్.

(రాముఁడు నిర్విణ్ణుఁడై నిలుచును.)

కైక:—తనయా, రామా!

చం. జనకుఁడులేని బిడ్డనిగ సల్పితినయ్య కృతాపరాధినై
వనతలవాస కష్టము, లవారిగఁ గూర్చితినయ్య పాపినై
జననికి నిన్నుఁ బాపి కడు సంకటపెట్టితినయ్య నీకు, నో
తనయ, ననున్ శపించుచును దండ్రిచనెన్ దివిసౌఖ్యమందఁగన్.

(రాముఁడు నిశ్చేతనుఁడై పడి హాయనిలేచి కూర్చుండి.)

హా! తండ్రీ! దశరథా! నాయన్నా! నావియోగ దుఃఖంబు సహింపనోపక, దుఃఖించి, భువిఁజాలించి, దివినైనను సుఖమనుభవింప వెడలితివా? నాయన్నా! ఇఁకఁ బదునాలుగేండ్లకైన నిన్ను దర్శించు భాగ్యము నాకన్నగనకుఁ గలుగునని నమ్మియుండిన నాయాశ వమ్మయ్యెఁగదా? తండ్రీ! నీవులేని యయోధ్యాపురి నాకు యమపురిగ దోఁచునుగదా? అయ్యో! నాయనా! హా యిఁక నెచట నాయన్న?

సీ. లేఁడాయెనే తేఁడు? పాడాయె నేపురి?
రాఁడాయెనే నేఁడు రాజరాజు?
నాయనా! రమ్మని ననుఁజీరువా రేరు?
పోయెనే గారాము పుత్త్రివదలి?
తనయ, రారమ్మని తనివార నన్నెత్తి
ముద్దిడువా రేరు ముదముఁగూడ?
ఇనకులాధీశుఁ డీయిల వీడిపోయెనే?
నాడును వీడును బాడుపడెనె?

గీ. మానవాధినేత మననమ్ముఁ జేరెనే?
పౌరులెల్ల నిఁకను బ్రదుకఁ గలరె?
గుండె బండగాను, నుండగఁలానె? నే
దాళఁజాల నిఁకను జాలుబ్రదుకు.

(హా, నాయనా యనుచు గ్రిందఁబడును.)

వసిష్ఠుఁడు:—రామా! (వేవనెత్తి ఏమిది యచ్చెరువు? నీచర్య నీతి విపర్యయముగ నున్నది. పిన్ననాఁడు నీకు నేఁగఱపిన యోగ శాస్త్రమును మఱచితివా? నిన్ను నీవెఱుఁగక యున్నావే?

ప్రాకృత పామర మానవునింబలె నటించుచున్నావే? దశరథుం డెవండు? నీవెవండవు? తండ్రి, తనయుం డను నది వ్యావహారిక సంబంధమగునుగాని పారమార్థిక సంబంధమా? సంయోగ వియోగంబులు సృష్టి సహజములుగావా? కాలకర్మంబు లనాదిగ నుండునవి యైనను దైవాధీనములుగావా? జనన మర ణంబులు సృష్టి ప్రళయములుగావా? జననము కర్మాధీనము గదా? జననముతోడనే మరణ మను మృత్యుదేవత వెన్నంటి గాచియుండును గదా? లేచియున్నను, నిద్రించినను, గూర్చు న్నను, నిలిచియున్నను, సంచరించుచుండినను, దాంచికొనినను, భూతకోటి నానుకొని గాచియుండునది మృత్యువుగదా దానినిం దప్పింప సాధ్యమా? కాలము, మృత్యువు నాశ్ర యించికొని యుండునుగదా? ఇంక సంయోగ వియోగము లను నది సముద్రములోని తరంగములను బోలవా? జలకాం డములోం బడిన కాష్ఠములెల్ల నలల సాహాయ్యమున నొక్క చోటంజేరి మరల నాయలల దెబ్బలవలననే, వియోగమంది దిక్కొకటి కొట్టికొనిపోవా? భువినింబుట్టు భూతకోటియంత యును నట్టిదియుకదా? పథికు లెల్లరును మార్గమధ్యమున నొకచోటంగూడి ముచ్చటించుచు, హాయిగనుండి, మరల యథేచ్ఛగం దమదమ దరివెదకికొని వెళ్లరా? సంయోగ వియోగము లిట్టివికావా? దృశ్యమగు సమస్తవస్తు జాలమును నశ్యమగుననుట యెవ రెఱుంగని విషయము? అయినను నిందున్నచిత్ర మేమనినః మాయ యను నజ్ఞానావరణము బుద్ధినింజుట్టి, మన లోకానుభవజ్ఞానమునెల్ల నశింపంజేసి,యజ్ఞా నావరణములోనికి నీడ్చికొనును. అపుడు సర్వమును మరపు దట్టి ప్రపంచము సత్యము, తానుస్థిరమని నమ్మును. ధీరుం

డగు వాఁడీ మాయాప్రభావమును గుర్తెఱిఁగి యజ్ఞయాగాది పుణ్యకర్మము లాచరించియో, ధారణ ధ్యాన సమాధి యోగాభ్యాసముననో, ఆయజ్ఞనావరణమును జంపి, తేజోరూపుఁడై, బ్రహ్మానందమును శాశ్వతముగఁ బొందును, రామచంద్రా! ఈ యోగవిషయము చిన్నతనముననే నిదర్శనముల పూర్వకముగ నీకు బోధించితిని. నీకిపు డది మఱపుదట్టినది. రామా! శోకమునకు నెడమీయకుము; లెమ్ము. ధీరుఁడవు గమ్ము, ఉచితకర్మము లాచరింపుము. పుణ్యకర్ముఁడవై క్షాత్రోచిత ధర్మము లనుసరింపుము. భ్రాతృ భక్తివిశేషంబున నిన్ను దర్శింప వచ్చిన భరతుని రాకకుఁ గారణము విచారింపుము. నీ తల్లుల నాదరింపుము.

గీ. రామ! వీరారివర్గవిరామ లెమ్ము
శోకభరమును నీఁగుమా సూజ్ఞుఁడగుచు,
క్షాత్రధర్మంబు నెఱపుమా ధాత్రిలోన
వినుమ నామాట వేదాంతవిదుఁడ వగుచు.

భరతు:—రామా! నేను సన్నిధిని లేనిసమయమ్మున నాపాలి శనిగ్రహమువలె నాతల్లి కైక పరిణమించి, దురాశాపిశాచావేశయై, దుష్టవరమ్ముల నెపమ్మున నీపట్టాభిషేకమునకు నంతరాయముఁ గల్పించి నిరపరాధివగు నిన్ను నట్టడవికిఁ బోదట్టి, కట్టా, యాముదుసలితండ్రిని యమపట్టణమునకుఁబంపి, యిపుడు పశ్చాత్తప్త యయినది. అనఘాత్మా! అన్యాయార్జితమగు భ్రాతృస్వము గరళకృతభక్ష్యమని యెన్ని ధైర్యమున నే భుజింపఁజాల. రఘువరా! ఇక్ష్వాకు కులాచార క్రమమునుబట్టి, తండ్రిరాజ్యము జ్యేష్ఠకుమారునకు సంక్రమించునుగాని, తెదితరులకు రాదు. భాగార్హము కాదు. రామచంద్రా! విపులతర

మగు రాజ్యభారము దుర్బలుఁడనగు నేను భరింప నోపుదునే? గరుత్మంతుఁడు మోయఁగల భారము నూరు పిచ్చుక మోయునా? సహస్రఫణములుగల యాదిశేషుఁడు భరింపఁజాలుభూభారము నొక నీటిపాము భరించునా? సుగుణగణాభిరామా, రామా! నీచరణ దాసుఁడనై నిన్ను సేవింప వచ్చిన యనుజునిపై సంపూర్ణ కటాక్ష ముంచి, శచీపతి చందమున నయోధ్యాసింహాసనం బలంకరింప వత్తువని నినుఁ బ్రార్థింప వచ్చినాడను. నేను నీశిష్యుఁడను, నీదాసుఁడను, నీయనుజుఁడను. నావేఁడికోలుల నాలించి, శిష్టాచారోదారవిచారుఁడవయి, నాకు ననుగ్రహ పూర్వకంబగు ప్రసాదం బిమ్ము. రాజ్యంబు ననురక్తిచేఁ జేకొనుము. రామా!

కం. నిజవంశాచారంబును
త్యజియింపక, ధాత్రినెల్ల ధర్మయుతుండై
భుజబలమునఁ బాలింపుము,
సుజనహితా! ప్రీతివినుము, సోదరు మనవిన్.

కైక:—తనయా! సుజనవిధేయా! నేను క్రూరరాక్షసిని, ఘోర పాతకిని, నీయెడ నే నపరాధశతం బొనర్చితిని. నీతల్లిగర్భమునం దార్పరాని చిచ్చిడితిని. లోకకంటకురాలై తిని. కరుణాభరణా! నాయపరాధములు క్షమింపుము. నాసుతుని భరతుని వేఁడికోలు మన్నింపుము. పౌరుల మనంబుల కానందమును నింపుము. కరుణింపుము. నేఁబుట్టి పుట్టినయింటికిని మెట్టిన యింటికిని నపకీర్తిఁ గట్టితిని. కట్టిడినై నిన్ను బాధించి, నట్టడవికిఁ బట్టంబుఁ గట్టితిని. కరుణాసుధయగు పతిని వేధించి యమ పట్టణంబునకు నెట్టితిని. నే విధవనగుటయుగాక నిరపరాధలగు నీ కౌసల్యా సుమిత్రలను విధవలఁ జేసితిని. నాచేఁతలచే

ముందిట్లు చెట్టలు బుట్టునని యెఱుంగనైతిని. రామా! మనిన పీనుంగునై లోకనిందం బడంజాల. నీతండ్రి వరఫలములు నే భరింపంజాల. ఎట్లైన నన్ను క్షమింపుము. నాసుతుని మన్నింపుము. రామా! నే ఘోరపాతకిని, ఏల జన్మించితినో తెలియదు.

సీ. పుట్టితి నేనయో పుణ్యకష్టండగు
 కేకయాధిపునింటి కీటకముగ
పట్టితి సాకేత పట్టణాధిపుం గలు,
 కాకుత్థ్స గృహనాశఘూకముగను
కట్టితింబట్టంబు నట్టడవికి నీకుం
 గటికనై నీయింటి కాకమగుచు
పెట్టితిం గుంపటి; పేరుబెంపును గాల్ప
 శాకినిరూపమై కైక యనంగ.

గీ. ఇన్నినిందల పాలయి యున్న నేను
నిరయ శిక్షకుం బాత్రనై నిలిచినానుం
రామ, రఘురాము, కరుణాభిరామ, నన్ను
గరుణ రక్షింపుమా నీవు సురశరణ్యా.

(అనుచు గాంగిలించును.)

కౌసల్య:—రామా! క్షమాగుణమే నీకు నాభరణముకదా? ఈకైక, పశ్చాత్తప్తయై నిన్ను క్షమాపణము వేడెను. భ్రాతృభక్తుండయి ప్రీతిస భరతుండు పురికిరమ్మని నిన్నుం బిలిచెను. వారి కోరిక కొనసాగించుట నీకుధర్మము. నామాటవినుము. నీముద సలితండ్రివాక్యమును బరిపాలించి యతని సత్యమును జగతి

యందు నిలిపితివి. ఇపుడు నావాక్యమును బాలింపుము. వరములు వేఁడినది కైక. ఇచ్చినది నీతండ్రి. వనమునకువచ్చినది నీవు. ఇపుడు వరఫలములు వలదనునది యే కైక. తండ్రి లేఁడు, కావునఁ బురికి రమ్మని పిలుచువారు వినుగన్న తల్లియును నీయనుఁగు దమ్ముఁడును. పురికి రాఁదగినవాఁడవు నీవు ఇం దేధర్మభంగమును లేదు. తనయా! నామాటలు లోకసమ్మతములని లాలింపుము. ఇది ధర్మవాదము; ఇఁక నావిషయ మన్ననో,

సీ. తనువును దఱుఁగఁగఁ దల్లడిల్లుచు ఘోర
తరమగు తపములఁ దలరినాను,
ఆపన్నసత్వత నాపద కలుగునో
యని యహరహముల నడలినాను
బాలగ్రహాదుల బాధలు కలుగునో
బాలురకని చాల బడలినాను
వినయంబు విద్యయు వితత వివేకంబు
గలుగు టెప్పుడొయని కలఁగినాను

గీ. వార్ధకంబునఁ బుత్త్రుఁడు వద్దనిలిచి
యాదరించును నన్నని గాఢ తనయ
యిన్నిపన్నములంబడి నిన్నుఁగాచి
యున్నదానను రమ్ము నాయన్న పురికి.

రామా! నీవు దప్ప నాకు మఱియెవరు దిక్కు? నీతండ్రి నన్ను నిరాధారవిధవను జేసిపోయెను. తనయుఁడవగు నీవును నడవుల పాలైతివేని, నే నెవరిపై నాధారపడుదును? తండ్రి లేనప్పుడు, తల్లిని రక్షించు కర్త తనయుఁడు కాఁడా? ఇది ధర్మశాస్త్ర సమ్మతము కాదా?

(30 అనుబంధము.)

రాముఁడు:— (వసిష్ఠునిఁ జూచి) గురువరా! పామరులం బలె ధర్మ సూక్ష్మములు దెలియక వీరుమాటలాడు చున్నవారు. భరతుఁడు నిష్కళంక చిత్తుఁడయి, యగ్రజునిపై గౌరవాతిరేకం బున, సహజముగ మాటలాడెను. కన్నకడుపుగావునఁ గానలో నేను కృశించుటఁ జూడనోపక, నాతల్లి కౌసల్య పురికిరమ్మని నన్నుఁ బ్రేరేచుచున్నది. బలవత్తర కార్యకారణ విశేషంబున నామాఱుతల్లియగు కైక, తనపతి తనకిడిన వరఫలములు తనకు వలదని నుడువుచున్నది. ఇవి సహజములేను. అయినను నాకాజ్ఞ యిడినవాఁడు నాతండ్రి. అతఁ డిపుడు లేఁడు. ఆయాజ్ఞ యిపుడు శిలాశాసనముగ నిలిచినది. దానినిఁ దుడువ మన కేరికిని శక్తిచాలదు. దానిని నే నతిక్రమించి నడచితినేని. పితృశాసనభంగం బొనర్చిన పాతకము నన్నుఁ జుట్టికొనును, కావున, నే నీ కాననవాసంబు వదలఁజాలను. పురికి రాఁజాలను. మీరు వీరి నేరీతినైనను నూఱడించి, యయోధ్యకుఁ బిలిచి కొని పోవుదురని నమ్మినాఁడను.

వసిష్ఠుఁడు:—రామా! నీధర్మసూక్ష్మ విజ్ఞాన ప్రావీణ్యమునకు నేనెద మెచ్చితి. నీయనుజుఁడు భరతుఁడు నిన్నుఁ ధారుణీధవునిగఁ జేసి నీపాదసేవకుఁడుగ నుండుటకై పట్టుపట్టినాఁడు. నీవు ధర్మ సూక్ష్మము లెఱింగి దాని కియ్యకొనకున్నాఁడవు. ఈచిక్కులు వదలింప మఱియొక మార్గమున్నది. అటు లొనరింతువేని నది సర్వజన సమ్మతముగ నుండును.

రామ:—గురువరా! అదియెద్ది?

వసిష్ఠ:—రామా! నీపావనచరణాభరణమ్ములగు సువర్ణభూషిత రత్న పాదుకలు భరతునకిమ్ము. అపవిత్రకరములగు పాదుకలకుఁ బట్టాభిషేకంబు మహోత్సవంబుగ నొనర్చి, పాదుకలపేరఁ బదునాలుగేండ్లు భరతుఁడు రాజ్యమేలుచుండును. ఇది నీకు సమ్మతముగదా!

రామ:—సమ్మతమేను.

భరతు:—పదునాలుగేండ్ల పిదప నొకదిన మాలసించితివేని నేను ప్రాయోపవేశం బొనర్చి ప్రాణంబులు త్యజించెదను.

రాము:—అనుజా! అంతటి పనియేల? గడువుమీఱక నినుఁ జేర దను. అది తప్పను.

భరత:—అగ్రజా! నీవనుగ్రహాతిశయమున నాకొసఁగఁ దలఁచిన పాదుకాప్రసాదము నిమ్ము.

రాము:—అనుజా! నే నశుచిబాధితుఁడను. కావున పావనకరమగు మందాకినిలో స్నాతుఁడనై పాదుక లొసంగెదను రమ్ము, పోవుదము.

భరత:—మంచిది.

(నిష్క్రమణము.)

నందిగ్రామము.

# పాదుకా పట్టాభిషేకము.

భరత, శత్రుఘ్న, వసిష్ఠ, సుమంత్రాదులు. పౌరులు. కౌసల్య, సుమిత్ర, కైక, ముత్తైదువలు.

సింహాసనముపైనఁ బాదుకలుంచి పూజలొనరించి మంగళ హారతు లెత్తుదురు. మేళతాళము లగుచుండును. వేద పఠనమును సంగీతమును నలుదిక్కుల నెఱసి యుండును.

(31 అనుబంధము)

భరతుఁడు (పాదుకలకు సాష్టాంగ దండప్రణామంబులాచరించి.)

సీ. ఏదివ్యపదములు శ్రీదయితుని భవ్య
పదములై స్థిరసుఖాస్పదములయ్యె
ఏదివ్యపదములు వేదాంత పదములై
పారలౌకిక మోక్షదములయ్యె
ఏదివ్యపదములు మేదినీ శుభదముల్
సజ్జనావళి మనస్తుష్టిప్రదములు
ఏదివ్యపదములు మోదప్రదమ్ములు
పాపవిచ్ఛేదక శ్రీపదములు

గీ. అట్టి శ్రీరామపద పావనాఙ్కితములు,
శ్రితజనావళి భేదవిచ్ఛేదకములు,
మునిమనఃపద్మనిరత ప్రమోదకములు,
పాదుకలు, లోక శుభ సుఖాపాదకములు.

పౌరులారా! పావనకరములగు నిట్టి పాదుకల విఖ్యాత నామముననే నీరాజ్యము పదునాలుగేండ్లు మాత్ర మేలెద. పావననామఁడును సుగుణాభిరాముఁడును సన్నిధానమున లేకయే నేను అయోధ్యాపురినిఁ జొరఁజాలను. ఈనందిగ్రామమె నాకు నానందకరముగ నున్నది. ఆరామనామచరణ స్మరణములు నాపాలి యాభరణములై, విశ్వభరణములై, భూమండలోద్ధరణములై, భవసాగర తరణములై, శ్రుతిసతీసీమంతవీధికాలంకరణములై, సర్వలోకరక్షణాకరణములై, నీతిసన్నుత సంచరణములై, తామసగుణాంధకార నివారక నవీన సుధాకిరణములై, వారాన్నిధివలయిత జగదుపకరణములై, నీరజరిపుఖండ నిర్మలనఖర సంస్ఫురణములై, సరసిజదళసమచరణములై, సదా సంస్ఫురణములై, ధారుణినంతయును ధరించి కలుషారి మదోపహారణములై యేలును గాత.

(అందఱును సాష్టాంగ దండప్రణామంబు లాచరింతురు)

(అందఱును మంగళహారతి పాడుదురు.)

(32 అనుబంధము)

సంపూర్ణము.

శ్రీనివాసాయనమః.

# పాటలు.

అనుబంధము 1.

## చక్రవాక రాగము—రూపక తాళము.

దశరథ:— నా తనయా, రామయ్యా
నామాట, వినుమయ్యా ॥ నా ॥
సంతోషము - తోడనిన్ను
సకలోర్వికి పట్టము గట్టెద ॥ నా ॥
పటుతర మాజరచేనా - మేనుదిటవు దప్పినది
కానసీవు తడయక - నాకోర్కె నెఱవేర్చుమయ్యా ॥ నా ॥

అనుబంధము 2.

## బేగడరాగము—ఆదితాళము.

రాము:— మానుమాతండ్రీ - హీనమైన చింతా ॥ మా ॥
కానసీవు వేగా - వేగారుల బంపుము ॥ మా ॥
పిలిపింపుమా - భరతుని నేడూ
భయమువలదు - నీకు భ్రాతృవదలజాలా ॥ మా ॥

అనుబంధము 3.

## మాండ్ రాగము—త్రిశ్రగతితాళము.

మంథర:— అహా యేమివిచిత్రము - నే డిచట జూచినన్ ॥ అనువ ॥
కంటికింపుగాఁ గనెదు బాటలున్
నేడూఁ గనెదుఁ బాటలున్ - చనా దారిగానసే ॥ అహా ॥ ౧॥
కారణంబు నాకేమి - తెలియదాయెగా -
ఏమి తెలియదాయెగా - ఆహా - అరసి చూచెదన్ ॥ అహా ॥ ౨॥

## అనుబంధము 4.

### కాపిరాగము—ఆదితాళము.

కైక॥ నీకేలగలాదేచానా - నిజమాడవేలనేమదినీ - ఏలనేమదినీ ॥ నీకేల ॥

మంథర॥ ఏమనాగలా - ఏలనాగా - ఇదినమ్మవేలనే-సుదతిచాలునే-సుదతీ ॥ఏమ॥

కైక॥ కోపాము - వలదిఁకాచాలె ॥

మంథర॥ విపరీత చర్యలుచాలె ॥

కైక॥ నియాకు నాపయిచానా ॥

మంథర॥ చాలూ ॥

కైక॥ చాలూ, నీకిటు - కోపా - మిదిరీతియగునే సుదతీ ॥ నీకేల ।

## అనుబంధము 5.

### భీమపలాస్ రాగము—ఆదితాళము.

కైక॥ మేదుర - మాదామాయె - మదింగదపె - మేరమీరె - నారీ ॥

మంథర॥ వనటాలు - దీరెనేడూ ॥

కైక॥ మనాముననెలు - మేరమీరెనానీ ॥ మేదుర ॥

మంథర॥ సాహసమూ - మీరగనూ - కార్యాము - జేయా ॥

కైక॥ చేయుదునూ - కార్యాము నెల్లా - విచారమేల - ఏలా - విళంబము॥

మంథర॥ ధైర్యముగను ॥

కైక॥ వదలను - విను ॥

మంథర॥ మేలగును ॥

కైక॥ జాలామిటులేలా - విను - చాలామెనుగా ॥ మేదుర ॥ ౧॥

## అనుబంధము 6.

### ఝంఝూటి రాగము—ఆదితాళము.

దశరథ:— కాంత ఏల నీవుభూరి - వెతాలఁగ గుందాగఁ ॥కాం॥

చాలయేల - నీ - విహారముల్ - వదాలి

తారుకతమేమి - తన్వినాకు దెలుపుము ॥కాం॥ ౧॥

బాలచంద్రునికళను - వెలయు నీదుమోము,
వాడుకతమేమొ - వారిజాక్షి తెల్పుము ॥కాంత॥ ౨॥

అనుబంధము 7.

బిలహరి రాగము—ఆదితాళము

పల్ల:— భూపతి యేల నీకిట్టితలంపులు
ఆపదనైనను - అనృత మాడగరాదు ॥భూ॥ ౧॥

ఇనకులమునబుట్టి ఇంతటిమోసము
జేయగ తగవవునె - తడసి జూడుమునీవు ॥భూ॥ ౨॥

అనుబంధము 8.

ఇంగ్లీషు నోటు రాగము—త్రిశ్రగతి తాళము.

దరు॥ చలమువలదు - చెలిరో - నిన్ను వేడెదనె
కనుమదయనను - మనవివినుచు - నతివరో॥ చల॥

పల్ల॥ మాటలేల - మానుమికను - పలదిటులా
వరములిమ్ము - వేయియేలా - వదలనూ ॥మాట॥

దరు॥ వరములు ఇయ్యలేనని - పలుకను
కరుణచె - రాముని - రాజుగజేయుము ॥చలము॥

పల్ల॥ ఇచ్చినమాట - లేదని పలుకుము
చెచ్చెరవెల్లెద - సంతసమున నే ॥మాట॥

అనుబంధము 9

భూప్ రాగము—ఏకతాళము.

పల్ల॥ వినవే - నీవాక్యము - లహితము - సతతము - నమ్మనునే ॥విన॥

ప్రల్లదములు - ఇటులనగా - జనునా
నృపులాడగ - సరిసీకగునా ॥వినవే॥ ౧॥

కాని - కాని - విను - కనివిని యెఱుగను - పెంనను తాము నే
విని నేరుగను - గనుమా ॥ వినవే ॥ ౨॥

## అనుబంధము 10.

### బేగడరాగము—ఆదితాళము.

తార॥ మీపదా - దాసుడా - భూవరా - వచ్చితి ॥మీ॥

ఎప్పుడు - మిముమది - దప్పకదలచుచు
మెప్పుతో - నుండెద - సత్యము - సత్యము ॥మీ॥ ౧॥

ననునిపుడిచటికి - పిలువను - బంపిన
కారణమరయనే - గోరెద - తెలుపుమా ॥మీ॥ ౨॥

## అనుబంధము 11.

### ఆరభిరాగము—త్రిశ్రగతితాళము.

కైక॥ రామువినుతు - వినర - మునాసారనాదువరములును
ధీరవీరచిత్తముననూ - నాదుమనమునూ ॥రామ॥

భరతునకు - రాజ్యమీయా - కానకునినుఁ బంపివేయా
కోరితినే - వరములయా - ఓరయ్యామయా ॥రామ॥ ౧॥

## అనుబంధము 12.

### భైరవిరాగము—ఆదితాళము.

కౌసల్య॥ బహుచింతా - శిఖిలోనయ్యో - నేజెడితీ ॥పల్లవి॥

తాపము నేనూ - తాళగజాలనూ

విడజాలనిన్నూ - కఠినమయ్యో ॥ నేజెడితీ ॥ బహు ॥౧॥

తాళవియోగ - తాపము నేనిఁక

తనయా - వినయా - గనుమనన్ను ॥ నేజెడితీ ॥ బహు ॥ ౨॥

## అనుబంధము 13.

### బేహాగురాగము—ఆదితాళము.

సీత॥ సారసనయనా - సైపా - భూరివియోగా - మాపా
కూరిమి - సతినీ - చేరగమానీ - దూరమునా - మానా

ఏదినముయినా - నీదయబూనూ - నీదారనిటుజూనా
శ్రీదయానే - శ్రీదయానే - మోదాదాయక - నీకౌనా ॥సా॥ ౧॥

## అనుబంధము 14.

## అసావేరిరాగము—ఆదితాళము.

సీత॥ మామా - పతినినే - మానాగాలనె
ఏమని నేమనియుందు - జగతినీ - నిలువగలా - నేమహి ॥పల్లవి॥
కాంతారములా - కాంతుఁడేగదా - ఇంతీనేనూ - కాంతునివదలీ
సంతసమ్మునా - మానఁగఁగలనే - నెలవిడుమామమతా ॥మామా॥ ౧॥

## అనుబంధము 15.

## నాథనామక్రియరాగము—ఆదితాళము.

దశ॥ వనములకును నేఁడు - వెడలు రామునిగని
నిపుడైన వీనిపై - దయబూను - పగయేల ॥వన॥ ౧॥

కైక॥ ఇందుకేనానన్ను - ఇచ్చట పిలిపించి
రచ్చనేయఁగ తగదు - కుత్సితబుద్ధీ ॥ఇందు॥ ౧॥

కౌసల్య॥ చెరగొడ్డివేఁడెదా - తరళాయ తాక్షిరో
తనయానిపై చలము - తగదుమానుము - నీవు ॥చెర॥ ౧॥

సుమిత్ర॥ తల్లియింతగనీవు - దయలేక పలుకుట
సరికాదు - నీకిది - ఫలములేదికమాను ॥తల్లి॥ ౧॥

రాము॥ పదునాలు - గేఁడూలు - పదిగడియలుగనె
గడపి వత్తునమ్మ - వగవనేల - మీరు ॥పదు॥ ౧॥

దశ॥ తనయా - నిన్నువదలి - మనగలనే భూవి
తాళాగాజాలానే - నీవరితాపము ॥వన॥ ౨॥

కైక॥ అందారిలోనన్ను - ఆరాడిజేయఁగ
తగదు నీకిదినాథా - తడయక వెళ్లెద ॥ఇందు॥ ౨॥

## అనుబంధము 16.

### మాలకంస్ రాగము—త్రిశ్రగతి తాళము.

కైక। విన నేరవలదు - విన నేరా

కౌసల్య। వినవే - మనవి ॥విన నేర॥

కైక। వలదు చెలిరో - పలుకవలదు - విననను - నీదుమాటలా

కౌసల్య। సరోజనేత్రా - సహజమె - సాహసకార్యమిటు

కైక॥ పతిరో - హితము - వలదుపలుక - సుతునివిపంచు - మీరితో

కౌసల్య। సవతివైర - మిదీనీకు - సహజమెను - వినవేమె ॥ విన ॥ ౧।

## అనుబంధము 17.

### యమన్ రాగము—రూపక తాళము.

తారు। కలితమానసమ్మునా - కలంప నేల వీడుమా। కలి।

కానసా - నివాసమూ - ముదమార - నేను బూనితి -

వినావె - తల్లి - నామతి । కలి । ౧।

మీరరానియానతి - మనసార జేయ - బూనితి -

వినావెతల్లి నామతి । కలిత ॥ ౨।

## అనుబంధము 18.

### భీమపలాస్ రాగము ఖండగతి—త్రిశ్రజాతి తాళము.

కైక। కాంతునీ - కోపమున - కలత జెందె - వ్యాధి ॥కాంతు।

ఆసతులవచనా - జ్వాలలాగావె ।కాంతు।

పరివారి అవమాన - హేలాగు - నేనోర్తు

సైపనే - నపకీర్తి - యిలనెటూ - నిలుతూ । ౧।

## అనుబంధము 19.

### హిందుస్తాని తోడి రాగము—రూపక తాళము.

కౌసల్య। దీనవైతినీ - నేనూ - దీనవైతినీ

ధీరతావదాలె । దీన ।

ఈ రాము - రామా - నిరంతరమూ
నాముదికా - స్మరింతునిన్ను ॥దీన॥ ౧॥
వనములబంపీ - మనగలనా - నే -
తాళజాల - నేనిఁకను - దీన ॥౨॥

అనుబంధము 20.

అసావేరిరాగము—ఆదితాళము.

భరత॥ పావన - రఘుకుల - తిలకా - శ్రీ - రామచంద్రా - దీనదయాళో
గాంచుదయనూ - రఘూత్తమా - రామ ॥పావన॥ పల్లవి॥
కాంతారములా - గంటిఁ జెడుగులకా
కారణమేమో - తెలియదాయెగా ॥పావన॥ ౧॥
దీనశరణ్యా - నిన్నుదలఁచెదకా
కావుమయ్య - నాకలతలడంచీ ॥పావన॥ ౨॥

అనుబంధము 21.

ముఖారిరాగము—ఆదితాళము.

భరత॥ మనంబున వ్యసనములెు - కానానుదారి - వా - కనగా ॥మనం॥ ప॥
మనంబున వ్యసనము - ననూనాకు చింతాచె -
తోపడుమెద్దియు - నే నేమిసేతుకా ॥మనం॥ ౧॥
కాననముకాబలె - గాంచెడుపురమును -
గాంచిన భయముగుఁ - గానవెతమ్ముఁడా ॥మనం॥ ౨॥

అనుబంధము 22.

యమన్ రాగము—ఏకతాళము

తైళ॥ దైవముయిటులా - ఆయె - బ్రదుకూ - చాలా -
బ్రదుకూచాలా ॥దైవము॥ పల్ల॥
పతిపోయెనా - ఖ్యాతియుపోయె - గతిగన శుతినిక - భేదమాయె -
ప్రాణనాథుఁడేగదిలికి - ప్రాణామేలా
విషాదమునా - నిలా - తాపముసోపా ॥దైవ॥ ౧॥

## అనుబంధము 23.

### కాపీరాగము—ఏకతాళము.

భరత॥ వ్యసనాము చాలా ఆయెను - మదినెటుల సహింతుఁ
ఈకలాతలఁ - భరింపఁ - సాధ్యమెనాకు ॥వ్యస॥

కారణంబు దెలియనైతి - గాంచనైతీదారినే
రామరాము - యనుదినంబుఁ - నేమదిఁ - నినుఁ - దలఁచెదఁ ॥౧॥

## అనుబంధము 24.

### భీమపలాస్ రాగము—రూపకతాళము.

కైక॥ భాగ్య హీననైతినయో - భరతుఁడాడు మాటలా -
పాపినైనిలా - నెటూల - బ్రదుకు దాన నేనయొ ॥భాగ్య॥

ఈవిధిగనాథునాడు - తాళజాలనేనయొ -
రాముని అరణ్యమున - అనవరతాము నిల్పితీ ॥భాగ్య॥ ౧॥

## అనుబంధము 25.

### బిభాస్ రాగము—చాప్ తాళము.

కౌసల్య॥ పాపీవిధీననూ - నిటుచేసితే పాపాత్మనైతీనిఁకఁ ॥పా॥
కఠినములాడెను - కాంతమిగులా
నేనెట్లుబ్రదుకుదు - తనయునిబాసీ నేనై పానిఁకఁ ॥పా॥ ౧॥

## అనుబంధము 26.

### కాపిరాగము—ఆదితాళము.

గుహుఁడు॥ ఆనందమాయెను - మానాసము - మానాసము - మదిసంతొాసము
ఘనమానందమాయెను మానాసము ॥ఆనం॥ ౧॥

దీనవనాథునా - మానసుధనా -
మానాసము - మదిసంతొాసము -
ఘనమానందమాయెను - మానాసము ॥ఆనం॥ ౨॥

## అనుబంధము 27.

### కాపిరాగము—త్రిశ్రగతితాళము.

గుహుండు॥ రఘురాముని - నాడుము - నేమదిఁదలఁతునా -
నేమాముని - నుతియింతునే ॥ర॥
పావనచరితము - పాతకహారిణము
సేవక జనక్షేమ - మూలము ॥రఘు॥ ౧॥

## అనుబంధము 28.

### శంకరాభరణరాగము—ఆదితాళము.

సీత॥ కాంతా కాంచుము కానన విభవము
వినుము - పికముల - కలరవము ॥కాంతా॥
రాము॥ అందమా - ఈతరు బృందముగాంచుట
ఎంతయు సంతస మదికొనరించుఁ ॥అంద॥
సీత॥ కాంచుమూహారిణము - కనులపండువుగను
దిరుగుటగని మది కింపొదవెఁ ॥కాంతా॥
రాము॥ కనుల - నేత్రరో - గనుమీ భ్రమరాళిని
సుమరాజముల మకరందము నానెడి ॥అంద॥

## అనుబంధము 29.

### బేహాగురాగము—రూపకతాళము.

సీత॥ దూరమ్మున గాంచుమహెబు - ధూళినిండెనూ
భూరియంధకార - బంధుర - పూరితమయ్యె॥
వినువీధి - ఘనతరమగు విహగము లాదాహామొందు
విహాగములా - దాహామొందు॥
ఘనభీతిగాంచెమనము - గహనము ఘోరమ్మునయ్యె
కానానీ - కథము - విధము - కానానీ - కథమువిధము
కాననము - ఘోరమయ్యెఁ - గాంతకనుము
ఈరీతిని - గాంచె - భీతినీ ॥దూర॥ ౧॥

## అనుబంధము 30.

### కాపిరాగము—రూపకతాళము.

కౌసల్య॥ వరగుణనయా - యోతనయా - కానరాదయా ॥పల్లవి॥
జననినను - కారింపక - కానరాదయా ॥అను॥
వనతలా - వాసములా - వదలుమాయికన్
సనాతనా - స్తోత్రగుణా - భరణగానుమా ॥వర॥
జనావనా - నీజననీ - వచనముల్ - వినా
మనంబున పూనరా - నాతనయా - వైళమే ॥వరగు॥ ౧॥

## అనుబంధము 31.

### కేదారరాగము—రూపకతాళము.

భరతుండు॥ శ్రీకమలకాంత - గోకులవిఖ్యాత - సుస్వాంత సురమునిగణనుత -
విభుశరనితాంత - నితాంతప్రణుత - సుజన - సురవర - తరు ॥శ్రీ॥ ౧॥
సుందమోహినివేషా - నందానందితభా - షాఘనసంతోషా -
సకలగుణ తమోహరణ నిఖిల జగత్త్రాణశరణు -
సుఖము నిడుము కమలవదన - శుభములిమ్ము గొలుతునిన్ను ॥శ్రీ॥ ౨॥

## అనుబంధము 32.

## మంగళము.

### కాపీరాగము—త్రిశ్రగతితాళము.

జగదీశ - యీశ - పాపనాశ - రామ కావుమా
నిగమాంతవిదిత - నీరజ - నేత్ర బ్రోవుమా ॥జ॥
సురవారపోషణ - సూరితోషణ - సుగుణభూషణ
పావనా - అనూన - జనావనా ॥జ॥
అగణ్య - పుణ్యమూర్తిగాంచి - ఆనందమాయెను -
అవార్యశౌర్య - ధీరనీపదంబునమ్మితిన్ -
శ్రీరామ - రామ - ఖలవిరామ - శ్రీనివాసరా ॥జ॥

# పాదుకా పట్టాభిషేక నాటకము.

| పుట | బంతి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| పీఠిక 5-వ పుటలో | కడపటి | కోశాచలం | కోలాచలం. |
| 1 | 9 | పురిజనులం | పురజనులం |
| 3 | 2 | దారుణ్యా | దారుణా |
| 5 | 13 | మంధర | మంథర (ఇట్లన్నిట) |
| 6 | 7 | బఱుగిడి | బరుగిడి |
| ,, | 23 | సుమీ | చుమీ (ఇట్లన్నిట) |
| 8 | 23 | యశ్శృ | యశ్రు |
| 9 | 5 | వ఼ారక | వారక |
| 10 | 11 | యాఁడువారు | ఆఁడువారు |
| ,, | 17 | మఱల | మరల (ఇట్లన్నిట) |
| ,, | 8 | కుట్రిలేమి | కుట్రలేమి |
| 11 | 13 | హినుఁడు | హీనుఁడు |
| ,, | 14 | దుర్భోధన | దుర్బోధన |
| ,, | 15 | కౌనల్య | కౌసల్య |
| 12 | 11 | తనరాజ్వ | తనరాజ్య |
| 13 | 7 | బున్ధి | బుద్ధి |
| 14 | 6 | ధృవం | ధ్రువం |
| ,, | 16 | నవియుచు | యవియుచు |
| 15 | 21 | కుటియ | కుటయ |
| 16 | 15 | నవతి | సవతి |
| ,, | 18 | శుద్ది | శుద్ధి |
| ,, | 20 | అపునమ్మా | అవునమ్మా |
| ,, | 23 | కంటేను | కంటెను |
| 17 | 20 | గనిశాఖి | గనిశాఖి |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 20 | 21 | రాముపట్టి | రామపట్టాభిషేకము |
| 21 | 16 | సిద్ధాంతముని | సిద్ధాంతమును |
| 22 | 4 | నానా | నావా |
| ,, | 6 | నంటివి తే | నంటివే |
| 23 | 18 | కోపఁబడి | కోపపడి |
| 24 | 7 | మూగవైతివియేల | మూఁగవైతివదేల |
| ,, | 19 | ధూళి | ధూళీ |
| 25 | 5 | నగువు | నగవు |
| 29 | 5 | నిదురించితివియా? | నిదురించితివా ? |
| 30 | 18 | వార్థిక | వార్ధక |
| 32 | 8 | మఱచితివియో | మఱచితివో |
| 34 | 20 | దుస్ప్రసహం | దుష్ప్రసహం |
| 35 | 7 | మెత్తనని | మెత్తనయని |
| 36 | 3 | మగిని | మగని |
| ,, | 4 | చంచలయని | చంచలవని |
| ,, | 16 | యాయాశ | యాయాస |
| 38 | 5 | కప్పుకొని కౌఁగలించి | కట్టుకొని కౌఁగిలించి |
| ,, | 7 | చుంటివియే | చుంటివే |
| ,, | 20 | వ్యాకులాయత | వ్యాకులాయత్త |
| ,, | 22 | మానఁ | మాన |
| ,, | 24 | ననుముమ్ము | నన్నుముమ్ము |
| 40 | 3 | ననుకూలంబుగ | అనుకూలంబుగ |
| ,, | 17 | కంటకంబు లచటి | కంటకంబుల నచట |
| 41 | 4 | వ్యాకులము | వ్యాకులమును |
| ,, | 4 | మానసమంట | మానసమునంట |
| 42 | 2 | వైతివియే | వైతివే |
| ,, | 23 | వత్తున్నిను జ్వేరఁగా | వత్తున్నిను గ్గిల్వఁగా |
| 43 | 19 | సెలువిమ్ము | సెలవిమ్ము |
| 44 | 12 | ్రవేని | లేని |
| ,, | 17 | దుస్పహా | దుస్సహా |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| ,, | 22 | ప్రయాస | ప్రయాసముల |
| 45 | 15 | జెందవమ్మా | జెందుమమ్మా |
| 47 | 1 | విడున | విడువ |
| 48 | 24 | దీనోక్తులటు | దీనోక్తులనిటు |
| 49 | 5 | యెదుటఁ | యెదుటను |
| 50 | 14 | పరుపునఁ | పనుపునఁ |
| 56 | 12 | కనుకందని | కనుఁగందని |
| 57 | 8 | కాఁదచే | కాదటే |
| ,, | 19 | వాసబు | వాసంబు |
| ,, | 21 | సత్యవాది | సత్యవాది |
| 60 | 6 | మోహమున | మోహమున |
| ,, | 19 | పన్నము | బన్నము |
| ,, | 24 | యరచి | యఱచి |
| 61 | 5 | నీకు | నేనునీకు |
| 62 | 8 | నరణ్యంబులఁ | నరణ్యంబులకుఁ |
| 63 | 13 | రంజిలనుండఁగ | రంజిలుచుండఁగ |
| 65 | 6 | శిరము | శిరము |
| 68 | 2 | గాచు | గాంచు |
| ,, | 3 | నివసీతు | నివసింతు |
| ,, | 17 | "రాము నినమ్మినవాఁడు" | " రాముని నమ్మినవాఁడు " |
| 69 | 2 | వెడలుసం | వెడలుసం |
| 71 | 16 | నుడ | నుండ |
| ,, | 24 | కూరుక్రట్టిన | కూరుక్రపట్టిన |
| 73 | 13 | వాసంబున | వాసంబునకుం |
| 74 | 18 | వెబడి | వెంబడి |
| 76 | 3 | ముద్మిద్దు | ముద్దిమ్ము |
| ,, | 21 | గాను | గాదు |
| ,, | 24 | యూధర | ఊధర |
| 77 | 1 | నెన్నెల్ల | నన్నెల్ల |
| ,, | 12 | సతాప | సంతాప |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 77 | 16 | నగపడు | అగపడు |
| ,, | 21 | వావన | పావన |
| 78 | 20 | మానవుఁ | మానవుఁ |
| 79 | 22 | కౌసల్యా:— | కౌసల్యా! |
| 80 | 22 | అమె | ఆమె |
| 81 | 4 | సుమంతుఁడు | సుమంత్రుఁడు (ఇట్లు అన్నిట) |
| 85 | 21 | దరుతర | దురుతర |
| 88 | 9 | ఓవు | నీవు |
| 91 | 16 | కులారవ | కులార్ణవ |
| 92 | 2 | త్యాగబు | త్యాగంబు |
| ,, | 23 | నతింపఁ | నుతింపఁ |
| 93 | 11 | వనిమ్రు | వినమ్రు |
| 94 | 20 | వేకాంగి | నేకాంగి |
| 95 | 3 | హైవ్యం | హైన్యం |
| ,, | 18 | రాజ్యం | రాజ్యంబు |
| 96 | 3 | పార్థక | సార్థక |
| 98 | 6 | బమలు | జనులు |
| ,, | 7 | పవి | పని |
| ,, | 22 | దుహితములకు | దుహితులకు |
| 101 | 6 | కావువ | కావున |
| 102 | 8 | రాఘువుని | రాఘవుని |
| ,, | 9 | వంశ | వంశం |
| 105 | 21 | చల్లన | చల్లని |
| 108 | 4 | నుందర | సుందర |
| ,, | 11 | నదనంబు | నందనంబు |
| 108 | 21 | అసుజా | అనుజా |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 109 | 13 | ష్మని | రష్మని |
| 110 | 24 | గట్టడి | గట్టిఁడి |
| 112 | 9 | ఘవ్నించు | ఘన్నించు |
| ,, | 10 | ఘవ | ఘన |
| 114 | 21 | కేవనైత్తి | లేవనైత్తి |
| 116 | 2 | లాచంరిచి | లాచరించి |
| 118 | 1 | ఘుంద్ని | ఘుందిన్ని |
| ,, | 15 | వానుఁ | వాను |
| ,, | 21 | ప్రితిని | ప్రీతిని |
| 120 | 14 | వానంబు | వాసంబు |

## పాటలు

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 16 | బ్రాత్మె | భ్రాత్మె |
| 5 | 14 | బుద్ది | బుద్ధి |

## ALL RIGHTS RESERVED.

This book is fully protected by any Indian and foreign copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language or stage it without permission or offer it for sale. A substantial copy of words ideas contained herein constitutes an infringement of copy-right & notice is hereby given that a suit will be filled in every case of infringement.

No one should buy a copy of this book which has not got my seal.

K. SATHRUGHNA RAO.

ఇందువలన సకలురకు తెలియజేయడ మేమన క్రొత్త కాపీరైటు ఆక్టుప్రకారము ఈనాటకముయొక్క సర్వ స్వాతంత్రియములు నాకు చెందియున్నవి. నాయనుమతిలేనిది భాషాంతరీ కరణమేమి, ఖేలనమేమి చేయకూడదు. అటు చేసినవారు కాపీరైటు ఆక్టుకు విరుద్ధము చేసిన వారగుదురు. నా నష్టమునకు లోబడుదురు.

నాసీలు ముద్రలేనిదే ఈగ్రంథము నెవరు గొనగూడదు.

కె. శత్రుఘ్నరావు.

# ప్రకటన.

బళ్ళారి మునసప్పుకోర్టు వకీలుగానుండి
కీ. శే. కోలాచలం శ్రీనివాసరావుగారిచే
రచియింపబడిన

ఈ క్రింద వివరించిన నాటకములన్నియును విక్రయమునకు సిద్ధముగా నున్నయవి. మిగత నాటకము లతిత్వరలో ముద్రింపబడును.

## నాటకముల వివరము.

(1) రామరాజ చరిత్రము.

(2) సుల్తానా చాందుబీ.

(3) రుక్మాంగధ చరిత్రము.

(4) సత్య హరిశ్చంద్రీయము

(5) కుశలవ చరిత్రము.

(6) పాదుకా పట్టాభిషేకము.

(7) ద్రౌపదీ మానసంరక్షణము.

(8) ఆంధ్ర కృతాగస్త్యభారతము [పద్యకావ్యము] సభాపర్వము వరకు

(9) Dramatic history of the world (in English.)

**K. SATHRUGHNA RAO,**
*Ramavilas civil lines, Bellary*